# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

మే
2025

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 18 సంచిక: 5

**సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**

ప్రధాన సంపాదకులు:

**పుల్లగూర్ల సాయిరెడ్డి**

(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:

**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్: సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040-27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| భక్తిభావ సంజాతం భాగవతం | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 10 |
| తిరుప్పావై | 22 |
| అనంతాళ్వార్ల ఆచార్య నిష్ఠ | 27 |
| రామాయణ రత్నాకరం | 30 |
| సరస్వతీ నదీ పుష్కరాలు | 36 |
| శ్రీకృష్ణ తత్త్వం | 39 |
| ముకుందమాల | 41 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 45 |
| మీ ప్రశ్న మా సమాధానం | 50 |
| తిరుమల సర్వస్వం | 51 |
| అపార జ్ఞాన సంపన్నులు జగద్గురు శంకరాచార్యుడు | 54 |
| అమరనీతి నయనార్ | 57 |
| శనైశ్చరా నమోస్తుతే | 60 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


## భక్తుల రకాలు

భగవంతుని చేరుటకు నవవిధ భక్తిమార్గాలను పెద్దలు చెప్పారు. శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అని ఈ తొమ్మిది రకాల పద్ధతులలో దేనిద్వారానైనా భక్తులు భగవంతుణ్ణి ఆశ్రయించవచ్చును. మరియు భక్తుడు, ఉపాసకుడు, సాధకుడు అని మూడు పదాలు కూడా భక్తి ప్రపంచములో ఉన్నవి. నిజానికి ఈ మూడూ పైకి ఒక రకంగానే కనిపించినా, కొంచెం తేడాగా ఉంటుంది. ఉపాసకుడు అంటే ప్రత్యేక సమయంలో తంత్ర మంత్ర పద్ధతులతో పూజించేవాడు. సాధకుడు అంటే... ప్రత్యేక లక్ష్యం కోసం నిరంతరం సాధన చేసేవాడు. ఇక భక్తుడు అంటే... భగవంతుణ్ణి అమితంగా ప్రేమించేవాడు. భగవంతుడు ఏమి ఇచ్చినా... ఇవ్వకపోయినా వెరవకుండా ఉన్నంతలో తృప్తిగా జీవిస్తూ భగవంతుని క్షేమం కోసం ప్రాకులాడేవాడు. తన సంతోషం కంటే భగవంతుని తృప్తే ప్రధానంగా జీవించేవాడు నిజమైన భక్తుడు. అందుకే భక్తుడంటే భగవంతునికి అమితానందం. భగవంతుణ్ణి కేవలం భక్తితో సాధించగలం తప్ప మరో ఉపాయం లేదు. ఆర్తి కలిగిన భక్తి భగవంతునికి ఇష్టం. కొందరు భక్తులు తమ కష్టాలు తీరిస్తే... నీకింత ధనమిస్తానని, ఫలానా వస్తువు చేసిపెడతానని రక రకాల వాగ్దానాలు చేస్తుంటారు. ఇది నిజమైన భక్తి కాదు. భక్తిలో బేరసారాలు ఉండకూడదు. ఈ లోకంలో జీవించు ప్రతి మానవుడు యోగమాయ ప్రభావానికి లోబడి చిక్కుల్లో చిక్కి ఉన్నమాట వాస్తవం. దీనినుండి బయటకు రావడం కేవలం భగవంతుని కృపతోనే సాధ్యపడుతుంది. ఈ కృపను పొందాలంటే భగవంతునికి ఇష్టమైన విధంగా సదా ధ్యానిస్తూ జీవించాలి. లోకంలో ఏదీ నాది కాదు అనే భావన కలిగి అనన్య భక్తితో స్వామివారిని ధ్యానిస్తూ జీవించాలి. ఇది అత్యంత ప్రధానమైనది. అంతేకానీ... మనం సంపాదించిన ఆస్తులపై కూడా మన పెద్దరికం పనికిరాదు. అవి భగవంతునివని, ఆయన భిక్షచే సమకూరాయని భావించుట ఉత్తమము. ఎంతవరకు మనము శక్తిని ప్రదర్శిస్తామో... భగవంతుని శక్తిని అందుకోలేము. అశక్తివంతులమైనప్పుడే భగవంతుడు ఆదుకోగలడు. మర్కట మార్జాల కిశోర న్యాయాలలో మనము మార్జాల (పిల్లిపిల్ల), కిశోర న్యాయాన్ని అనుసరించాలి. కోతి, పిల్లను కన్నప్పుడు, ఆ కోతి రకరకాల ప్రాంతాలు తిరిగే సమయాన ఆ కోతిపిల్ల, తల్లి పొట్టను గట్టిగా పట్టుకుంటుంది. ఆ పిల్ల గట్టిగా పట్టుకోలేకపోతే పిల్లకే ప్రమాదం, క్రింద పడిపోతుంది. కాని పిల్లి విషయంలో అలా కాదు. పిల్లి తన పిల్ల యొక్క మెడను గట్టిగా కరిచిపట్టుకుని రకరకాల ప్రాంతాలు త్రిప్పుతుంది. ఇక్కడ తల్లే తన పిల్లను పట్టుకుంటుంది కాబట్టి బాధ్యత మొత్తం తల్లిపైననే ఉంటుంది. ఇదే విధంగా భక్తుడు కూడా తను శక్తివంతుడనని భావించక తన బాధ్యతను భగవంతునిపై పెట్టి జీవించుట ఉత్తమం. అందుకే పెద్దలు మార్జాల కిశోర న్యాయాన్ని అనుసరించమన్నారు.

భగవంతుణ్ణి, భక్తుడు ఈ సృష్టిలోని అన్ని వస్తువులలో, అన్ని జీవులలో దర్శించాలి. ఈ సృష్టిలో భక్తుడు, భగవంతుడు ఈ ఇద్దరు తప్ప మరొకరు లేరనే అభిప్రాయం కలగాలి. ఈ భక్తుడు సదా భగవంతుని సమక్షంలో జీవిస్తున్నానని దృఢ అభిప్రాయంతో జీవిస్తూ ఉండాలి. భగవంతుడు మెచ్చే పనులను మాత్రము చేయాలి. ఇలా సదా భగవంతునికి శరణాగతుడై, దాసుడై, తన వ్యక్తిత్వమును త్యజించి, భగవంతుని మెప్పే లక్ష్యంగా జీవించు భక్తుడు ధన్యుడు.

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 2 సం\|\| | 500-00 |
| ☐ 4 సం\|\| | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన
ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________



మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**




# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా|| కె.వి. రాఘవాచార్యులు

శ్లో ||అజ్ఞానినా మయా దోషా నశేషాన్ విహితాన్ హరే
క్షమస్వత్వం క్షమస్వత్వం శేషశైల శిఖామణే

తా త్పర్యం – శ్రీహరీ! శేషాచలపతీ! అజ్ఞానముచే నేను చేసిన దోషములన్నింటినీ నశింపచేయుము. దోషకారి అయిన నన్ను క్షమింపుము, క్షమింపుము.

శ్లో ||ఈశానాం జగతోఽస్య వేంకటపతే ర్విష్ణోః పరాం ప్రేయసీం
తద్వక్షస్థల నిత్యవాస రసికాం తత్ క్షాంతి సంవర్ధినీం
పద్మాలంకృత పాణి పల్లవ యుగాం పద్మాసనస్థాం శ్రియం
వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరం

తాత్పర్యం – ఈ ప్రపంచమునకు నాయకి, వేంకటాచలపతియగు విష్ణుదేవునకు ప్రేయసి, ఆతని వక్షస్థలమున నిత్య నివాసము కోరునది, అతని క్షమా గుణమును అభివృద్ధి చేయునది, చిగురాకుల వంటి చేతులలో పద్మపుష్పములను ధరించినది, పద్మాసనమున కూర్చున్నది, వాత్సల్యము మొదలగు గుణములతో ప్రకాశించునది, జగన్మాత, పూజింపదగినది అగు లక్ష్మీదేవికి నమస్కరించుచున్నాను.

# ముక్తిమార్గము



భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య

## శంకరాభరణం

కొనరో కొనరో మీరు – కూరిమి మందు
ఉనికి మనికి కెల్ల – నొక్కటే మందు ||పల్లవి||

1. ధ్రువుడు గొనిన మందు – తొల్లియుఁ బ్రహ్లాదుఁడు
చవిగాఁ గొనిన మందు – చల్లని మందు,
భవరోగములు వీడి – పారగఁ బెద్దలు మున్ను
జవకట్టికొనిన ని – చ్చలమైన మందు ||కొనరో||

2. నిలిచి నారదుఁడు గొ – నిన మందు జనకుఁడు
గెలుపుతోఁ గొని బ్రతి – కిన యామందు
మొలచి నాలుగు యుగ – ముల రాజులు ఘనులు
కలకాలము గొని – కడగన్న మందు ||కొనరో||

3. అజునకుఁ బర – మాయువై యొసగిన మందు
నిజమై లోకము లెల్ల – నిండిన మందు
త్రిజగములు నెఱుఁగ – తిరువేంకటాద్రిపై
ధ్వజమెత్తెఁ గోనేటి – దరి నున్న మందు ||కొనరో||





భావము – జనులారా!

ప్రేమస్వరూపుడైన భగవంతుడు అను ఔషధమును మీరు చేకొనుడు. సుఖముగా లోకమున జీవించుటకిది యొక్కటే తగిన మందు.

పూర్వము ధ్రువుడీ మందు సేవించెను. ప్రహ్లాదుడీ మందును మిక్కిలి ప్రీతితో స్వీకరించెను. ఇది యెట్టి ఉద్వేగమును కల్గింపని చల్లని మందు. సంసార రోగమును పోగొట్టుకొనుటకై తొల్లి మహనీయులైనవారు పలువురు శాశ్వతమైన ఈ మందును తమ స్వాధీనము గావించుకొనిరి.

ఈ మందునే నారదుడు శ్రద్ధతో సేవించెను. విదేహాధిపతియైన జనకుడు విజయోత్సాహముతో ఈ మందునే స్వీకరించి బ్రహ్మానందముతో జీవించెను. వారు వీరననేల? నాలుగు యుగములకు చెందిన నరపతులు, మహాత్ములు జీవించినంతకాలము ఈ మందునే సేవించి ముక్తులైరి.

ఈ మందే బ్రహ్మదేవునకు పరమాయువై విలసిల్లినది. ఇదే సత్య స్వరూపమై భువనములెల్ల నిండియున్నది. కోనేటి గట్టుననున్న ఈ మందే ముల్లోకము లెఱుంగునట్లు 'నా వలె భవరోగము పరిమార్ప గల మందింకొకటి లేదు' అని శ్రీవేంకటాద్రిపై టెక్కెమెత్తి చాటినది. (ధ్వజమెత్తి అను పాఠమైనచో ధ్వజమెత్తి చాటుచు కోనేటి గట్టుననున్న మందు అని భావము)



# “భక్తి భావ సంజాతం భాగవతం”

– డా|| కూర్మాచలం శంకరస్వామి

“నిగమములు వేయి జదివిన
సుగమంబులు గావు ముక్తి సుభగత్వంబుల్
సుగమంబు భాగవతమను
నిగమంబు పఠింప ముక్తి నివసనము బుధా!

ఓ మహాత్మా! ఎన్ని వేదములు చదివినను అవి సులభముగా ముక్తిని ప్రసాదింపచాలవు. “భాగవతమను” వేదమును భక్తి శ్రద్ధలతో చదివినా లేదా చెవులారా విన్నా మోక్షము మనకు కొంగు బంగారమే అగును. ఏలననగా శ్రీమద్భాగవతము ముక్తి దాయకం. కనుక మానవుడు దీనిని నిరంతరం పఠించవలెను అని శుకమహర్షి పరీక్షిన్మహారాజుతో చెప్పినట్లుగా సూతమహర్షి శౌనకాది మునులతో భాగవత విశేషాల గురించి వివరించాడు.

లౌకిక సుఖములన్నియు క్షణికములు, నశ్వరములు. మోక్షము పరమానందదాయకము. కనుక మానవుడు ఎన్ని జన్మలనెత్తినను దివ్యమైనట్టి ముక్తి కొరకే తపన పడుతుంటాడు. అది కేవలం భగవంతుని అనుగ్రహం వలన ప్రాప్తించును. భక్తి జ్ఞాన వైరాగ్యములు కలిగి నిష్ఠతో ఆ దేవదేవుని సేవించినప్పుడే ఆయన అనుగ్రహం లభిస్తుంది.

పుణ్యపురుషుడైన బమ్మెరపోతన తెలుగులో శ్రీమద్భాగవతమునకు శ్రీకారము చుట్టుచు దాని పరమార్థము గురించి ఇట్లు ప్రస్తావించెను.

“శ్రీ కైవల్యపదంబు జేరుటకునై చింతించెదన్ లోకర
క్షైకారంబకు, భక్తపాలన కళా సంరంభకున్ దానవో
ద్రేకస్తంభకు, కేళీలోల విలసదృగ్జాల సంభూత నా
నా కంజాత భవాండ కుంభకు, మహానందనాంగ డింభకున్”

ఆనందస్వరూపిణియైన యశోదా కిశోరుని (నంద యశోదల ముద్దుల పట్టియైన బాలకృష్ణుని) శ్రీకైవల్య

ప్రాప్తికై నుతించెదను. ఆ స్వామి లోకరక్షణకై అవతరించెను. భక్తులను పాలించుటలో సర్వసమర్థుడు. లోక కంటకులైన దానవుల యొక్క క్షుద్రావేశములను రూపు మాపుటలో తిరుగులేనివాడు. లీలావిలాసముగా తన క్రీగంటి చూపులతో ప్రసరింపచేసినంత మాత్రమున వివిధములగు బ్రహ్మాండ భాండములను పరికల్పన చేయుటలో కుశలుడు. అట్టి శ్రీకృష్ణ పరమాత్మను నేను త్రికరణశుద్ధిగా స్మరింతును. ఈ పద్యము దైవ ప్రార్థనతో ఒప్పుచున్నది. ప్రార్థన ద్వారా ఆశీర్వాద పూర్వకముగా, వస్తు నిర్దేశముతో కావ్యమును ప్రారంభించుట సత్కవుల సంప్రదాయము. ఇందులో దైవస్తుతి – వస్తు నిర్దేశము – అను రెండు లక్షణాలతో అలరారుచున్నది. వస్తువు అనగా కథ. సూత్ర ప్రాయముగా కథలను, గాథలను ప్రస్తావించుటకు వస్తు నిర్దేశము అని విజ్ఞులు తెలిపిరి. ఇందు భగవంతుని లీలలు, వాటి ప్రభావాలు, భక్తుల వైశిష్ట్యములు కలవని సూచింపబడుచున్నది. భాగవతమనగా భగవంతుని యొక్క, భక్తుల యొక్క, విశిష్ట గుణవైభవములతో విలసిల్లుచున్న విశిష్ట పురాణ రాజము.

"మత్స్య కూర్మో వరాహశ్చ నారసింహ్మశ్చ వామనః ।
రామో రామశ్చ కృష్ణశ్చ బౌద్ధః కల్కితే దశ ॥

ఈ శ్లోకమునందు శ్రీమహావిష్ణువు యొక్క దశావతారములు పేర్కొనబడ్డాయి. మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, శ్రీరామ, కృష్ణ, బుద్ధ, కల్కి అవతారములు అనునవి పది. ఈ భాగవతము నందు మత్స్యాది పది అవతారములను గురించి వివరించుట జరిగింది. ప్రహ్లాదుడు, గజేంద్రుడు, ధృవుడు మున్నగు పరమ భక్తుల యొక్క గాథలు, వాటి మాహాత్మ్యములు మధుర శైలిలో మలచబడ్డాయి. నారదాది దివ్యమహర్షుల వృత్తాంతాలు ఇందులో ప్రస్తావించబడ్డాయి.

భక్తి మార్గమును అవలంబించినచో, సద్భక్తితో సేవించినచో భగవంతుని అనుగ్రహము లభించునని తెలుపుతుంది భాగవతం. ఇందులో నవవిధ భక్తిమార్గములు ఎంతో గొప్పగా వర్ణించబడ్డాయి. భాగవతం ఒక మందార మకరందం. కొందరు తెలుగు తీయందనాలకు మురిసిపోతారు. మరికొందరు ఉభయ భాషల సారస్వతాలకు ఉవ్విళ్ళూరుతారు. ఇంకొందరు సంస్కృత పద సంపదకు పరవశించెదరు. దైవానుగ్రహముతో నేను కూడా సందర్భానుసారముగా అందరినీ మెప్పింతునని పోతన నిబ్బరంగా పేర్కొన్నాడు. భాగవతమును కల్పతరువుగా పోతన ఇలా పేర్కొన్నాడు.

"లలిత స్కంధము, కృష్ణమూలము, శుకాలాపాభిరామంబు, మంజులతా శోభితమున్, సువర్ణ సుమనస్సు జ్ఞేయమున్, సుందరోజ్జ్వల వృత్తంబు, మహాఫలంబు, విమల వ్యాసాల వాలంబునై వెలయున్, భాగవతాఖ్య కల్పతరువుర్విన్, సద్ద్విజశ్రేయమై"

ఇందులో భాగవతమునకును, కల్పతరువునకును అనుగుణముగా ప్రయుక్తములైన విశేషములు అత్యంత లలితములు, పరమ సుందరములు. దీనికి నిదర్శనం ఈ ఆణిముత్య పద్యమే.

ఈ భాగవతము నందలి స్కంధములు మిక్కిలి లాలిత్య శోభితములు. దీనికి కృష్ణుడే మూలము (ఇది కృష్ణ లీలా మయము). ఇది శుకయోగి యొక్క మధుర వచనములచే మనోజ్ఞమైనది. సుకుమారమైన పదసంపదతో విలసిల్లుతుంది. అందలి అక్షర రమ్యత సామాన్య పాఠకులనే గాక, పండితులను, దేవతలను సైతం మురిపింపచేస్తుంది. గాథలన్నియు మనోహరములు, సందేశాత్మకములు. దీని పఠన వలన కలిగెడి ఫలము మోక్షము. వ్యాసమహర్షియే దీనికి కుదురు. ఈ భాగవతము ఉత్తములైన బ్రాహ్మణాదులు, అందరికినీ (దేవతలకును) శ్రేయో లాభములను పంచి ఇచ్చును. కల్పతరువు పరముగా కల్పతరువు యొక్క కొమ్మలు మృదువైనవి. దాని ఫలములు రసవంతమైనవి. అలాగే భాగవతంలోని అన్ని స్కంధాలు, వాటిలోని మహనీయ చరిత్రలు మరపురానివి. వారు బోధించిన ధర్మాలు అందరికీ ఆదర్శనీయాలు. ఈ కవి తీర్చి దిద్దిన ప్రతి స్కంధము ఒక రసవత్కావ్యము. ఈతని రచనాశైలి, ఛందోలంకారములు పాఠకులకు పండిత, పామరులకు మనోరంజకాన్ని కలిగిస్తాయి. భావావేశాలు కట్టలు త్రెంచుకుని నిరాఘాటముగా పురోగమించును. రచనా కౌశలం అమోఘం. అది ఏ ఘట్టమందైనను, రస పరిపుష్టము గావించుచుండును. శిల్పశోభలను వెల్లివిరియజేయును. ఈ పూరణమంతటను భక్తి సామ్రాజ్యానికే పెద్ద పీట వేసినట్లు కనపడుతుంది. అయినను శృంగార, వీర, కరుణాది రసములను సముజ్జ్వలముగా పోషించుటలో చేయి తిరిగినవాడుగా ప్రసిద్ధి పొందాడు పోతన.

యశోదాదుల మాతృభావనలను, నందాదుల పితృభావములను, నరకాసురుని వధించు సమయాన సత్యభామలో వీర, శృంగారములను, రుక్మిణిలో ప్రౌఢమైన ధైర్య సాహస ప్రవృత్తి, ప్రహ్లాదాది పరమ భక్తులలో అచంచలమైన భక్తి తాత్పర్యములను, కుచేలాదులలో నిష్కామ యోగ్యాలను, ఋషుల అంశలతో జన్మించిన గోపికలలో మధురభక్తిని, కంసాది దుష్టుల ఆట కట్టించుటలో శ్రీకృష్ణ లీలా వైభవములను, యశోదమ్మకు బాలకృష్ణుని ముఖమున బ్రహ్మాండములను ప్రదర్శింపచేయుటలో అద్భుత స్థితిని, లోక కళ్యాణార్థమై ప్రవర్తిల్లిన దశావతార వైభవములను వెల్లివిరియ జేయుటలో ఈ మహాకవి చూపిన ఒడుపు, జన మనోరంజకముగా వాటిని పరిపోషించిన తీరు అమోఘం. సందర్భోచితం. ఈ ఘట్టములన్నియును పఠితులను మురిపింప చేయుచు, వారి హృదయములను రసానందమున కందళింప చేయును. ఆ మహాకవి చేతిచలువలు అట్టివి. దీనిలోని పద్య గద్యాలు తెలుగునాట – అందరినోట వినిపించినవే.

పోతన కవితా ధారతో పరిపూరితములైనవే. మచ్చుకు కొన్ని ఘట్టములను పరిశీలింపుడు.

అన్ని యుగముల యందును, ఎల్లవేళల యందును, సకల లోకములందును, ధర్మానికి, అధర్మానికి, సత్యానికి, అసత్యానికి, సత్త్వమునకు, తమోగుణమునకు, పుణ్యపాపములకు మధ్య ఎప్పుడూ ఘర్షణలు జరుగుతూనే ఉండును. వెలుగుల ముందు చీకట్లు పారిపోతూనే ఉంటాయి. అంతిమ విజయం ధర్మానికే దక్కుతుందని ఈ భాగవతం నిరూపిస్తుంది. ముఖ్యంగా ప్రహ్లాద చరిత్రను గమనించిన ఈ విషయము మనకు చక్కగా బోధపడుతుంది. ఇచ్చట ప్రహ్లాదుడు ధర్మానికి ప్రతీక. హిరణ్యకశిపుడు అధర్మానికి ప్రతీక. అధర్మము వెర్రితలలు వేస్తున్నప్పుడు ధర్మము దానిని అదుపు చేయుచు సాధు సంరక్షణము గావించుచుండును. భగవదవతార లక్ష్యము గురించి తెలుపుచు శ్రీకృష్ణుడు భగవద్గీతలో ఇలా పేర్కొన్నాడు.

**"పరిత్రాణాయ సాధూనాం – వినాయశాయచ దుష్కృతామ్ ।**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే ॥**

సత్పురుషులను సంరక్షించుటకు, దుష్టులను రూపుమాపుటకు, ధర్మమును స్థిరము గావించుటకు నేను ప్రతి యుగములో తదనుగుణముగా అవతరింతును అని పలికినట్లుగానే ఈ భాగవతంలో దశావతారాల వర్ణన చాలా చక్కగా వర్ణించబడినది.

సనక సనందాదుల వలన శాపగ్రస్థులైన జయ విజయులు హిరణ్యాక్ష, హిరణ్యకశిపులై జన్మించారు. యజ్ఞవరాహస్వామి ధాటికి హిరణ్యాక్షుడు అంతమయ్యాడు. సహజముగానే సురద్వేషి అయిన హిరణ్యకశిపుడు ఆ క్షణము నుండి తన ద్రోహ బుద్ధికి మరింత పదును పెట్టసాగాడు. దేవతలను తరిమి తరిమి కొట్టడం, సురాధిపతులైన దేవేంద్రాదులను కడగండ్లపాలు చేయుట, సిద్ధులను పరివేధించుట, ముని ప్రముఖులను వారి పత్నులను చెరచి బాధించుట, యక్ష, కిన్నర, గరుడ, గంధర్వ రాజులను, నాగులను, వారి అధిపతులను నశింపచేయుట మొదలగు దుష్టకార్యాలు వానికి నిత్యకృత్యాలయ్యాయి. ఆ దైత్య ప్రముఖుడు దిక్పాలురపై కోపము పెంచుకొని దేవతలను బంధించుట, తోచిన రీతిగా విశృంఖలముగా ఆయా దిక్కులను దాడి చేయటం, సకల ప్రాణులను విచక్షణా రహితముగా చంపుట మొదలగునవి అతనికి సహజములయ్యెను. దీనితో ధర్మము నశించి భూమిపై అధర్మము పెరిగిపోయింది. భగవంతుని సంకల్పము ననుసరించి మహాభక్తుడైన ప్రహ్లాదుడు అతనికి పుత్రునిగా జన్మించెను. ఇతనికి భూతదయ ఆరవ ప్రాణము. పెద్దల యెడ భృత్యుడై ఉండెను. స్త్రీల యెడల మాతృభావము కలిగి యుండెను. దీనుల యెడల అతనికి గల ప్రేమ అపారము. తోటి వారి యెడల సోదర భావము చూపించుచుండెను. గురువులను దైవములుగా తలచుచు వారియెడల పూజ్యభావము కలిగియుండెను. అబద్ధములాడుట ఇతనికి తెలియదు. మర్యాద జీవనమే ఇతనికి లాలిత్యమైనది.

తల్లి కడుపులో ఉన్నప్పుడు నారదమహర్షి ఉపదేశముతో ఇతనికి హరిభక్తి అబ్బినది. ఈ భక్తి గురించి పోతన ఇలా వివరించాడు.

**"పానీయంబులు ద్రావుచున్, భాషించుచున్ హాస లీ**
**లా నిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత**
**శ్రీ నారాయణ పాద పద్మయుగళీ, చింతామృతాస్వాద సం**
**ధానుండై మఱచెన్ మురారిసుతుండే తద్విశ్వమున్ భూవరా!**

పానీయములు త్రాగుట, ఆహారమును తీసుకొనుట, మాట్లాడునప్పుడు, చివరికి నిద్రపోయేటప్పుడు కూడా హరినామ స్మరణ అతనికి ఉచ్ఛ్వాస నిశ్వాసముల వలె విడదీయరాని విధంగా బంధమయ్యెను. ఈతని చేష్టలు హిరణ్యకశిపునకు దుర్భరము లాయెను. గురువుల శిక్షణలోనైనా ఇతనిలో మార్పు వస్తుందేమో యని గురుకులమున చేర్పించెను. విద్యాప్రాధాన్యత గురించి పోతన హిరణ్యకశిపుని చేత ఇలా పలికించాడు.

**"చదువని వాడజ్ఞుండును**
**చదివిన సదసద్వివేక చతురుత గల్గున్**
**చదువగ వలయును జనులకు**
**చదివించెద నార్యుల వద్ద చదువుము తండ్రీ"**

విద్య నేర్చుకోనివాడు అజ్ఞానాంధకారంలో కొట్టుకుపోవును. చదువు కల్గిన మంచి చెడుల వివేకము, ఓర్పు, నేర్పు, చురుకుదనములు కలుగును. కావున ప్రతి వ్యక్తి చదువుకొని తీరవలయును. అందువలన నాయనా (ఓ ప్రహ్లాదా) నీకు విద్యాబుద్ధులు నేర్పుటకై నిన్ను గురుకులమున పండితుల వద్ద ఉంచెదను. బ్రహ్మనిత్యము. తదితరమంతయు అనిత్యము. నిత్య – అనిత్యము – అనిత్యవస్తు వివేకమే చదువు యొక్క పరమార్థము. ఉదర పోషణార్థము ఏయే విద్యలు నేర్చినను వాటి ప్రభావాలలో పడి ఈ విద్య పరమార్థాన్ని విస్మరించరాదు. హిరణ్యకశిపుడు తెలిసి చెప్పినను, తెలియక చెప్పినను విద్యల అంతరార్థము అతని నోట ప్రకటితమైనది. ఇది అక్షరసత్యము. కావున ప్రజలు దీనిని తప్పనిసరిగా పాటించాలి. ఇలాంటి పారమార్థికమైన అంశాలు పోతన భాగవతములో కోకొల్లలు.

ఈ సందర్భమున ప్రహ్లాదుడు బోధించిన భక్తితత్త్వ ప్రబోధము ఆత్మ జ్ఞానాత్మకము గావించును. ఇలాంటి మహోపదేశములలో దొఱలిన వన్నియును పరిమళములతో కూడిన పసిడి పలుకులే.

**"ఎల్ల శరీర ధారులకు నిల్లను చీకటి నూతి లోపలన్.......**
**మందార మకరంద మాధుర్యమున దేలు.......**
**తను హృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్......**
**అందెందూదయముల్ బధిర శంఖారావముల్......**
**హరిభక్తి వర్జితుల రిక్త వ్యర్థ సంసారముల్.......**
**కమలాక్షు నర్చించు కరములు కరములు**

శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
కంజాక్షునకు గాని కాయంబు కాయమే.......
విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుడే......
పాదయుగము తోడి పశువు గాక.......
సంసార జీమూత సంఘంబు నిచ్చునే......
భక్తి దాస్య ప్రభంజనము లేక......

మున్నగు పద్యములన్నియు సాత్త్విక ధోరణులు గల సామాన్యులకు కనువిప్పు కలిగించును. వారిని భక్తి మార్గము వైపు మరలించే దారి దీపాలు.

తన హింసాకృత్యములన్నియు వమ్మైపోవుట చేత దైత్యరాజైన హిరణ్యకశిపుడు దిక్కుతోచని వాడై ఎక్కడరా? నీ హరియని కుమారుడైన ప్రహ్లాదుని గద్దించెను. అప్పుడు ప్రహ్లాదుడు ఇలా బదులిచ్చాడు. ''కలడంబోధి కలండు గాలిన్'' అని శ్రీహరి యొక్క సర్వవ్యాపకత్వాన్ని తెలుపుచు కడకు ''ఇందుగలడందు లేడను సందేహము వలదు చక్రి సర్వోపగతుండు డెందెందు వెతికి చూచిన అందందె కలడు దానవాగ్రణి! వింటె'' అని పరమ విశ్వాసముతో పలికెను. అయినచో ఈ స్తంభమునందు కలడా? అని హిరణ్యకశిపుడు మిగుల భీకరముగా పలికెను. ప్రహ్లాదుని ప్రార్థనను మన్నించి ఆ శ్రీహరి ''నరసింహుడు''గా ఆ స్తంభమునుండి ఆవిర్భవించి లోక కళ్యాణార్థమై ఆ దైత్యుని చీల్చి చెండాడి తన భక్తుడైన ప్రహ్లాదుని రక్షించి ధర్మాన్ని కాపాడాడు. పోతన మహాకవి చెక్కిన శిల్ప కళాఖండములలో ఈ ప్రహ్లాద చరిత్రము ఒక మేలుబంతి.

సహజకవి యైన ఈ మహాపండితుని గంటము నుండి జాలువారిన భాగవత రచనలో ఛందస్సులన్నియు పఠితులను ఉర్రూతలూగించేవే. ఇందలి కందములు అందమును చిందించినవే. ఆటవెలదులు నాట్యమాడి నయనానందకరము చేసినవే. తేటగీతులు మధుర గానము ఆలపించినవే. ఉత్పలమాలలు, చంపకమాలలు చక్కని భావ పరిమళములను వెదజల్లినవే. తరళములు తళుకులతో తనువంతా వయ్యారాలొలికించినవే. సీసముల నడకను డెందములను కందళింపచేసినవే. ఉపమా – ఆది అర్థాలంకారములు, శ్లేష యమక శబ్దాలంకారములు వన్నె చిన్నెలద్దినవే. వేయేల! ఈ మహాకవి కూర్చిన గద్యపద్యములన్నియు తెలుగువారి నాల్కలపై నాట్యమాడినవే.

ఇంకా మిగిలిన స్కంధాలలో భక్తిభావం పొంగిపొర్లుతుంది. ముఖ్యంగా గజేంద్ర మోక్షంలో ''ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై'' వామన ఘట్టములో బలిచక్రవర్తి దానశీలత, నవమ స్కంధములో సూర్యవంశ చరిత్రలు రసరమ్యమైన రామచరిత. ''ఓయమ్మ నీ కుమారుడు! మా ఇండ్ల పాలు పెరుగు మననీయడమ్మా! పోయెదమెక్కడికైనను ! మా యన్నల సురభిలాన ! మంజులవాణి'' అమ్మా! మన్నుదినంగనే శిశువునో, కలయో వైష్ణవ మాయయో మొదలగు పద్యాలు ఆబాల గోపాలాన్ని భక్తిమార్గం వైపు పయనింపచేశాయి. ఏది ఏమైనా భాగవతము అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికైనా భక్తిభావ సంపూజితమే.


## రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్ ) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా



**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



26వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

## స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**


శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

— **గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)


**దిశా నిర్దేశం:** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 26 వ భాగపు లీలల ప్రచురణ. (ఫిబ్రవరి 2012 నుండి అక్టోబర్ 2012).



ఈ కాలములో భగవంతుని సాధనకు అవసరమైన ఏకాంతమును సాధించుటకు వ్యాపారము వద్దన్నారు. నా పోషణ భారమును స్వామివారు స్వయముగా స్వీకరించారు. స్వామివారిని సదా ధ్యానించమన్నారు. నేను స్వామివారి స్థిర నివాసం కోసం పద్మపీఠం తయారు చేస్తున్నానని ప్రోత్సహించారు. నన్ను ఆర్థికంగా దిగజార్చి తనవద్దకు చేర్చుకున్నందుకు ఎగిరి గంతేశారు. అన్ని వ్యామోహాలను త్యజించమన్నారు. ఇలా నా జీవన విధానమును నిర్ణయించారు. వాటిని చూద్దాం.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు 10సం॥ల క్రితం, సం॥ 2002 లో తన సేవాభాగ్యాన్ని ప్రసాదించు సమయాన, నా కుటుంబ పోషణార్థం, కొన్ని రోజులు మాత్రమే వ్యాపారం చేయుటకు అనుమతించారు. మరియు "ఎక్కువచేస్తే అడ్డుకుంటానని" కూడా చెప్పారు. తరువాత కాలములో ఈ విషయాన్ని మరచి, వ్యాపారాభివృద్ధికై ప్రయత్నించినప్పటికీ ఫలితం సాధించలేదు. రోజు రోజుకు దీనస్థితికి చేరుకున్నాను. పరిస్థితి ఇలా ఉంటే... ఇప్పుడు స్వామివారు నా వ్యాపారాన్ని పూర్తిగా మానేయమని చెప్పడంతో పాటూ... నా జీవన విధానం ప్రత్యేక పద్ధతిలో ఉండాలంటూ దిశా నిర్దేశం చేశాడు. "నీ చుట్టూ ఉన్న జనాలు, నిన్ను పట్టించుకోకపోయినప్పటికీ, హేళన చేసినప్పటికీ, నీకు సహకరించనప్పటికీ, ఒంటరివని చింతించక, ఎంతమాత్రము వెరవక అత్యంత భక్తిశ్రద్ధలతో ఆనందముతో సదా హరినామస్మరణ చేస్తూ జీవించమని" దిశానిర్దేశం చేశాడు. "అన్య మతస్థుల మధ్యన జీవించు హరిదాసు జీవితము గడుపుమని" చెప్పాడు. కాని ఆ రోజు నేను ఈవిధంగా అర్థం చేసుకోలేదు. "అన్నీ కోల్పోయిన వేళ కూడా ఆనందంగా హరినామస్మరణ చేస్తూ

జీవించమన్నాడని" మాత్రమే భావించాను. ఇది ఒక అద్భుతమైన లీల. ఇంతటి హితోపదేశానికి శతకోటి ప్రణామాలర్పించాను. ఆ లీల దాని పూర్వాపరాలు ఈ విధంగా ఉన్నవి.

## హరిదాసు మాదిరిగ జీవించమనుట

ఈ మధ్యన ఒకసారి "నీ వ్యాపారానికి సంబంధించిన డబ్బుతో ప్లాట్స్ కొనిపెట్టుకొమ్మని, వ్యాపారాన్ని మానివేయుమని" ఒక హృదయాంతర భావాన్ని పొందాను. కాని అలా చేయకుండా... నా వద్దనున్న పైసలతో పాటు మరిన్ని అప్పు తెచ్చి, హైదరాబాద్ లోని సైనిక్ పురి ప్రాంతములో నాలుగు అంతస్థుల చిన్న అపార్టుమెంట్ కట్టాను. ఇది బాగున్నప్పటికీ, కొనుటకు ఎవ్వరూ రాలేదు. ఇది అమ్ముడు పోకపోతే నా మనుగడ లేదనే చెప్పాలి. ఎంత ప్రయత్నించినా, చివరికి స్వామివారిని వేడుకున్నప్పటికీ ఫలితం శూన్యం. పరిస్థితి ఎంతవరకు చేరిందంటే... నాకు మళ్ళీ ఈ వ్యాపారం చేయబుద్ధి కాలేదు. ఇదే కాలంలో గత కొన్ని నెలల నుండి నా జీవన విధానం రుచించక, నేను ఏవిధంగా జీవించాలో సూచించమని స్వామివారిని వేడుకోసాగాను. నా జీవన విధానాన్ని మార్చుకోవాలనే భావం నా మనస్సులో కలుగసాగింది. తీవ్రమైన మానసిక క్షోభను అనుభవించసాగాను. నేను ఒక అసమర్థుడినని కుమిలిపోయాను. గత 4-5 రోజుల నుండి స్వామివారిని అత్యంత దీనంగా ఈ విధంగా ప్రార్థించుట మొదలుపెట్టాను. "ప్రభూ శ్రీవేంకటేశ్వరా! నేను ఏ పని చేసినా మీకు చెప్పుచు చేశాను, చివరికి నా పరిస్థితి నీచాతి నీచ స్థాయికి దిగజారింది. కాళ్ళు చేతులు కట్టేసి కూర్చోబెట్టిన స్థితిలో ఉన్నాను. నన్ను మీరే కాపాడాలి, నేను చేసిన తప్పులను క్షమించి రక్షించమని" వేడుకున్నాను. దీనితో పాటు గత కొన్ని నెలల నుండి స్వామివారి లీలలను చూడనందుకు నా మనస్సు ఆయన నుండి దూరమైందని బాధ కలిగింది. "భక్తుడు ఎంత ప్రార్థించినా భగవంతుడు స్వయంగా తలుచుకుంటే తప్ప వారి అనుగ్రహం లభించదు" అనే భావము బలపడింది. ఈ విధంగా ఒక ప్రక్క ఆర్థిక కష్టాలు, మరోప్రక్క స్వామి అనుగ్రహము లభించక కుమిలిపోయాను. మరియు ఈ నిస్సహాయ స్థితిలో స్వామివారి త్రివిక్రమ రూపమును నిర్మించాలనే ఆలోచనను శక్తి లేక విరమించుకుంటున్నానని విన్నవించాను. దుఃఖ తప్త హృదయంతో కరుణించమని ప్రార్థించాను.

దయామయుడైన స్వామివారు ఈ రాత్రి అద్భుతమైన లీలను చూపెట్టాడు. నీవు సర్వము కోల్పోయిన వేళలో కూడా ఆనందంగా హరిసేవ చేయమన్నారు. మరియు అన్యమతస్థుల మధ్యన నివసించు హరిదాసు మాదిరిగా జీవించుమన్నారు. మొత్తం నా జీవితానికి చక్కటి దిశా నిర్దేశం చేశారు. నా జీవితంలో ఇది మరో ఆణిముత్యం. ఆ లీల ఈ విధంగా ఉంది.

డా॥ పులిగడ్డ విజయలక్ష్మి గారు మా శ్రీవేంకటేశం మాసపత్రికకు గౌరవ సంపాదకులు. ఆమె పెద్ద కుమార్తె డా॥ లలితవాణి కూడ ఈ పత్రికలో 'మీ విజ్ఞానం' నిర్వహిస్తోంది. వీరికి మరో చిన్న కుమార్తె 'ఉషా లక్ష్మి' అనేటామె కూడా ఉంది. నేను అప్పుడప్పుడు వారింటికి వెళ్ళి సరదాగా మాట్లాడేవాడిని. స్వామివారు వీరిని ఉపయోగించుకుని ఈ కలను సాగించారు.

**తేది 19-02-2012 కల :** డా॥ పులిగడ్డ విజయలక్ష్మి గారి ఆహ్వానము మేర నేను వారి ఇంటికి సాయంత్రము దాదాపు 5 ప్రాంతమున ఎందుకో వెళ్ళాను. ఆ సమయాన విజయలక్ష్మి గారు కాని, డా॥ లలితవాణి గారు కాని ఆఫీసు నుండి ఇంకా ఇంటికి రాలేదు. వారి ఇతర కుటుంబ సభ్యులు నన్ను సాదరంగా ఆహ్వానించారు. వారితో ఏదో తోచింది మాట్లాడుచూ కాలక్షేపము చేయసాగాను. ఇంతలో సీను మారింది. నేను వారి ఇంటి వెనుక గల ఒక పశువుల కొట్టము లాంటి దానిలో ఉన్నాను. వారి చిన్నకూతురు అప్పుడే స్కూలునుండి వచ్చింది. ఈమె తరచూ నా వద్దకు వచ్చి ఏదో చెప్పుచున్నది. వారి అన్నయ్య మంచి జ్యోతిష్కులని, భవిష్యవాణి చక్కగా చెప్పగలరని, దానిపై ఆయన ఎంతో కృషి చేశాడని చెప్పింది. దీనిని విని నాది తెలుసుకోవాలనే కుతూహలము కలిగింది. ఇంతలో వర్షం వచ్చింది. కొట్టము కొంత కురువడము మూలాన కొంత తడిశాను. ఇంతలో ఆ ఇంటి యజమానురాలు, శ్రీమతి విజయలక్ష్మి గారు, మరియు ఆమె పెద్ద కుమార్తె డా॥ లలితవాణి ఇంటికి వచ్చారు. ఏదో కబుర్లు చెప్పి భోజనానికి బయట హోటల్ కు వెళ్ళుదామని ఒక ఆటోలో, దాదాపు 4-5 మందిమి పోవుచున్నాము. కాని ఆ ఆటోడ్రైవర్ మేము సూచించిన స్థలానికి బదులుగా ఏదో ఒక క్రొత్త ప్రాంతానికి తీసుకుపోయాడు. అది మొత్తం ముస్లింల బస్తీ. హైదరాబాద్ ఓల్డ్ సిటీలోని గల్లీల లాగా ఉన్నది. ఏంటీ? క్రొత్త ప్రాంతానికి తెచ్చాడని బయటకు చూచినంతలోనే ఆ ఆటోడ్రైవర్ ను ఎవరో ఒక బస్తీలీడర్ ఆపాడు. ఈ డ్రైవర్ వారు ఆపమంటున్నారని ఆటోను ఆపివేశాడు. వారిని చూచి డ్రైవర్ భయపడసాగాడు, నమస్కారాలు పెట్టసాగాడు. చూచుటకు ఈ డ్రైవర్ వారి అనుచరుని లాగే ఉన్నాడు. ఇంతలో ఆటో నుండి దిగిన నన్ను, వారి నాయకుని ఇంటిలోనికి తీసుకుపోయారు. నేను తప్ప మిగిలినవారు ఆటోలో, రోడ్డుపైననే ఉన్నారు. నన్ను ఒక పెద్ద ఇంటిలోనికి తీసుకుపోయారు. అక్కడ ఆ బస్తీ నాయకులు, బహుశా ఒక ఎం.ఎల్.ఏ లాంటివారు (అందరూ ముస్లిం వారే) ఉన్నారు. వారి వద్ద నన్ను నిలబెట్టి ఆ నాయకునితో ఏదో చెప్పారు. కాని ఆ నాయకుడు నన్ను పట్టించుకోక, ప్రక్కవారితో ఒక ముఖ్యమైన విషయముపై మాట్లాడుచున్నాడు. కాబట్టి నన్ను రెండవ తరగతి నాయకులు చూచుకున్నారు. ఇంతలో ఆ పెద్ద నాయకులు అక్కడి నుండి వెళ్ళిపోయారు. ఈ

చిన్న నాయకులు నన్ను ఆ బస్తీలో మరీ లోన ఉన్న మరో ఇంటికి తీసుకువెళ్ళి మాట్లాడారు. నేను ఏదో తప్పు చేసినటుల రు.5 వేలు ఇవ్వమన్నారు. దీనికి నేను దిగులు చెంది, ఎందుకివ్వాలనే భావనచే, ఆ పెద్ద నాయకుడినే కలిసెదనన్నాను. ఇందుకు చిన్న నాయకులు, మేము కాబట్టి రు. 5 వేలు చెప్పాము, ఆయనైతే ఇంకా ఎక్కువ అడుగుతారని అన్నారు. ఇంతలో ఆటో వద్ద రోడ్డుపైనున్న డా॥ వాణి, ఎవరితోనో మాట్లాడి డీల్ ఫైనల్ చేసుకుని నేను ఉన్న ఇంటికి వచ్చి రు.5 వేలు కట్టెదమని చెప్పింది. ఈ అన్యాయానికి నేను ఒప్పుకోక, ఆ పెద్ద నాయకుడినే అడిగెదనని ఆ ఇంటినుండి బయలుదేరి ఒక్కడినే వారి కోసం ఎన్నో గల్లీలు వెదుకనారంభించాను. మొత్తం వారి మనుష్యులు, వారి ఇండ్లే కనబడ్డవి. ఎక్కడ చూచినా ముస్లింలే ఉన్నారు. హిందువులు లేదా తెలిసినవారు ఒక్కరూ లేరు. ఇలా చాలా బస్తీలు తిరుగుచున్నప్పుడు, అది పండువెన్నెల కావడం వలన ప్రతి ఇల్లు స్పష్టంగా కనబడ్డది. అనుకోకుండా ఒకే ఒక హిందువుల ఇల్లు కనబడ్డది. ఈ ముస్లింల మధ్యలో ఎలాంటి భయం లేనట్లు ఆ ఇల్లు ఉన్నది. మరియు ఆ ఇల్లు మంచి పూలమాలలచే, మామిడి ఆకులచే అలంకరించబడ్డది. ఆ ఇంటి గోడలపై, తలుపులపై, అడుగడుగున పసుపు కుంకుమ బొట్లచే అలంకరించబడ్డది. ఆ ఇల్లు, విద్యుత్ కాంతితో ధగ ధగమని ప్రకాశిస్తోంది. ఆ ఇంటి యజమాని ఒక హరిదాసు. చక్కగా అలంకరించుకొని, పంచెను ధరించి తలపై చెంబు పెట్టుకుని చేతిలో చిరుతలను పట్టుకొని ఉన్నాడు. ముఖానికి చక్కటి తిరునామం ధరించి ఇల్లు దాటి బయటకు పోవుచున్నాడు. తన చిన్నకొడుకు, తండ్రిని సాగనంపుచు ఇంటి బయటకు వచ్చాడు. నేను చూచేసరికి హరిదాసు, వారి ఇల్లు వదిలి కొద్దిదూరం పోయాడు. ఇంటి వాకిట్లో వారి కుమారుడు తండ్రిని సాగనంపుచున్నాడు. ఈ హరిదాసు చక్కని చిరునవ్వుతో తిరునామముతో, తలపై చెంబుతో కనబడ్డారు. ప్రశాంతంగా భక్తి భావం ఉట్టిపడే విధంగా ఉన్నారు. ఈ ఇల్లును, హరిదాసును, ఆ ఇంటి శోభను చూడగనే నా




అనన్య భక్తితో ఉన్న హరిదాసును చూచుట

మనస్సులో చెప్పరాని ఆనందము కలిగింది. ఈ ముస్లిం బస్తీలో, దో చుకుతినే వారి మధ్యన ఈ హరిదాసు ఎలా జీవిస్తున్నాడు? ఈ యనకు భిక్షము ఎవ్వరు వేస్తారని అనుకున్నాను. పైగా ఈయన ఎలాంటి భయము, చీకు చింతా లేకుండా, ఆనందంగా కాలము గడుపుచున్నటుల భావించాను. నన్ను ఈ ముస్లిం బస్తీలో ఈ హరిదాసు ఇంటిని చూపించుటకే నా స్వామి వారు ఇక్కడికి ప్రత్యేకంగా తీసుకువచ్చాడని కలలోనే అనుకున్నాను. వెంటనే కల చెదిరింది. ఈ విధంగా జీవిస్తే ముందు ముందు మంచి జరుగుతుందని స్వామివారు సూచించినట్లు భావించాను. నా బాధలు త్వరలోనే తీరునని కూడా భావించాను.

పూర్తిగా ముస్లిం బస్తీలో ఉన్న హరిదాసు, ఎవ్వరు భిక్ష వేసినా, వేయకపోయినా పట్టించుకోలేదు. వారి చుట్టూ ఉన్న జనాలు మంచివారైనా, చెడ్డవారైనా పట్టించుకోలేదు. ప్రక్కవారితో సంబంధం లేకుండా వారి ఇల్లును చక్కగా అలంకరించుకుని, సదా చిరునవ్వుతో హరినామస్మరణ చేస్తూ సంతోషంగా ఉన్నాడు. తనేకాక తన కుటుంబ సభ్యులను కూడా సంతోషపరుస్తూ బ్రతుకుచున్నాడు. "నా ధ్యేయం స్వామివారే... కాని నేను నివసించు పరిసరాలు కాని, పరిస్థితులు కాని కావు" అని కలలో ఆయనను చూడగనే అర్థమయ్యే విధంగా ఉన్నది. అందుకే ఈ హరిదాసు ఇల్లును చూపించుటకే స్వామివారు నన్ను ఈ ప్రాంతానికి తీసుకువచ్చారని కలలోనే భావించాను. ఏ గురువు లేని నాకు నా స్వామివారు ఒక గురువుగా తన సేవకుడికి కర్తవ్యబోధ చేశారు. చంచలిత మనస్కుడనైన నేను ఈ కల ద్వారా మళ్ళీ నా యొక్క కర్తవ్యమును జ్ఞప్తికి తెచ్చుకున్నాను.

పూర్వం భగవంతుని సాధన చేసేవారు ఏకాంతం కొరకు అడవికి వెళ్ళి తపస్సు చేసేవారు. కాని నేను అడవికి వెళ్ళే పరిస్థితి లేదు. స్వామి ప్రసాదించిన ప్రతి సేవ జనావాసాల మధ్యనే చేయవలసి ఉంది. కాబట్టి జనావాసాల మధ్యనే ఉంటూ "అన్య మతస్థుల మధ్యన నివసించు హరిదాసు జీవితమును గడపమన్నారు". కాని మేము మాత్రం అన్నీ కోల్పోయిన వేళ కూడా ఆనందంగా హరినామస్మరణ చేయమన్నారని మాత్రమే గ్రహించాము. మరియు స్వామి సూచించినట్లు రూ. 5005ను ముడుపు కట్టి పెట్టాము.

## పద్మపీఠమును తయారు చేస్తున్నావని చెప్పుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు మరో అద్భుత లీలను చూపెట్టాడు. ఒకరకంగా భవిష్యవాణి చెప్పాడు. భవిష్యత్తులో చిన్నగుండవెల్లిలో స్థాపించు హరినామ క్షేత్రములో తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆవిర్భావానికి సన్నాహాలు చేస్తున్నావని చెప్పాడు. నేను స్వామివారిని ఆహ్వానించుటకు (నిలబెట్టుటకు) కావలసిన "పద్మపీఠము"ను తయారు చేస్తున్నానని చెప్పారు. ఈ లీలను కూడా నేను తరువాత కాలంలో అర్థం చేసుకున్నాను. ఆ లీల ఈవిధంగా ఉన్నది.

**తేది 04-03-2012 కల :** హైదరాబాదు మాదాపూర్ లో ఉన్న హైటెక్స్ లాంటి విశాలమైన హాలులో ఒక కన్స్ట్రక్షన్ ఎగ్జిబిషన్ జరుగుతుంది. దీనిలో హైదరాబాద్ లో ఉన్న పెద్ద పెద్ద బిల్డర్లు వారు నిర్మించే బిల్డింగులను, లే అవుట్ లను డిస్ ప్లే చేశారు. చాలామంది జనాలు దీనిని చూచుటకు వెళ్ళుచున్నారు. నేను కూడా వెళ్ళాను. అక్కడి పెద్ద పెద్ద నిర్మాణాలను చూచిన వెంటనే నాలోపల ఒక నిరుత్సాహ భావము కలిగింది. నేను కూడా ఈ పోటీలో ఉన్న నిర్మాణపు దారుల వలె పెద్ద బిల్డరుగ ఉండేవాడినని, నా బిల్డింగ్స్ కూడా ఈ ప్రదర్శనశాలలో ప్రదర్శింపబడేవని, దీనికంతటికీ కారణం శ్రీవేంకటేశ్వరుడే అనే భావం మనస్సులో ఏర్పడింది. నేను ప్రస్తుతము ఈ స్థితిలో లేనందుకు బాధ కలిగింది. ఇంతలో నాకు ఒక ఏడెనిమిది అంతస్థుల బిల్డింగ్ కనబడ్డది. అది నన్ను బాగా ఆకర్షించింది. ఇది నా బిల్డింగే అనే భావన నాకు కలిగింది. ఇంతలో ఆ బిల్డింగుకు క్రింది భాగపు మొదటి అంతస్థు నుండి పద్మపు రెక్కలు పుట్టుకొచ్చినవి. ఇప్పుడు అది పద్మము వలె రెక్కలను చాచి ఉన్నది. అంటే అది రెసిడెన్షియల్ బిల్డింగు వలె కాకుండా పద్మము వలె మారింది. వెంటనే కల చెదిరింది. ఈ కల కన్నప్పుడు దీని భావంను అర్థం చేసుకోలేదు. కాని తరువాత కాలంలో దీని అసలైన అర్థం తెలిసింది.

ఓయీ! నీవు వ్యాపారములో రాణించలేదని చింతించకు, భవిష్యత్తులో స్వామివారి స్థాపనకు అవసరమైన "పద్మపీఠము"ను తయారు చేస్తున్నావు అని దీని భావం.

## సురేఖ బాధపడుట

**తేది 24-03-2012:** నేను పొందిన కలను, అంటే వ్యాపారము నడువకున్నా, ఆర్థికంగా నీచ స్థితిలో ఉన్నప్పటికీ ఆనందంగా స్వామివారిని సేవించుమని తేది 19-02-2012 నాడు స్వామివారు చెప్పిన కలను నా భార్య సురేఖకు ఈరోజు చెప్పాను. ఆమె వెంటనే మా ఆర్థిక పరిస్థితిని మళ్ళీ ఒకసారి గుర్తుకు తెచ్చుకుని ఇంకా ఎన్నినాళ్ళు ఈ కష్టాలని తలచుకొంటూ కన్నీళ్ళు కార్చింది. దీనితో నా మనస్సు చలించింది. మళ్ళీ స్వామిని స్మరిస్తూ ప్రార్థించాను. దీనర్థం – స్వామివారు కరుణించి మమ్మలను ఆర్థికంగా ఆదుకుందురనే భావముతో ఉన్నాము.

## సుఖమయ జీవితపు మోహాన్ని వదులుమనుట

**తేది 25-04-2012 :** మాకు గ్రీన్ కార్డు ఉంది కాబట్టి ప్రతి సంవత్సరం అమెరికాకు వెళ్ళాలి. ఈ సంవత్సరం తేది 05-04-

2012 నాడు వెళ్ళి తేది 01-05-2012 నాడు తిరిగి వచ్చాము. ఈ కాలంలో స్వామివారు కొన్ని హితబోధలు మరికొన్ని దివ్యలీలలు చూపారు. అమెరికాలో ఉన్నప్పుడు స్వామిసేవకు దూరమైన కారణంగా తపించిపోతాను కాబట్టి ముఖ్యమైన విషయాలు ఇక్కడనే చెప్పారు. అవి ఈ విధంగా ఉన్నవి.

తేది 23-04-2012 ప్రాంతమున ఒక ఆలోచన వచ్చింది. స్వామివారు నన్ను అమెరికాకు ఎందుకు తీసుకొస్తున్నారు? ఏమి బోధించుటకు ఈ కొద్దిరోజులు ఇక్కడికి తెస్తున్నారని అనుకున్నాను. వెంటనే స్వామివారిని ప్రార్థించాను. "ఏ పాఠము నేర్పుదురో నేర్పండి ప్రభూ!" అంటూ ప్రార్థించాను. ఇలా రెండు మూడు రోజులు వరుసగా ప్రార్థించాను. ఒకరోజు అనగా తేది 25-04-2012 నాడు, మేము మాల్స్ కు వెళ్ళి వివిధ వస్తువులను చూస్తున్నాము. అక్కడి విలాసవంతమైన వివిధ వస్తువులను, రకరకాల పనిముట్లను, విలాసవంతమైన పరిస్థితులను చూచాను. వెంటనే నా మదిలో ఈ రకమైన భావాలు రాసాగాయి. "వీటిపైన వ్యామోహాన్ని పెంచుకోకు, త్యజించు, "వ్యామోహాన్ని త్యజించు" అంటూ పదే పదే ఇదే రకమైన భావాలు వచ్చాయి. అమెరికా చూపించి, అక్కడి మెరుగైన పరిస్థితులు, సుఖవంతమైన వ్యవహార శైలిని చూపి ఇది క్షణభంగురము, అదీ కాక నీ సంకల్ప సిద్ధికై అన్నిరకాల వ్యామోహాలను త్యజించుమని ఆదేశించారు. స్వామివారి సృష్టిని చూపి మోహాన్ని త్యజించమని ఆదేశించారు. నిజానికి నాకు కూడా అంత ఎక్కువ సుఖ వాంఛ లేదు. కాని కొంత కూడా ఉండకూడదని స్వామివారు చెప్పారని భావించాను.

## నన్ను తన మార్గములోనికి త్రిప్పుకున్నందుకు ఎగిరి గంతు వేయుట

నన్ను ఆర్థికంగా దిగజార్చి తన వద్దకు చేర్చుకున్నందులకు స్వామివారు ఎంతో సంతోషించారు. ఎగిరి గంతేసినంత ఆనందపడ్డారు. ఇది నా జీవితంలో మరో ఆణిముత్యం. ఆ లీల ఈవిధంగా ఉన్నది.

స్వామివారి రెండు ఆదేశాలు గుర్తుకు వచ్చాయి. అవి తేది 19-02-2012 నాడు, అత్యంత భక్తితో, ఆనందముతో, ఒళ్ళు మరిచే అమితానందాన్ని పొందుచు స్వామివారిని సేవించమని ఆజ్ఞాపించారు. తేది 25-04-2012 నాడు "వ్యామోహాన్ని త్యజించి జీవించు" అని ఆజ్ఞాపించారు. ఈ రెండు పాఠాలను బాగా గుర్తుంచుకొని జీవించినట్లైతే స్వామివారిని తృప్తి పరచగలనని, నా శ్రేయస్సుకు ఉపయోగపడుతుందని, ఆశయము నెరవేరుతుందని భావించాను. అందుకని ఈ రకమైన జీవనము ఈ క్షణము నుండే ప్రారంభిస్తున్నాను, నాకు కావలసిన శక్తిని ప్రసాదించుమని స్వామివారిని వేడుకుని వెంటనే ప్రారంభించాను. ఈ రోజు, చాలా ఆనందంగా, తృప్తిగా, ఎంతో ఉల్లాసంగా గడిచింది. లోకంలోని ఏ వస్తువు నాది కాదు, నేను కేవలము శ్రీవేంకటేశ్వరుని సేవకుడిననే భావనను మనస్సులో ఉంచుకుని జీవించుట మొదలుపెట్టాను. ఈ క్రొత్త రకమైన భావనతో ఈరోజు తొందరగా చీకటైంది. ప్రతి రోజు లాగా తిని పడుకున్నాను. ఈ భావనను స్వామివారు స్వీకరించునని ముందే భావించినప్పటికీ మరోసారి స్వీకరించుమని ప్రార్థించి పడుకున్నాను. నా ఈ మార్పుకు స్వామివారు సంతోషించి నాకు ఒక లీల, సురేఖకు మరో లీల చూపెట్టి సంతోషపరిచారు. నేను పొందిన లీల

గత కొన్ని సంవత్సరాల నుండి ఏ విధంగా నేను మోసగించబడుచు, ఆర్థిక నష్టం కలిగిందనే విషయం గురించి ఒక ఉదాహరణను చూపుచు ఈ లీల సాగింది.

**తేది 26-04-2012 కల :** సం॥ 2005 లో, నాగారంలోని శ్రీమాన్ మురళీధర్ మరియు వారి కొడుకులకు వారి భూమిని కొనే నిమిత్తమై, ఒక రు.3.0 లక్షలు బయానా ఇచ్చాను. కాని వారు ఆ భూమిని ఇవ్వక, అది వారిది కాక నన్ను మోసం చేశారు. ఆ పైసలు ఇంతవరకు రాలేదు. ఆ ఇప్పించిన బ్రోకర్ మరియు ఈ పెద్ద మనుష్యులు ఆ మాట ఈ మాట చెప్పి, నానుండి మరో 3 లక్షలు తీసుకొని వారికి సంబంధించిందంటూ ఈ భూమికి బదులుగా ఒక ప్లాట్ ను, రిజిస్ట్రేషన్ చేశారు. చివరికి ఇది కూడా వారిది కాదని, లిటిగేషన్ లో ఉన్నదని తేలింది. సమస్య మరింత జటిలమైంది. నా పైసలు తిరిగి ఇవ్వమని అడిగినప్పటికీ ఇవ్వలేదు. కాబట్టి ఈ మధ్యన నేను వారిపై కేసు వేశాను. కోర్టు అరెస్ట్ వారెంట్ ఇచ్చారు. దీనికి భయపడిన మురళీధర్, వారి కొడుకులు నా వద్దకు వచ్చి, వారు నివసిస్తున్న ఇంటి లోని కొంత భూమిని రిజిస్ట్రేషన్ చేసి కాంప్రమైజ్ అయ్యారు. ఆరు నెలల్లో డబ్బు ఇస్తామని, లేనియెడల ఈ భూమిని తీసుకొమ్మని బ్రతిమలాడారు. నేను ఒప్పుకున్నాను. ఆ తరువాత మురళీధర్ చనిపోయాడు, కొడుకులు భూమిని ఇవ్వమ న్నారు. ఈ విధంగా నేను ఎంత ప్రయత్నిస్తే అంత నా డబ్బు ఖర్చు అగును తప్ప తిరిగి వచ్చేది కాదు. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. ఈ కలలో స్వామివారు ఈ మురళీధర్ గారిని వాడుకున్నారు. ఈ కలలో నేను ఈ మురళీధర్ నివసిస్తున్న ఒక దూరపు గ్రామమునకు, డబ్బులకని పోయాను. కాని అక్కడ ఎవ్వరూ లేరు, ఈయన కనబడలేదు. నా రాక తెలిసి కనబడకుండా పోయాడని భావించాను. ఊరంతా మనుష్యులు లేని ఇళ్ళు, మార్గాలు మాత్రమే కనబడ్డాయి. నేను ఇంత దూరం వచ్చింది వృథా అయిందని భావించాను. ఇక విధి లేక తిరుగు ప్రయాణానికి సిద్ధమైనాను. ఇంతలో నాకు దప్పిక వేసింది, నీరు త్రాగుదామని ఊరు బయట ఉన్న ఒక పెద్ద వ్యవసాయ బావి వద్దకు పోయి, ఆ బావి గడ్డను ఎక్కి బావిలోనికి చూచాను. ఇంతలో అక్కడొక దృశ్యాన్ని చూచి ఆశ్చర్యపోయాను.




**మురళీధర్‌ను శ్రీమన్నారాయణునిగా దర్శించుట**

అది ఏటవాలుగా ఉన్న దిగుడు బావి. నీరు స్వచ్ఛంగా ఉన్నది, ఆ బావిలో నేను వెళ్ళిన శ్రీమాన్ మురళీధర్ గారు కనబడ్డాడు. ఆయన తన సహజ వేషధారణలో కాకుండా, పంచె కట్టుకుని నడుము వరకు నీటిలో మునిగి తిరునామాలు ధరించి నావైపు ముఖము చేసి దేవుణ్ణి ప్రార్థిస్తున్నాడు. ఆయన వెనకాల నీటిలో పెద్ద ఆదిశేషు పంచముఖాలతో పడగ విప్పి నా వంకే చూస్తూ ఉన్నది. నిజానికి ఇది ప్రాణమున్న పాము లాగా మొదట కనబడింది. కాని ఎప్పుడైతే నా దృష్టి దానిపై పడిందో అది ఒక విగ్రహం లాగా మారిపోయింది. దీని పడగ క్రింద ఈయన ఉన్నాడు. ఒకరకంగా ఈయన శ్రీమన్నారాయణుని వలె ఉన్నాడు. ఈయన ప్రక్కన మరో దేవుడు, మరొక పూజారి ఉన్నారు. ఈ మురళీధర్ సాధారణంగా నాకు తెలిసిన మురళీగౌడ్ లాగా కాకుండా, అదే ముఖవర్చస్సుతో ఒక పూజారి మాదిరిగా, మంచి తిరునామాలతో, జంధ్యంతో బ్రాహ్మణు ని మాదిరిగా ఉన్నాడు. ఆ బావి గడ్డపై నీళ్ళ ప్రక్కన మరికొన్ని దేవతల విగ్రహాలు ఉన్నాయి. భక్తులు కనబడ్డారు. ఏ క్షణమైతే నేను బావిగడ్డ ఎక్కి లోనికి దిగుటకు కాలు పెట్టానో ఆ మురళీ పూజారి నన్ను చూచి ముసి ముసిగా నవ్వాడు. ''నిన్ను నేను ఇక్కడికి (తనవద్దకు) రప్పించాను చూడు'' అనే ఆలోచన ఆ మురళీ పూజారి మనస్సులో ఉన్నదని ఒక హృదయాంతర భావం కలలోనే ఏర్పడింది. నన్ను తన వద్దకు రప్పించుకున్నందుకు ఆయన గర్వంగా, ఎగిరి గంతేసినట్లు మురిసిపోయాడు. అంటే... నాకు ఆర్థిక సంక్షోభాన్ని కలిగించి, నా మనస్సును వివిధ మార్గాల నుండి మరల్చి తన వద్దకు తీసుకు వచ్చాడని ఈ కల అర్థం అని నేను ఈ కలలోనే గ్రహించాను. పైగా ఈ మురళీధర్ అనే వ్యక్తి నా ప్రభు శ్రీవేంకటేశ్వరుని మాయనే అని గ్రహించాను. చివరికి కల చెదిరింది.

ఈ విధంగా లోకంలోని సమస్త వ్యామోహాలను త్యజించి అనన్యభక్తితో స్వామివారిని సేవించమన్నారు. ఇదే తాను కోరుకున్న విధానమని, నన్ను ఆచరించుమన్న విధానమని తెలియచేశారు. ఇందులకు కోటి కోటి ప్రణామాలను సమర్పించాను.

**ఒక వివరణ :** ఒకప్పుడు శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు ''నాకు ఏ భక్తునిపై అనుగ్రహం కలుగుతుందో అతడి సమస్త సంపదలను

హరిస్తాను. ధనం లేక అతడు ఏడుస్తాడు. బంధువులంతా అతణ్ణి వదిలి వేస్తారు. ఇలా నానా కష్టాలు పడి చివరికి నా భక్తులతో స్నేహం చేస్తాడు. క్రమంగా విజ్ఞానాన్ని పొంది నన్ను చేరుతాడు".

## స్వామివారు సంతోషించుట

పై రకమైన అంటే, ఈ లోకంలో ఏదీ నాది కాదు అనే భావన కలిగి అనన్య భక్తితో ధ్యానించు జీవన విధానం స్వామివారికి ఎంతో నచ్చింది. నాతో పాటు నా భార్య సురేఖకు కూడా చక్కటి లీలను చూపి ఆనందింపచేశారు. ఆ లీల ఈవిధంగా ఉంది.

ప్రతిసారి మేము అమెరికాకు వెళ్ళే సమయములో, శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠానికి కాని, శ్రీవేంకటేశం మాసపత్రికకు కాని ఎలాంటి లోటు లేకుండునట్లు ఏర్పాటు చేసుకొని వెళ్తాము. అంతే కాకుండా ప్రతి రెండు మూడు రోజులకు ఒకసారి ఇక్కడి పరిస్థితులను ఫోన్ ద్వారా తెలుసుకుంటూ తగిన సూచనలిస్తుంటాము.

**తేది 25-04-2012 కల :** మేము హైదరాబాదులోనే ఉన్నామట, నేను వ్యాపార నిమిత్తము ఎక్కడికో పోయానట, ఇక సురేఖ కూడా ఎక్కడికో పోయి ఇంటికి తిరిగి వస్తున్నదట. ఇంతలో మా బెడ్ రూమ్ బాల్కనీ డోర్ క్రింది నుండి విపరీతమైన పొగ వస్తున్నదట. ఇంట్లో ఎవరూ లేరు, డోర్ తాళం వేసి ఉంది, కాని లోనుండి పొగ ఎక్కువ మొత్తంలో రావడం మూలాన కొంతమంది వ్యక్తులు జమ అయినారు. ఏమైందో చూస్తున్నారు. ఇంతలో నా భార్య అక్కడకు వచ్చింది. మా ఇంటి ఆవరణలోని సర్వెంట్ రూంలో ఉన్నవారిని ఏమైందని అడిగిందట. వారు లోనుండి ఏదో కాలుచున్నది, చాలా పొగ వస్తున్నదని భయముతో చెప్పారట. ఇంతలో ఈమె తాళం తీసి లోనికి వెళ్ళింది. మొదటి అంతస్తులో ఉన్న మా బెడ్ రూంలోనికి వెళ్ళి చూచిందట. అక్కడ ఒక మంచి సాంబ్రాణీ కడ్డీ వెలుగుచున్నదట. దాని పొగనే ఈ బయటకు వచ్చే పొగ. దీనిని చూచి వీరు ఏదో కాలిందని భయపడుచున్నారట. కల చెదిరింది. దీనర్థం స్వామివారు మమ్మల్ని ఆశీర్వదించారని మరియు సంతోషించారని భావించాను.

## కాశ్మీరు యాత్ర

ఈ మధ్యన నా పెద్ద కొడుకు చి|| వేదాంత్ తన ఇంజనీరింగ్ డిగ్రీని పూర్తి చేసి, అమెరికాలో మాస్టర్స్ చేయుటకని అక్కడికి పోవుటకు సిద్ధంగున్నాడు. వాడికి ఇంతకుముందే గ్రీన్ కార్డు ఉంది కాబట్టి ఇక అక్కడనే సెటిల్ అవుతాడు. కావున కుటుంబం సమేతంగా కాశ్మీర్ ట్రిప్పు వేసుకున్నాము. తేది 21-05-2012 నాడు కశ్మీరులో ఉన్నాము. ఈనాడు నేను 2 కలలను, సురేఖ ఒక కలను కన్నాము.

**తేది 22-05-2012 కల :** నేను కొన్ని ఆలయాలను చూచాను. ఒక ఆలయం లోనికి వెళ్ళాను. పూర్వము ఆ ఆలయంలో ఒక పెద్ద పూజారి ఉండేవారట. ఇప్పుడు ఆయన చనిపోయినందున ఆయన 40 సంవత్సరాల కొడుకు పూజారిగా ఉన్నారు. ఈయన చక్కని విభూతి ధరించి, మంచి రంగుతో ఉన్నారు. ఆయన పక్కన సుమారు 7-8 సంవత్సరాల ఆయన కొడుకు కూడా ఉన్నాడు. ఆ గుడి ఆవరణలో ఈయనను చూచాను, దేవుణ్ణి మాత్రం చూడలేదు. ఇంతే కల.

ఈరోజు శ్రీనగర్ లోని ఆదిశంకరాచార్య శివలింగాన్ని, ఆయన తపస్సు చేసిన ప్రదేశాన్ని చూచాము.

**రెండవ కల :** నేను ఒక శ్రీవేంకటేశ్వర ఆలయమునకు ధర్మాధికారినట. స్వామివారి ఉత్సవాల కొరకు అది - ఇది సిద్ధం చేస్తున్నాను. స్వామి సేవల గురించి ఆలోచిస్తున్నాను. ఇంతే కల.

10వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణకై సన్నాహాలు చేస్తున్నాను. బహుశా దీని గురించి కావచ్చనుకున్నాను. లేదా రాబోవు హరినామ క్షేత్రం గురించి కావచ్చును.

**సురేఖ కల :** మా తల్లి కీ.శే పుల్లగూర్ల రుక్కమ్మ జీవించి ఉన్నదట. మా ఇంటిలో ఏదో ఒక దైవ కార్యక్రమము చేస్తున్నామట. మా తల్లి ఆజ్ఞానుసారము, ఆమె చెప్పిన విధంగా సురేఖ అన్నీ సిద్ధం చేస్తున్నదట. ఇంతే కల.

ఒకరకంగా ఈనాటి మా సేవ మా పూర్వీకుల నుండి లభించిందని, వారే దీనికి ఆద్యులని అర్థం.

## రథయాత్ర ఏర్పాట్లు

తేది 25-05-2012 నాడు మరో కల ఈ విధంగా కన్నాను.

**తేది 25-05-2012 కల :** ఈ కలలో నాకు డా|| కె.వి. రమణాచారి గారు కనబడ్డారు. ఆయన నాకు ఏదో ఒక పని చెప్పబూనారు. కానీ నేను ఆయనతో రథయాత్ర ఉన్నదని జ్ఞప్తికి తెచ్చాను. ఆయన దీనిని గుర్తించి ఓ... రథయాత్ర ఉన్నది కదా యని ఆ పనిని చెప్పలేదు, మరియు ఈ రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తానని ఒప్పుకున్నారు. ఇంతే కల.

దీనర్థం – బహుశా స్వామివారు కూడా మొదటి ప్రాధాన్యత వారి సేవకే ఇచ్చి ఉండవచ్చనే భావము కావచ్చును. మరియు మా సేవను స్వీకరిస్తున్నట్లు కావచ్చును.

## నా పూర్తి ఆర్థిక బాధ్యతలు స్వామివారు స్వీకరించుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నాకు ఒక అద్భుత సందేశమిచ్చారు. గత కొన్ని సం||ల నుండి మా ఆర్థిక పరిస్థితి దిగజారింది. మరియు కొన్ని నెలల ముందు నా వ్యాపారాన్ని పూర్తిగా మానివేయమన్నారు. అయితే... నేను ఏ విధంగా బ్రతకాలి, ఇంతటి స్వామి సేవను ఏవిధంగా కొనసాగించాలనే నా

ప్రశ్నకు చక్కటి జవాబు ఇచ్చారు. మొత్తం తనే చూచుకుందునని చింతించకుమని చెప్పారు. ఇది భక్తుడికి భగవంతుడిచ్చిన ఒక అద్భుతమైన బహుమానం. అది ఈ విధంగా ఉంది.

తేది 03-06-2012 ఆదివారం నాడు తిరుమలలో స్వామివారి అభిదేయక అభిషేకమును కుటుంబ సమేతంగా వెళ్ళి నిర్వహించాము. స్వామివారిని దర్శించినప్పుడు రెండు కోరికలు కోరాను. మొదటిది... ప్రభూ! ఇప్పుడు మా పూర్తి కుటుంబము నలుగురము కలిసి మీకు ప్రణామాలను చేస్తున్నాము. ఇక మా పెద్ద కుమారుడు యం.ఎస్ కోసం అమెరికా వెళ్ళుచున్నాడు, కావున చాలా రోజుల వరకు మా మొత్తం కుటుంబ నమస్కారాలను తిరుమలలో చేయుట కష్టము, కావున దీనిని స్వీకరించుమని వేడుకున్నాను. స్వామివారు సదా మా పుత్రుని వెంట ఉండుటకని స్వామివారి బంగారు లాకెట్ ను వాడి మెడలో కట్టాము. మరియు వీడికి తోడునీడగా ఉండి రక్షించుమని ప్రార్థించాము.

**రెండవది :** గత కొన్ని సంవత్సరాల నుండి మా ఆర్థిక పరిస్థితి రోజు రోజుకు దిగజారింది. ఏ పని చేసినా నష్టం రావడంతో దిగజారిపోయాము. గత కొన్ని రోజుల క్రితము నేను పూర్తిగా దిగజారినప్పుడు ఏమి చేయమందురని ప్రార్థించాను. తేది 19-02-2012 కల ప్రకారం, అన్నీ కోల్పోయిన వేళలలో కూడా అత్యంత ప్రేమతో, (అన్నీ త్యజించి) సేవించమని మరియు వ్యాపారము మానివేయమని చెప్పారు. నేను బాగా ఆలోచించాను. ఇందులో కొన్ని ఇబ్బందికర అంశాలు కనబడ్డవి. కాబట్టి స్వామివారిని ఇలా ప్రార్థించాను. ప్రభూ! ప్రతి సంవత్సరము మీ జపసమర్పణ, రథయాత్ర, మాసపత్రిక లాంటి సేవలకు డబ్బు లక్షల్లో ఖర్చవుతుంది. పైగా ఒక నలుగురు వ్యక్తులు నా వద్ద పని చేస్తే తప్ప నేను ఈ సేవను చేయలేను. నాకు వ్యాపారము తప్ప మరో ఆదాయము లేదు. ఏ పనీ చేయకుంటే ఈ ధనాన్ని ఎలా సమకూర్చాలి? దీనితోపాటు నా కుటుంబాన్ని ఎలా పోషించాలి? సంఘంలో ప్రతీదీ డబ్బుతో ముడిపడి ఉన్నది. రోజులు గడిచిన కొద్దీ డబ్బు అవసరం పెరుగుతుంది. ఏ పనీ చేయకుండా ఇంట్లో కూర్చుంటే మనుగడ ఎలా సాగుతుంది? అందుకని నాకు తగిన వ్యాపారము లేదా అందుకు తగినట్లుగా చేయమని వేడుకున్నాను. లేనిచో స్వామి సేవతో పాటు నా మనుగడ కష్టమగునని, ఏవిధంగానైనా రక్షించమని, బాధాతప్త హృదయంతో పదే పదే వేడుకున్నాను. దీని సమాధానమే ఈ కల.

**తేది 05-06-2012 కల :** నేను, నా భార్య సురేఖ కలిసి ఒక ఫకీరు ఇంటిముందు ఉన్నాము. అప్పుడు ఆ ఫకీరు ఆయన భార్యతో తన సొంత ఇంటి ముందు నిలుచున్నాడు. ఆయన మమ్మలను సాదరంగా ప్రేమతో పలకరించాడు, మా వైపు ఆప్యాయంగా చూశాడు. ఆయన ఒక లుంగీ కట్టుకుని, షర్టు వేసుకుని నిలుచున్నాడు, ప్రక్కన ఆయన భార్య ఉన్నది. అది వారి సొంత ఇల్లేనట. ఆయన ఏ పనీ చేయడట, కేవలము దైవ ధ్యానమే చేస్తాడట. వారి ఇంటిలో అంటే కాంపౌండ్ వాల్ లోపల ఒక జామచెట్టు ఉంది. ఇది మా ఇంట్లో ఉన్న జామచెట్టు లాగనే కనబడింది. అంటే... ఈ చెట్టును చూడగనే మా ఇంటిలో ఉన్న జామచెట్టు కలలోనే గుర్తుకు వచ్చింది. దానికి చాలా పెద్ద పెద్ద జామకాయలు దాదాపు బొప్పాయి కాయలను పోలిన సైజులో అదే ఆకారము, పొడుగు గల జామకాయలు చెట్టునిండా విరివిగా కాసాయి. వీటిని చూచి నేను ఆశ్చర్యపోయాను. ఇంత పెద్ద జామకాయలు ఎలా కాచాయని అనుకున్నాను. ఆ ఫకీరు ఒకటి కోసి నాకు ఇచ్చాడు. ఆ తరువాత మేము వారి ఇంటి వెనుక ఉన్నటుల దృశ్యం మారింది. ఆ వెనుక వైపు కూడా, ఆ ఫకీరు ఇంటిలో, అదే సైజు గల మరో జామచెట్టు, అదే సైజు గల జామకాయలను కాసింది. ఇక్కడ కూడా ఒకటి తెంపి నాకు ఇస్తూ ఇలా అన్నాడు ''ఇవి భగవంతుడు ఇచ్చినవి, ఆయన కృపచే కాచినవి'' అని చెప్పాడు. ఇది భగవంతుని 'దువా బేటా' తీసుకొమ్మని నన్ను బలవంతపెట్టాడు. నేను తీసుకున్నాను. ఆ ఫకీరు వారి 7-8 సంవత్సరాల కొడుకు వారితోనే ఉన్నాడు. వారు వీటినే తినుచూ జీవిస్తున్నారు. భగవంతుని ధ్యానము తప్ప మరే పని చేయుట లేదు. కల చెదిరింది.

దీనర్థం - నేను కూడా భగవంతుడే అన్నీ సమకూర్చునని విశ్వసించాలి, మరియు వ్యాపారము మానివేసి ఆయన సేవ, ధ్యానములపై ఎక్కువ ధ్యాస పెట్టమని, లౌకిక విషయాలకు దూరంగా ఉండమని చెప్పారని భావించాను. నా యొక్క వనరులను పెంచి కాని, మరే విధంగా కాని నాకు సరిపడ రెండు ఆర్థిక వ్యవస్థలను స్వామివారు స్వయంగా కల్పించుదురని భావించాను. నన్ను మాత్రం వ్యాపారం లాంటి లౌకిక విషయాలను వదిలిపెట్టి సంపూర్ణంగా స్వామి చింతనలో కాలం గడపమన్నారు.

## దశమ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

ఈ జపానికి తేది 09-07-2012 నుండి మా ఇంటిలో 7 రోజులు పూజలు నిర్వహించాము. తేది 16-07-2012 నాటి సాయంత్రం రథయాత్ర ప్రారంభోత్సవము జరిగింది. శ్రీశ్రీశ్రీ శ్రీనివాస వ్రతధర్ నారాయణ రామానుజ జీయరు స్వామివారు, శ్రీ రమణాచారి గారు, శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ గారు, శ్రీ కందాడై రామానుజాచారి గారు, డా॥ పి.విజయలక్ష్మి మొదలైన వారు విచ్చేశారు. తేది 17-07-2012 నుండి 02-08-2012 వరకు హైదరాబాదులో, ఆ తరువాత మహబూబ్ నగర్, కర్నూలు, నంద్యాల, ఆళ్ళగడ్డ, కడపలో తిరిగి తేది 08-08-2012 నాడు తిరుపతి చేరాము. తేది 09-08-2012 నాటి సాయంత్రము అలిపిరిలో స్వామివారి పాదాలకు ఈ 10వ పర్యాయంగా 7

కోట్ల జపమును సమర్పించి పూజించాము. తేది 10-08-2012 గోకులాష్టమి నాడు ఉదయము శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము వద్ద జప హోమాదులను నిర్వహించాము, పిదప అప్పటి టి.టి.డి ఈ.ఓ శ్రీమాన్ ఎల్.వి.సుబ్రమణ్యం గారు యజ్ఞ పూర్ణాహుతి కావించి, జపమునకు నమస్కరించి జప సమర్పణ కావించారు. మరియు ఏకాదశ పర్యాయంగా 7 కోట్ల జపమునకు శ్రీకారం చుట్టి వెళ్ళిపోయారు. ఆ తరువాత భక్తులు తలా కొంత జపాన్ని స్వామివారికి సమర్పించారు.

ఈ పదవ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణలో స్వామివారు రెండు అద్భుత లీలలను చూపెట్టారు. ఒకదానిలో నేను ఇంకా ఎదగవలసి ఉన్నదని చెప్పుచు, భవిష్యత్తులో గోవిందుణ్ణి పొందగలనని చెప్పారు. రెండవ దానిలో నేను తన ఆంతరంగిక సేవకుడిగా ఎదిగినట్లు చూపెట్టారు. ఆ లీలలు ఈవిధంగా ఉన్నవి.

## గోవిందుణ్ణి పొందాలంటే మరింత ఎదగాలి

ఈ లీల అత్యంత విశ్లేషణాత్మకంగా ప్రసాదించారు. తేది 16-07-2012 నాడు మా ఇంటి నుండి రథ యాత్ర ప్రారంభమగును. ఆ ఉదయం దాదాపు 9 గంటల ప్రాంతమున ఎవ్వరో నాకు ఫోన్ చేసి వ్యంగ్యంగా మాట్లాడారు. మిస్డ్ కాల్ ఉంది మాట్లాడుచున్నాను, రథయాత్ర తీస్తున్నావట ఇంతకు స్వర్గం ఉన్నదా? అంటూ మొదలుపెట్టాడు. క్రిస్టియన్ భాషలో మాట్లాడుచు, నన్ను మార్చి వారి మతములో చేర్చుకొనుటకు ప్రయత్నించాడు. దీనిని గ్రహించిన నేను నీకు హిందూ మతము గురించి ఏమి తెలుసు? తెలియంది మాట్లాడకు, స్వర్గం పోవాలని ఆశ నాకు లేదు. హిందూ మతము చదివి నేర్చుకుని, దీని అంతరార్థమును గ్రహించి మాట్లాడుమన్నాను. నిజానికి ఈ ప్రపంచపు అన్ని మతాలు, క్రిస్టియన్తో కలిపి ఇందునుండే జన్మించాయని కటువుగా మాట్లాడి ఇంకా ఏం మాట్లాడాలో తెలియక ఫోన్ పెట్టేశాను. కానీ నేను సరైన జవాబు ఇవ్వలేదనే బీజము నాలో నాటుకపోయింది. మనస్సు కలవర పెట్టింది. దీనికి తోడు గత 2-3 సంవత్సరాల నుండి నేను పొందు ఆర్థిక ఇబ్బందులు, స్వామివారిని ప్రార్థించినప్పటికీ ఏ పనీ జరగక పోవుట వలన నా మదిలో ఈ విషబీజము నాటుకున్నది. స్వామి భక్తి ఊగిసలాడింది. దీనిని తీసివేయాలని స్వామివారిని గత కొన్ని రోజుల నుండి ప్రార్థించసాగాను. దీని భావమే కల.

**తేది 29-07-2012 కల :** బహుశా నేను చిన్నగుండవెల్లి మా ఇంటి వద్ద ఉన్నాను. నేను నా గమ్యస్థానమైన మా తోటబావి వద్దకు పోవలసి ఉంది. ఇంతలో ఒక ప్రళయము వచ్చింది. నా ముందూ, వెనక, చుట్టుప్రక్కల అంతా జలమయమైంది. చెట్లు, చేమ, గుట్టలు, ఇండ్లు కనిపించ లేదు. అన్నీ కొట్టుకుపోయాయి. మొత్తం జలమే. నేను ఏ దిక్కుగా వెళ్ళాలని భ్రమపడ్డాను. నేను పయనించే దిశను గుర్తించలేకపోయాను. అయోమయం ఆవహించింది. సూర్యుడు కూడా కనపడలేదు. కాని నా దారి తెలుసు, ఇంతకు ముందు వెళ్ళాను, అనుభవమున్నది కావున ఇటువైపు అని గ్రహించాను. మొత్తం మీద తికమక పడ్డాను. కల చెదిరింది.

తెల్లవారి దీనిని గ్రహించిన నేను స్వామివారిపై మరింత భక్తిని, విశ్వాసాన్ని పెంపొందించుటకు ప్రయత్నించాను. ఈ విషయమై సిగ్గుపడ్డాను. తప్పైంది క్షమించమని ప్రార్థిస్తూ చెంపలేసుకున్నాను. దీనిలో నా మనస్సును స్వామివారు తెలిపారని గ్రహించాను. ఇక స్వామివారిని కించపరచినట్లు మాట్లాడిన వారి మాటలు నన్ను బాధించాయి. నేను పరిణతి చెందని కారణంగా సరైన సమాధానము ఇవ్వలేదని గత 20 రోజుల నుండి బాధపడసాగాను. దీనిని గ్రహించిన తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఒక చక్కటి జవాబు ద్వారా నన్ను తృప్తి పరచాడు. "నీవు గోవిందుని చూపగలిగితే నీవన్నట్లు చేస్తానన క పోయావా" అని ఒక హృదయాంతర భావం ద్వారా చెప్పారు. అంటే... భవిష్యత్తులో నేను గోవిందుణ్ణి పొందగలనని దీని అర్థం. ఎంతో సంతోషించాను. ఇలా గోవిందుణ్ణి పొందాలంటే మరింత ఎదగవలసి ఉన్నదని సూచించారు.

## ఆంతరంగిక సేవకుడిగా సూచించుట

రెండవ కలలో నన్ను తన ఆంతరంగిక సేవకుడిగ ప్రమోషన్ ఇచ్చాడు.

తేది 04-08-2012 నాటి సాయంత్రం నమో వేంకటేశాయ రథయాత్ర కర్నూలులో తిరగవలసి ఉన్నది. మహబూబ్ నగర్ నుండి కర్నూలు వచ్చునప్పుడు అక్కడి ఎస్.పి మమ్ములను ఒక వందమంది పోలీసులతో అడ్డుకున్నాడు. కర్నూలులో త్రిప్పనివ్వలేదు. అక్కడి ఆర్గనైజర్లు, నేను వారించినా ఒప్పుకోలేదు. వారు మమ్ములను కర్నూలుకు 30 కి.మీ దూరములోని బుగ్గరామేశ్వరుని ఆలయంలో విడిచి వెళ్ళారు. ఆ ఆలయం త్రేతాయుగం నాటి శ్రీ పరశురాముడు ప్రతిష్ఠించినదట. రాత్రి ఈ ఆలయంలోనే పడుకున్నాము. రథము తిరగక పోవుటవలన చాలా బాధేసింది. నా ప్రభువుని పదే పదే వేడుకున్నాను. కాని ఏమి చేయలేని నిస్సహాయకుడిని. ఈ విధంగా రథయాత్రకు విఘాతం ఏర్పడిందనే విషయం స్వామివారికి త్వరగా చెప్పాలని అత్యంత ఆతురతతో పదే పదే ప్రార్థించాను. ఈ రాత్రి కల వచ్చింది.

**తేది 05-08-2012 కల :** అది శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆఫీసు. ఆ పీఠం బోర్డుపై "మహామంత్ర పీఠం" అని వ్రాసి ఉండాలి. కాని ఆ ప్రాంతపు ఎస్.ఐ (పోలీసు) ఒకరి ఆజ్ఞ మేరకు

‘మంత్రం’ పైన మరియు ‘ఠ’ పైన తెల్లని స్టిక్కరును అతికించి వెళ్ళిపోయారు. ఇది నాకు కలలో కనబడ్డది. ఈ పీఠానికి చెందిన నేను నా ప్రభు శ్రీవేంకటేశ్వరునికి త్వరగా విన్నవించుటకు ఆయన వద్దకు అత్యంత ఆత్రుతతో వెళ్ళాను. ఒక పెద్ద సభా మండపములో తిరుమల శ్రీవేంకటేశ్వరుడు రక రకాల భక్తుల విన్నపాలను స్వీకరిస్తున్నాడు. వేలమంది భక్తులు అక్కడున్నారు. నేను కూడా స్వామివారి దర్శనార్థమై అత్యంత ఆత్రుతతో వెళ్ళాను. కానీ నేను అందరు భక్తులు వెళ్ళే మార్గములో వెళ్ళలేదు. స్వామివారు నాకు కల్పించిన అధికారాల మేరకు నేను అంతరంగులు వెళ్ళినట్లు ప్రత్యేక మార్గం గుండా స్వామివారి చెంతకు వెళ్ళి నిలబడ్డాను. నా ముందు ఒక పరదా కట్టబడి ఉన్నది. ఈ పరదా దాటితే స్వామివారేనట. కొంత సమయం తరువాత ఒక పూజారి ఈ పరదాను తొలగించునట. కల చెదిరింది. హాలు ఏ రకంగా ఉంది, స్వామివారు, భక్తులు ఎక్కడున్నారు, నేనెక్కడున్నాను, కలలో ఈ హాలును ఏవిధంగా చూచాను అనే దానిని ఈ క్రింద చూపుచున్నాను.




**ఆంతరంగిక సేవకుడిగా స్వామి వారికి సమీపంలో ఉండుట**

నేను స్వామివారి అంతరంగులు వెళ్ళే మార్గాన వెళ్ళాను కాబట్టి నేను స్వామివారికి సేవకుడి నుండి ఆంతరంగిక సేవకుడిగా ఎదిగానని మురిసిపోయాను.

## స్వామి ఆశించిన స్థితిలో సగము వరకే చేరుట

సం॥ 2002 విజయదశమి నాడు స్వామివారికి సేవ చేయాలని భావించి శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠంను స్థాపించాము. సంవత్సరం 2012 విజయదశమి వరకు 10 సంవత్సరాలు పూర్తి కావస్తున్నప్పటికీ నేను స్వామివారు ఆశించిన స్థితిలో సగము వరకు మాత్రమే చేరానని చూపించారు. ఇది ఒక అద్భుతమైన లీల ఈవిధంగా ఉంది.

తేది 24-10-2012 నాడు విజయదశమి. ప్రతి దసరాకు స్వామి సేవలో నేను ఎంతవరకు ఎదిగానని చూచుకొనుట ఆనవాయితీ. తేది 23-10-2012 నాడు సాయంత్రం స్వామివారిని ప్రార్థించాను. ప్రభూ, మీ సేవా సంస్థను స్థాపించి పది సంవత్సరాలు దాటి 11వ సంవత్సరము లోనికి అడుగిడుతున్నాము. ఈ పది సంవత్సరాలలో 10 పర్యాయములు 7 కోట్ల జపాన్ని సమర్పించాను. ఈ పది సంవత్సరాలలో నేను ఏమి సాధించానో ఎంతవరకు నా గమ్యంవైపు వచ్చానో అనే విషయం నాకంటే మీకే ఎక్కువ తెలుసు. ఇంకా ఎంత సాధించవలసి ఉంది అనేది కూడా మీకే తెలుసు. దయచేసి నా స్థితిని తెలుపగలరని ప్రార్థన అని విన్నవించాను. నా విన్నపాన్ననుసరించి స్వామివారు చక్కని లీలను చూపారు.

**తేది 24-10-2012 కల :** మేము ప్రతి తొలి ఏకాదశి మరియు వైకుంఠ ఏకాదశి పర్వదినములలో హైదరాబాద్ లో భజగోవిందం కార్యక్రమాన్ని నిర్వహించేది. డబ్బులు ఖర్చవుతుంది కావున ఈసారి నిర్వహించకూడదని గత కొన్ని రోజుల నుండి ఒక బలమైన భావన కలుగుతోంది. ఈ లీలలో స్వామివారు ఒక దెబ్బకు రెండు పిట్టలను కొట్టినట్లు లీలను చూపెట్టారు.

నేను మా ఊరిలో మా పాత ఇంటిలో ఉన్నాను. ఇంటి వెనక ఉన్న చేదబావి గోడకు ఆనుకొని నిలుచున్నాను. మా ఇంటికి శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామి వారు వచ్చారట. వారు నా ప్రక్కనే నిలుచున్నారు. జీయరు స్వామివారు నాతో ‘‘సాయిరెడ్డీ ఈసారి సంభావన చాలా ఎక్కువ ఇవ్వాలి’’ అని అన్నారు. ‘ఓ’ స్వామీ తప్పక ఇస్తానన్నాను. ఇంతకు ఎంత ఇవ్వమంటారని అడిగాను. అప్పుడాయన 30 వేలు ఇవ్వమన్నాడు. ఇంతలో నా మనస్సులో 15 వేలు ఇవ్వాలనే ఆలోచన వచ్చింది. కాని ఇది ఆయనతో నేరుగా చెప్పలేక ‘‘మంచిది స్వామీ నేను మిమ్మలను తప్పక తృప్తి పరుస్తాను, మీరు తృప్తి చెందేవరకు ఇచ్చెదనని’’ చెప్పి అక్కడనుండి వెళ్ళిపోయాను. నేను మాత్రం వారికి 15 వేలు ఇచ్చి తృప్తి పరచాలనుకున్నాను. కాని జీయరు గారు వినే విధంగా కనిపించలేదు. వీరినుండి

తప్పించుకునే ఉద్దేశ్యముతో పని లేనప్పటికీ సిద్ధిపేటకు పోయాను. ఆలస్యంగా ఇంటికి వస్తే జీయరు గారు వెళ్ళిపోతారని భావించి అర్ధరాత్రి వేళ ఇంటికి వచ్చి నిండా కప్పుకుని పడుకున్నాను. ఆలస్యంగా పడుకున్నాను కాబట్టి ఉదయం ఆలస్యంగా లేస్తూ, జీయరు గారు వెళ్ళిపోయారని భావిస్తూ, కప్పుకున్న దుప్పటిని తీశాను. కానీ నన్నే చూస్తూ నా ప్రక్కనే కూర్చున్న శ్రీశ్రీశ్రీ జీయరు స్వామివారు నేను దుప్పటిని తీయడము చూచి నా భుజముపై చిన్నగా కొట్టారు. వెంటనే నేను ఆయన వైపు చూచి వారు ఇంకా ఇక్కడే ఉన్నారని గ్రహించి ప్రణామాలను పెట్టాను. ఇంతలో ఆయన వెంటనే నా ''సంభావన'' అంటూ తన చేతిని చాచారు. ''స్వామీ'' నిన్న పని మూలాన ఇవ్వలేదు, ఈనాడు తప్పక ఇస్తానని అక్కడినుండి వెళ్ళిపోయాను. తిరిగి మా ఇంటిలోనికి వెళ్ళేసరికి జీయరు గారి ఆంతరంగికుడు శ్రీమాన్ కళ్యాణ్ చక్రవర్తి స్వామివారు, తిరునామాలు ధరించి నాకు ఎదురై ఇలా అన్నారు. ''స్వామివారు నీ సంభావన కోసమే ఈ రోజు ఇక్కడ ఉన్నారు. నిజానికి ఈపాటికి వేరే ఊరు వెళ్ళవలసిందని'' అన్నారు. దీంతో నేను లేదు లేదు నేను ఎలా మరచానో తెలియదు,




ఈరోజు తప్పక సంభావన ఇస్తానని చెప్పాను. తిరిగి ఇంటిలో మరో గదిలోనికి వెళ్ళాను. కల చెదిరింది.

జీయరు స్వామివారు 30 వేల రూపాయలు అడిగితే నేను 15 వేలు ఇస్తానన్నాను కాబట్టి స్వామివారు ఆశించిన స్థాయికి సగము మాత్రమే చేరుకున్నానని భావించాను. మరియు 30 వేలతో భజ గోవిందం నిర్వహించగలం కాబట్టి భజగోవిందమును మరికొన్ని ఎక్కువ పైసలు ఖర్చు చేసి కొనసాగించాను.

నా దశ : అన్యమతస్థుల మధ్య నివసించు హరిదాసు జీవనము గడపమన్నారు. వ్యాపారంలో రాణించలేదని చింతించకు, స్వామివారి పద్మపీఠమును తయారు చేస్తున్నావన్నారు. గోవిందుని పొందుటకు మరింత పరిణతి చెందమన్నారు. నన్ను తన వద్దకు చేర్చుకున్నందుకు స్వామివారు ఎగిరి గంతేశారు. ఇప్పటికి నా స్థితి సగము వరకే చేరిందని చెప్పారు.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**
**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**
**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,**
**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

**తిరుమల శ్రీ వేంకటేశ్వరుని**
**దిశానిర్దేశము**



**స్వామివారి 700 దివ్యలీలలు**
**మొదటి సంపుటము**
తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో లభించును.
**12 భాగాలు కల**
**పుస్తకము ధర : 250/-**

ప్రచురణ: శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం
గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500 007.
ఫోన్: 040-27175050 (10.00 am to 6.30pm)
website: srivenkatesham.org, mail: srivenkatesham@gmil.com

పై అడ్రస్ నుండి పుస్తకమును పొందవచ్చును. లేదా... పోస్టు / కొరియర్ ద్వారా పొందగోరువారు పుస్తకము ధరతో పాటు రూ. 50/- రిజిస్టర్ పోస్టు / కొరియర్ కొరకు కలిపి మొత్తం రూ. 300/- ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపగలరు. మరియు మీ అడ్రస్‌ను ఇదే నంబర్‌కు వాట్సప్ / మెసేజ్ ద్వారా పంపి పొందవచ్చును.

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చుమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**

# తిరుప్పావై

**శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు**

గత సంచిక తరువాయి

## 13వ పాశురము



పుళ్ళిన్ వాయ్ కీణ్డానైప్పొల్లావరక్కనై,
క్కిళ్ళి క్కళైన్దానై క్కీర్తిమై పాడిప్పోయ్,
పిళ్ళైక ళెల్లారుమ్ పావైక్కళమ్ పుక్కార్,
వెళ్ళియెళున్దు వియాళ ముఱంగిత్తు,
పుళ్ళుమ్ శిలుమ్బినకాణ్! పోదరిక్కణ్ణినాయ్,
కుళ్ళక్కుళిరక్కుడైన్దు నీరాడాదే,
పళ్ళిక్కి డత్తియో పావాయ్! నీ నన్నాళాల్!
కళ్ళమ్ తవిర్ న్దు కలన్దేలో రెమ్బావాయ్.

తాత్పర్యం – ఓ బాలా! మనతోడి పిల్లలందరూ బకాసురుని నోటిని చీల్చిన దుష్టుడైన రావణుడనే రక్కసుణ్ణి శ్రీరామ రూపంలో సునాయాసంగా గిల్లిపారవేసిన శ్రీకృష్ణుని యొక్క వీరచరితను పాడుకుంటూ, వ్రతమునకై నిర్ణయింపబడిన స్నానఘట్టమునకు పోయి ప్రవేశించిరి. తెల్లవారుటను సూచిస్తూ శుక్ర నక్షత్రముదయించి, బృహస్పతి నక్షత్రమస్తమించింది. అన్ని దిక్కులలోనూ తమ తమ ఆహారాన్వేషణకై పక్షులు వ్యాపించిపోయి అరచుచున్నవి. లేడివలె చపలమైనట్టి, తుమ్మెదలవంటి నల్లని నేత్ర సౌందర్యము కల ఓ సుందరమైన బొమ్మా! పుష్పమందు చిక్కిన తుమ్మెదను బోలిన నేత్రములు కలదానా! మునిగి పుష్పముతో పోటీపడతగిన నేత్ర సౌందర్యము కలదానా! చల్లచల్లని నీట విరహతాపమారునట్లు నేత్ర సౌందర్యము కలదానా! మాతో కలిసి స్నానము చేయకుండగా ఏకాన్తముగా పండుకొని నిదురిస్తున్నావా? ఆ కపటము వదలి మా గోష్ఠిలో కలిసి వ్రతము నాచరింతము రమ్మ! అని ఎనిమిదవ గోపికను లేపిరి.

విశేషార్థము – ఎనిమిదవ గోపికను మేల్కొలుప వచ్చింది ఆండాళ్. ఈమె అతిసుందర నేత్రి. ఈ నేత్రములను విడిచి ఉండలేక కృష్ణుడే వస్తాడు నాకేమి అంటూ పరున్నది గోపిక. శ్రీరాముడు అన్ని బాధలు పడి అయినా సీతమ్మను కాపాడింది ఆమెయొక్క నేత్ర సౌందర్యానికి దాసుడయ్యేనంటారు చమత్కారంగా. ఒకసారి లంకను చేరి సీతను చూచాడు హనుమ చెట్టుపైనుంచి. ఇన్ని రోజులూ సీత అంటే ఏమిటో తెలియదు తనకి. శ్రీరాముడికుండే సీతా వియోగ శోకమును చూసి నవ్వుకునే వాడట హనుమ. ఎందుకు? ఎంత ప్రేమైతే మాత్రం మరీ ఇంత దుఃఖమా? ఈ రామునికి అనుకొనేవాడట. మరి ఇప్పుడు సీతను చూచాక 'అబ్బా రాముడెంత ధైర్యస్థుడు? ఇలాంటి సీతను వదలి, ఇంతకాలము ఎలా జీవించగలుగుతున్నాడో! అని ఆశ్చర్యపడ్డాడు. సీతారాములలో ఎవరివి గొప్ప గుణాలో హనుమ అక్కడ బేరీజు వేస్తున్నాడు. అక్కడ సీతారాములు ఇరువురూ శీలములో, వయస్సులో, ఆచరణలో, వంశగౌరవములో సరి సమానంగా సరి తూగగలరు. అయితే శ్రీరామునిలో లేని గొప్పగుణం సీతలో ఉంది. అదే కలువరేకులవంటి నేత్రాలు కలిగి ఉండటం. అది తలచే శ్రీరాముడు అన్నిటికీ సిద్ధపడ్డాడట. ఈనాటి గోపికా అదే స్థితిలో ఉంది. తన ప్రయత్నం మానింది.

వాస్తవాలను ఉన్నట్లు చూపిస్తేనే దానిని కన్ను అంటారు. కళ్ళున్నాయి కాని వస్తువులు యథాతథంగా కనబడ్డం లేదంటే ఆ కళ్ళు సరైనవి కావని అర్థం. అలాగే జ్ఞానం ఉన్నదానిని ఉన్నట్లు చూపనిచో దానిని జ్ఞానమనరు. అజ్ఞానమనే అంటారు. ఉన్నది ఉన్నట్లు తెలిపేది, యథార్థ జ్ఞానం ఇది మూడు రకాలు.

"స్వజ్ఞానం ప్రాపకజ్ఞానం ప్రాప్య జ్ఞానం ముముక్షుభిః ।
జ్ఞానత్రయ ముపాదేయం ఏతదన్యం న కించన" ॥

నేనెవరో తెలపాలి. నేనేమి చేయాలో తెలపాలి. నేను పొందే ప్రయోజనమేమిటో తెలపాలి. ఈ మూడూ తెలిస్తే సర్వమూ తెలిసినట్లే అంటారు మహర్షులు. ఆ జ్ఞానం ఎలా వస్తుంది? శ్రీకృష్ణుని యందే మనసుండి వానినే కొలవాలనే ప్రేమ ఉన్నవారికి శ్రీకృష్ణుడే ప్రీతితో అలాంటి జ్ఞానాన్ని ఇస్తానని అన్నాడు.

**"ప్రీతిపూర్వకం దదామి బుద్ధి యోగం ।**
**తం యేన మాముప యాన్తి తే' ॥**

దానివల్ల అజ్ఞానులు తన సన్నిధి చేరుతారని ప్రతిజ్ఞ చేశాడు. ఎలా ఇస్తాడు? ఆత్మ భావస్థః 'జ్ఞాన దీపేన భాస్వతా' వారి హృదయంలోనే నేనుండి జ్ఞానమనే గొప్ప దీపాన్ని వెలిగిస్తానన్నాడు. ఈనాడు ఈమె అట్టి స్థితిలో ఉన్న యోగితో సమానురాలు. తానే ఇస్తానంటే ఇక మనమేమీ చేయకూడదని నిర్భయురాలై పరున్నది.

బయట గోపికలు ఇది గుర్తించారు. ఇస్తానన్నాడు స్వామి, సరే పొందాలన్న తపన మనసులో ఉంటేనే కదా ఇచ్చేది. వెంటనే పొందనిదే నేనుండలేననే ఆర్తి లేకపోతే మనకి ప్రేమ లేదని అర్థం. అది ఉంటే ఏదో ఒకటి చెయ్యకుండా ఉండలేము. ఇవేవో వాని అనుగ్రహాన్ని సాధిస్తామని కాదు. ఊరికే ఉండలేక చేసేవే. మన గోపికలకు వ్రతాన్ని ఆచరించడం స్నానానికి పోవడం ఇవేమీ ప్రధానం కాదు. అసలివన్నీ ఊరివారి కోసమే. వీరికి కావలసింది స్వామిని చూడడం. స్వామి సేవలో ఉండటం. అది మనసుకు పట్టేది భగవద్భక్తులతో కలిసి ఉంటేనే. కనుక ఒంటరి అనుభవం మాని గోష్ఠిలో చేరమని పిలుస్తోంది ఆండాళ్. అందరితో కలిసి పొందే కృష్ణానుభవం నీవొక్కర్తివే పొందితే అది దొంగతనమవుతుంది. భగవంతుని ద్రవ్యం కంటే భాగవతుల ద్రవ్యం దొంగిలిస్తే మరింత పాపం. అందరికీ చెందినవాడు కృష్ణుడు, అతనిని దొంగిలించావు. నీలో దాచుకున్నావు. దేవునికి చెందిన వానిని పొందడానికి పనికిరావాలి జ్ఞానం. దానిని నీవు దొంగిలించావు. స్వామిని చేరరావడం లేదు. కృష్ణానుభవం గల నీ దివ్యదేహం మాకు దర్శనీయమైంది. అది మా ద్రవ్యం. దానిని ఈ భక్తులనుండి దొంగిలించావు. అందుకే బయటికి వచ్చి మాకు నీవు కనబడటం లేదు. ఇన్ని దొంగతనాలేలనమ్మా అంటోంది ఆండాళ్.

"యో మాం పశ్యతి సర్వత్ర సర్వంచ మయి పశ్యతి". యోగదశలో ఉన్న జ్ఞాని సర్వత్రా భగవద్దర్శనం చేసే అందమైన విశాల నేత్రాలు కలిగి ఉంటాడు. నిన్నటి మేలుకొలుపులో స్త్రీలను ఏడిపించి ఆనందపడే కృష్ణుని ఆనందం చేయడం మాని అతని గ్రామంలో శ్రీరాముని గానం చేయటం ఎంతటి సాహసం? అయితే కృష్ణుడు మాత్రం దయామయుడు కాదా? ఈయన మాత్రం స్త్రీ జాతిని రక్షించలేదా? ఈ విధంగా అనుకుంటూ వ్రేపల్లె మొత్తం రెండు పక్షాలుగా చీలిపోయింది.

రాముని పక్షం నుండి కృష్ణుని పక్షం నుండి ఒకరితో ఒకరికి వాదోపవాదాలు పెరిగిపోయాయి. ఇంతలో ఒక పెద్దావిడ లేచింది. వాదనని ఆపమంది, అసలు ఉన్నది ఒక్కడే దేవుడు అని చెప్పింది. అవతారాలు వేరైనా స్వామి ఒక్కడే. మొన్న ఏం జరిగిందో తెలుసా? అన్నది.

యశోద ఒకరోజున మన బాలకృష్ణుని పడుకోబెట్టి రాముని కథ చెబుతూ పాడుతోంది. మధ్యలోకి వచ్చిన తరువాత 'రావణుడు సీతను అపహరించాడు' అని చెప్పడం దాకా వచ్చింది. అంతలో మన కృష్ణుడు 'లక్ష్మణా ధనుస్సు ఎక్కడా' అని పెద్దగా గోల చేశాడట. అపుడు యశోదకు ఏమీ తెలియలేదు. అప్పుడు చెప్పాను రాముడే కృష్ణుడని అంది. అందరూ సర్దుకొని శాంతపడి నేటి గోపిక ఇంటికి చేరారు. కొంగ వేషంతో వచ్చిన అసురుని నోరు చీల్చివేసినవాడు, రావణుని దునుమాడిన స్వామి లోపల లేని భక్తి శ్రద్ధలు ఉన్నట్లు నటించింది కొంగ. అది మనసులోని దంభం. దేవునికి ఎదురు తిరిగే మనసులోని అహంకారమే రావణుడు.

అమ్మా శ్రీకృష్ణ విరహితులైన గోపికలంతా స్వామి కీర్తిని పాడుకుంటూ వ్రతస్థలం చేరిపోయారమ్మా. స్వామి కీర్తి మనకు ఆధారం. నీవు కూడా వచ్చి ఈ కీర్తనలో భాగం పంచుకోవూ? 'పిల్లలు కదా, పోయి ఉంటారు కదా, నేను సమయానికి వస్తాను లెండి' అని అనవు కదా! తెల్లవారిపోయింది. శుక్రుడుదయిస్తాడు. బృహస్పతి అస్తమిస్తాడు. శుక్రుడు అసుర గురుడు. ఆయన తల ఎత్తక ముందే మనం కృష్ణుని చేరాలి. బృహస్పతి దేవగురువు. అతడు ఉండగానే చేరాలి.

లోపల ఉన్న గోపిక మహాజ్ఞాని. అమ్మా! మాకు దర్శనమివ్వు. చార్వాక దర్శన ద్రష్టయైనవాడు బృహస్పతి. మత నాస్తిక వాదాలు అంతం చేయాలి.

నీవు లేడి వంటి, తుమ్మెద వంటి, పుష్పం వంటి నేత్రసౌందర్యం కలిగిన దానివి. అది చూసే స్వామి నీ అధీనమై ఉంటాడని నిన్ను మేమందరమూ చేరాము. భగవత్ప్రేమలో ఏవిధమైన ఆటంకం కలుగుతుందో అనే భయంతో లేడి వంటి చంచల దృష్టి కలిగినవారు జ్ఞానులు. వీరు భగవంతుని పాద పద్మాలలో సేవలు చేస్తూ తుమ్మెదలాగా శయనిస్తారు. బురద నుండి సూర్యుని వైపు చూసే పద్మాల లాగా సంసారంలో ఉండి భగవంతుని దర్శిస్తూ ఉంటారు. జ్ఞానులు, భాగవతులు భగవానుని వల్లే వికసిస్తారు. మాలో సద్భావాలు కలుగుతున్నాయి. తెల్లవారిపోతోంది.

పక్షులు అన్ని వైపులకు వెళ్ళిపోయి, జ్ఞానం వెదజల్లే ఆచార్యుల వల్లే శబ్దం చేస్తున్నాయమ్మా. భరతుడు శ్రీరామ విరహంతో సరయూ నదిలో మునిగినట్లు కృష్ణ విరహం తీరేటట్లు ఎండ స్పర్శ కలువని నీటిలో కదా మనం స్నానం చేయాలి. నేరుగా కృష్ణుని చేరి అతనితో కలిసి స్నానం చేసే సమయం ఇదే సుమా. లేచి

త్వరగా మాతో చేరవమ్మా అని పిలిచింది ఆండాళ్.

## 14వ పాశురము

ఉజ్ఞళ్ పుళైక్కడై త్తోట్టత్తు వావియుళ్
శెజ్ఞళునీర్ వాయ్ నెళకిన్దు ఆమ్బల్ వాయ్ కూమ్బినకాణ్,
శెంగల్ పొడిక్కూఱై వెణ్బల్ తవత్తవర్,
తంగళ్ తిరుక్కోయిల్ శంగిడువాన్ పోగిన్డార్,
ఎంగళై మున్నమ్ ఎళుప్పువవాన్ వాయ్ పేశుమ్,
నంగాయ్! ఎళున్దిరాయ్! నాణాదాయ్! నావుడైయాయ్!
శంగోడు శక్కర మేన్దుమ్ తడక్కైయన్,
పంగయక్కణ్ణానై ప్పాడేలోరెమ్బావాయ్

తాత్పర్యం – ఏమమ్మా! మీ యొక్క పెరటిలోనున్న తోటలో ఒక దిగుడు బావి ఉంది చూడు. దానిలో సూర్యోదయాన్ని చూచి ఆనందించే ఎఱ్ఱకలువ పుష్పములు చిరునగవులు చిందిస్తున్నట్లు విచ్చినవి. కలువరేని (చంద్రుని) విరహాని కోర్వలేని నల్లకలువలు ముకుళించుకున్నవి. కాషాయాంబర ధారులై, స్వచ్ఛమై ప్రకాశించు (పలువరుసలు) దంతపంక్తులు గల తపశ్శాలురందరునూ, సన్యాసులందరునూ, లేక ఆ వేషము వేసిన తామస దేవతారాధకులు, తమ తమ ఆలయముల తాళములు తెరచు నిమిత్తము పోవుచున్నారు. ఆరాధన సమర్పించుటకై పోవుచున్నారు. పరిపూర్ణురాలివలె, మేము లేవక ముందుగనే వచ్చి మమ్ములను లేపుదునని వాగ్దానము చేసితివి గదా! చాల్లే! ఇకనైనా లేచిరావమ్మా! బొత్తిగా బిడియము లేదే నీకు! మాటలాడుటలో మాత్రం చక్కని నేర్పరివి. ఆ నేర్పరితనము పని చేయుటలో కూడా చూపవద్దా! శంఖ చక్రాద్యాయుధములను ధరించినట్టి విశాలమైన శ్రీ హస్తము కల పంకజ నేత్రములు కల పుండరీకాక్షుని గూర్చి పాడుకుంటూ పోవుటకు వెంటనే మాతో చేరుమా! అని తొమ్మిదవ గోపికను లేపిరి.

విశేషార్థము – ఊరివారందరినీ ఒక త్రాటి మీద నడపగల సామర్థ్యమున్న గోపబాలికను ఈరోజు మేల్కొలుపుతోంది ఆండాళ్. ఆమెకు మంచి నేర్పుగా మాట్లాడగల చాతుర్యముంది. 'హాయిగా పడుకోండి. నేను ముందుగా వచ్చి లేపుతాను కదా అన్నదట. అయితే ఆమె వాగ్దానమైతే చేసింది కానీ అది మరచి నిదురించింది.

ఆమెకు విశాలమైన తోట ఉంది. అందులో ఒక దిగుడుబావి ఉంది. దానిలో పుష్పాలున్నాయి. వీటన్నింటినీ పేర్కొంటూ నిద్ర లేపింది. మనవలె నిద్రపోయేవారు కారు ఈ గోపికలంతా. మానసికంగా భగవదనుభవం పొందగల యోగులు. వారిని మేల్కొల్పడమంటే మనకి కూడా ఆ శక్తిని ప్రసాదించమని ప్రార్థించడం.

బాగుపడే కిరకకు మొదట అనుభవజ్ఞుల ఉపదేశాలను శ్రవణం చేయాలి. అది రెండు రకాలుగా ఉంటుంది. దానివల్ల ఈర్ష్యాదులు, రాగద్వేషాలు అణగి మనసు నిర్మలమవుతుంది. నిత్యం భగవంతుని కళ్యాణ గుణాలను స్మరిస్తున్నందువల్ల మనలో స్థితప్రజ్ఞత నాలుగు దశలలో ఏర్పడుతుంది. కోరికలను అరికట్టే ప్రయత్నం మొదటిది. ఆపై లభించే వాటితో తృప్తి పడుతూ ఆపేక్ష మాత్రం లేకపోవడం. ఇష్టాయిష్టాలు మనసులో మాత్రం ఉంటాయి. ఆ తర్వాత మనసులో అయిష్టత లేని సర్వ సహిష్ణుత ఆత్మకి ఏర్పడతాయి. చివరిది కోరికలనే తెలియని పక్వదశ మనలో ఏర్పడుతుంది.

మొదట ఆ స్థితి అభ్యాసం చేస్తున్నంతవరకు ఉంటుంది. బయట ప్రపంచంలోకి వచ్చేసరికి ధ్యానం చెదిరి పాత స్వభావాలు బయటపడుతూ ఉంటాయి. మళ్ళీ మళ్ళీ జ్ఞానుల ఉపదేశాలు వినాలి. ఇది నిన్నటి స్థితి.

ఇపుడు జీవులందరిలోనూ కల కృష్ణుని ఏకాకారంగా చూడగలిగే యోగ్యత లభిస్తుంది. ధ్యానదశ నుంచి బయట ప్రపంచం లోకి వచ్చినప్పుడు లోపల కృష్ణస్మరణ చెరగదు. అప్పుడు వారికి తెల్లవారిన తరువాత పగటి వెలుగులా ఉంటుంది. అంతటి యోగ్యత కలది ఈనాటి గోపిక.

ఈ స్థితులన్నీ వేదం వివరించింది. ఋషులు దర్శించి తెలిపారు. మన పూర్వాచార్యులు ఆచరించారు. ఆండాళ్ అందమైన కథలో మనకు అందిస్తోంది. మనకు జ్ఞానాన్ని కల్గించే ప్రమాణాలు మూడు. 'ప్రత్యక్షం, అనుమానం, ఆప్తవాక్యమైన శబ్దం'. అందు ఇంద్రియాలకు తెలిసే విషయాలను 'ప్రత్యక్ష'మంటారు. ప్రత్యక్షాన్ని బట్టి, మనకు గల అనుభవాలను బట్టి, కొన్నింటిని మనం ఊహిస్తాం. దీనిని 'అనుమానం' అంటారు. ఈ రెండింటికీ అందకపోయినా, విశ్వాసపాత్రులు, హితైషులు బాగుకోరి పలికేది 'ఆప్తవాక్యం'. ఋషులంతా తాము విని మనకందించిన ఆప్తవాక్యజాతమే వేదరాశి. దానిసారమే వేదాంతం. చార్వాకులకు ప్రత్యక్ష ప్రమాణం. బౌద్ధులకు అనుమానం ప్రమాణం. మన వేదాంతులకు మూడూ ప్రమాణాలే. భగవదనుగ్రహం వల్ల అర్థాలు గ్రహించినవారు 'పగటి'లో ఉన్నవారు తాము ఆచరించి మనకు అందిస్తారు. మనం వారిని అనుగ్రహించమనీ, రాత్రిని తొలగించమనీ ప్రార్థించాలి. అదే ఆండాళ్ చేస్తోంది మనకోసం. తనకోసం కాదు. ఈ గోపికను లేపుతూ మేము మూడు ప్రమాణాలను అంగీకరిస్తున్నామంటోంది.

తెల్లవారింది లెమ్మన్నారు వీరు. గుర్తులేమైనా చెప్పమంటోంది లోపల గోపబాల. నీవేచూడు 'ఎర్ర తామరలు వికసించాయి, నల్లకలువలు ముకుళించాయి'. సూర్యకిరణ స్పర్శ వల్ల ఇదే కదా కలిగేది. లోపల ఈమె 'మా ఇంటికి చేరిన సంతోషములో మీ ముఖాలు కందిపోయి వికసిస్తే పద్మాలనుకొన్నారు. నేను రాలేదనే

బాధ వల్ల కనులు మూసుకోగా – కలువలనుకొన్నారు గాని', నిజానికి ఇంకా తెల్లవారలేదన్నది. జ్ఞానుల వద్దకు చేరితే మనకూ జ్ఞానం కలిగినట్టే విషయసుఖాల రుచులు తగ్గినట్టే అనిపిస్తాయి కాని తగ్గవు.

'పెరటిలోని బావిలో పూలు మేము చూచాం కదా' అన్నారు వీరు. పిల్లవానికి పచ్చికాయ ఇచ్చి మెత్తబడిన తరువాత తినమంటే ఆత్రం వల్ల నలిపి మెత్తబడిందనుకున్నట్లుగానే మీరు కూడా నన్ను లేపాలనే తొందరపాటు వల్ల పద్మాలను విడదీసి కలువలను ముడిచేసి ఉంటారు. మనలోని కర్మవాసనలు సహజంగా మారాలి. బలవంతంగా మార్చేద్దామంటే కావు.

'మీ పెరట్లో చూసుకోవమ్మా' అన్నారు వీరు. పొలాల్లో పుష్పాలు మారాయి. కనుక వీరి పెరట్లోనే ఇలానే మారి ఉంటాయన్న అనుమాన ప్రమాణం వీరిది.

భక్తులు 'మావారు' అనుకుంటే మనకు శ్రేయస్సు. 'మీ' అంటూ విడదీస్తే భయపడాలి. భక్తుల కఠినోక్తులైనా ఆశీర్వచనాలే. 'మీ' అన్నా అది కృష్ణ సంబంధం గల వస్తువే కదా – ఫర్వాలేదని లేవలేదు.

ప్రత్యక్ష ప్రమాణాన్ని గుర్తించామని మరో గుర్తు చెబుతున్నారు. జేగురు రాతి పొడితో రంగు అద్దబడిన కాషాయాంబర ధారులైన తెల్లని పలువరుస గల్గి ఉండటం ఆహారశుద్ధికి గుర్తు. ఆహార శుద్ధి వల్ల మనస్సులో విషయ విరాగం కలుగుతుంది. భగవద్గుణాలనే నీటితో శరీరమనే వస్త్రాన్ని తడపాలి. అది దాల్చినవారు సన్యాసులు. వారి వాక్కు సాత్వికం. దైవీవాక్కు వారిది. వారి ఆరాధనా మందిరాలు శిష్యుల హృదయాలే. తాళములు ఆచార్యుల ఉపదేశములు.

నీవు మాలోని స్వామిని చూపగలిగి ఉండి ఉదాసీనంగా ఉన్నావేమి? నీ విషయవిరక్తి, భగవతిరక్తి, ఆహారశుద్ధి, దైవీవాక్కు మా హృదయ మందిరాలను తెరవాలి. అనుగ్రహిస్తానని మాట ఇచ్చి కూడా ఊరకున్నావే. నీ అనుభవానికి మేము అడ్డం కాదు. పిల్లలతో చేరితేనే కదా తల్లి పరిపూర్ణురాలు. నీ వాక్కునకు హనుమ వాక్కునకున్న శక్తి ఉంది. స్వామి కరుణిస్తాడు. పుండరీకాక్షుడిని కీర్తిద్దాం. అదే అతని సర్వేశ్వరత్వం చాటునని ఛాందోగ్యం తెలిపింది.

లేచి రమ్మని పిలిచింది గోదా.

## 15వ పాశురము

**ఎల్లే! ఇళంకిళియే! ఇన్నమ్ ఉఱంగుదియో,**
**శిల్లె న్నళైయేన్మిన్ నంగైమీర్! పోదరుగిన్ఱేన్,**
**వల్లై ఉన్ కట్టురైగళ్ పండేయున్ వాయఱిదుమ్,**
**వల్లీర్ గళ్ నీంగళే నానేదా నాయిడుగ,**
**ఒల్లై నీ పోదాయ్! ఉన్నక్కెన్న వేఱుడైయై,**
**ఎల్లారుమ్ పోన్దారో? పోన్దార్ పోన్దెణ్ణిక్కొళ్,**
**వల్లానై కొన్ఱానై మాత్తారై మాత్తళిక్క**
**వల్లానై, మాయనై ప్పాడేలో రెమ్పావాయ్.**

తాత్పర్యం – బయటివారు – ఓసే! లేత చిలుగవంటి కంఠము కలదానా! ఇంకనూ నిదురిస్తున్నావా?

లోపలివారు – గొల్లుమని ఊరకే గోల పెట్టకండర్రా పరిపూర్ణుల్లారా! (గొప్పవారలు) ఇదో వస్తున్నా.

బయటివారు – భలే మాట్లాడుతావే! పుల్లవిరుపు మాటలూ నువ్వూనూ. ఇదివరకే నీ నోటిదురుసుతనమును ఎరుగుదుము.

లోపలివారు – మీరు గొప్ప మాటకారులు. పోనీలెండి మిమ్మెందుకు అనటం నేనే అయితే కానివ్వండి.

బయటివారు – త్వరగా లేచిరావమ్మా మరి! ఏమిటసలు నీకీ ప్రత్యేకత చెప్పు.

లోపలివారు – అంతా వచ్చారర్రా.

బయటివారు – ఆ! వచ్చారు. నీవే బయటికి వచ్చి లెక్కపెట్టుకొని చూడు. బలసిన కువలయా పీడమనే ఏనుగును చంపినవాడును, చాణూర ముష్టికులను మల్లులను దునుమగల సమర్థుడయిన ఆశ్చర్యగుణములు కల మన స్వామిని గూర్చి పాడుకుంటూ వ్రతాన్నాచరిద్దామని పదవ గోపబాలికను లేపి పైకి బయలుదేరిరి.

విశేషార్థము – పదుగురిలో చివరి గోపికను లేపుతున్నది ఆండాళ్. దీనితో సగం వ్రతం పూర్తవుతుంది. ఇదే అసలు వ్రతం. ఇది స్థిరపడడానికి భగవంతుని లేపుతుంది. ఇకపై భగవానుని వద్ద ఎలా మెలగాలో నేర్పి 29వ పాటలో ఫలాన్ని కోరుతుంది. 30వ పాటలో దీనివల్ల మనకు లాభమేమిటో తెలిపి వ్రతాన్ని ముగిస్తుంది.

భక్తుల సహవాసం మనలో పూర్ణతను ఎలా కలిగిస్తుందో వివరిస్తుంది రోజు. భగవత్సంబంధం నిలబడాలంటే భక్తుల సహకారం అవసరమని కొందరి ఊహ. ఆండాళ్ దానిని సవరించింది. జీవులు వద్దనుకున్నా అందరికీ భగవత్సంబంధం ఉంటుంది. ప్రేమించిన ప్రహ్లాదునిలో ఉన్నట్లే తిట్టిన హిరణ్యకశిపునిలోనూ దేవుడున్నాడు. మరచిన మనకి భక్తులు గుర్తు చేస్తారు. కనుక కోరవలసింది దైవసంబంధాన్ని ఉన్నది ఉన్నట్లు గుర్తింపచేసే భక్తజన సహవాసమే. తనను విశ్వసించిన వారికంటే తన భక్తులను నమ్మినవారినే తానెక్కువగా ప్రేమిస్తానన్నాడు కృష్ణుడు.

భగవానుని పట్టినవాని బుద్ధి చెడితే అక్కడినుండి నాస్తికుడవుతాడు. కానీ భక్తుల దాకా ఎదిగినవాడు జారకుండా భక్తులు చూస్తారు. ఒకవేళ జారినా దైవం దగ్గర దాకానే జారుతాడు. తనగురించి తానే కృష్ణుడు చెబితే అంతా అసూయ పడ్డారు. భక్తులు భీష్మాదులు తనగురించి చెబితే అందరూ బుద్ధిగా



విన్నారు. అలా తన గురించి చెప్పేవారంటే ఆయనకిష్టం. వారి సేవ చేసేవారన్నా ఇష్టమే. ఆండాళ్ ఈ వ్రతంలో దాన్ని స్పష్టం చేసింది.

కృష్ణసంబంధాన్ని అందరిలో చూస్తూ వారి బాగుకోరి తగిన సేవలందించడమే ముఖ్యమని, మనిషి దానివల్లనే కృష్ణుని ప్రేమకు పాత్రుడై జన్మ ధన్యత నందించుకుంటాడని దీనిని బట్టి తెలుస్తుంది. ఎంత భక్తుడైనా ఈ లోకంలో తిరుగుతూ ఉంటే అతని మనఃస్థితి ఎలా ఉండాలో, దానినెలా సాధించాలో గుర్తించడం ప్రతి మనిషి విధి. ఇంతవరకు ఆ విధానం తెలిపింది.

మనిషికి ఓరిమి ముఖ్యం. నిందాస్తుతులు కష్టనష్టాలు ఎదురైనా నిర్వికారంగా అందరినీ తనవారిగా ప్రేమించేటట్లు చేయాలి ఓరిమి. సర్వాంతర్యామి అఖండానంద సాగరము అయిన కృష్ణుని ద్వారా జీవులందరికీ బంధుత్వం ఉన్నది. ఏ స్థితిలో ఏ పనిలో ఉన్నా అది స్మరించగలగాలి. అనుభవజ్ఞుల ఉపదేశాలు మనకు ఆ స్థితిని కలిగిస్తాయి. విని విశ్వాసంతో మననం చేయాలి. అది మనసులో ముద్ర పడాలి. గోపికలను లేపడంలోని ఆంతర్యం ఇదే. మొదటి ఇరువురి ద్వారా వినమన్నది ఆండాళ్. ఒకరి ద్వారా మననం, నలుగురి ద్వారా స్థిరంగా మనసులో ముద్రించుకొనే పద్ధతి నేర్పింది. మరో ఇరువురి ద్వారా అందరిలోపలా అన్నింటా బయటా ఒకే పంకజనేత్రుని సౌందర్యాన్ని దర్శింపచేసింది. ఈ విశ్వప్రేమ వల్ల ఎవరిమీదా ద్వేషం పుట్టదు. వారి లోపాలు జాలిని సరిదిద్దుకొనే వరకు బోధించే ఓరిమిని కలిగిస్తాయి. ఆ ఓరిమి ఈరోజు గోపిక లేవడం.

'వాదో నావలంబ్యం' నారదభక్తి సూత్రం. నీలో ఈ తప్పు ఉన్నదని ఎత్తి చూపితే సమర్థించుకోరాదు వాదనతో. వారికలా ఎందుకనిపించిందో ఆలోచించు, నీ ప్రవర్తన సవరించుకో. 'నా ఆరోపణే తప్పు' అనిపించేలా చేయి. బాగుపడాలనుకొంటే ఇది ప్రథమ సోపానం. రెండవ అధ్యాయంలో ఈ గుణాన్ని 'తితీక్ష' అన్నాడు కృష్ణుడు. ఎండా, చలీ, వానలను ఎదిరించక నిన్ను వాటికనుకూలంగా మలచుకొన్నట్లే నిందాస్తుతుల విషయంలో ప్రవర్తించాలి.

బాహ్యాడంబరాలు కావు కావలసింది. అది నిజమైన శ్రీవైష్ణవ లక్షణం. పెద్దల సాహచర్యం వల్ల ఈ స్థితి ఏర్పడుతుంది. తెలిశాక సమర్థనలు మాని తెలిపిన వారిపై కృతజ్ఞతా భావం కలిగి ఉండడం రావాలి. అదే పూర్ణత మనిషికి. అదే ఆండాళ్ తల్లి నేర్పుతోంది.

నిన్నటి గోపికను లేపుతూ వీరు పాడిన పాటలు కాస్త మెలకువతో విని తానూ పాడుతూ లేచి రాలేదు ఈనాటి గోపిక. ఇన్ని ఉండీ మేల్కొని తాము వచ్చాక కూడా రాకపోయేసరికి బయటివారికి బాధ కలిగింది. కృష్ణానుభవంలో ఉన్నదనుకున్నారు, పొంగిపోయారు, స్తుతిస్తున్నారు, రమ్మని పిలుస్తున్నారు. అయితే ఆమె కృష్ణానుభవంలో లేదు. కానీ వారి పాట విని పరవశించింది. వారు అపార్థం చేసుకుని ఆక్షేపించేటట్లు తనను పొగుడుతున్నారని తలచి సమాధానాలిస్తుంది. ఇద్దరి మాటలూ మంచివే. మనసున భావాలు సరిగా లేక అపార్థాలు చేసుకొంటారు. భక్తులతో చేరినప్పుడు భగవానుడే అడ్డు తగిలినా బాధ పడతారు. మాటలు తీవ్రంగా ఆరంభమైనా ఓరిమితో ఇరువురూ సర్దుకొంటారు. కృష్ణ ప్రేమామృతాన్ని తెలిపే నామాలు ఇరువురూ కీర్తించి ముందుకు సాగుతారు. దోషాలన్నీ నశింపచేసి నిత్యానందమైన తన్ను చూపే సర్వేశ్వరుడు శ్రీకృష్ణుడు మాయావియే. భక్తుల వల్ల ప్రేమ లభిస్తే ఎలా పాడక ఉంటాం? పదండి ముందుకు అన్న రీతిలో సాగుతున్నది ఆండాళ్.

# అనంతాళ్వార్ల ఆచార్య నిష్ఠ



– డా.మారంరాజు వేంకట మానస

**కలియుగారంభమున భూమిపై ధర్మసంస్థాపనార్థం వేంకటాచలంపై శ్రీవేంకటేశ్వరుడు వెలసిన దివ్యచరితమును పద్మపురాణము మనకు తెలియచేస్తున్నది. శ్రీమహాలక్ష్మి కూడా పద్మావతిగా తిరుచానూరులో కొలువైయున్నది. కలి ప్రభావము రోజు రోజుకూ మితిమీరుతున్న తరుణంలో శ్రీమహావిష్ణువు కలిపురుషునితో ఇట్లు పలికెనని పురాణము చెబుతున్నది – "ఓ కలీ! నీ యుగమున నీవు సలుపుచున్న చేష్టలకు నేను అడ్డురాను. కాని ఎవరైతే నా శరణార్థులో, గురువు పట్ల దైవపరమైన భావము కలిగి వారినే ఆజన్మాంతం దైవముతో సమానమని కొలుతురో, నవవిధ భక్తి మార్గాలలో ఏదైనా ఒక మార్గంలో నన్ను ఆశ్రయింతురో అట్టివారి దరిని నీవు చేరరాదు" అని ఆదేశించెను. కలి దీనికి అంగీకరించెను.**

ఆదిశేషుడు త్రేతాయుగంలో లక్ష్మణుడుగా, ద్వాపరయుగంలో బలరామునిగా ఎట్లైతే శ్రీమన్నారాయణుని సేవించెనో, అట్లే కలియుగంలో రామానుజునిగా అవతరించి శ్రీమన్నారాయణుని ఆరాధించుటయే కాక సమాజ జనోద్ధరణ కూడా గావించిరి. ఒక్క రామానుజునిగానే కాక అనంతాళ్వారుగానూ అవతరించినాడని పూర్వాచార్యుల ప్రగాఢ విశ్వాసం. రామానుజుని అవతారం మనకు శ్రీమన్నారాయణుని ఎట్లు శరణాగతి చేయవలెనో తెలిపితే, అనంతాళ్వారుల అవతారము గురువుకే ఆత్మానుసంధానమై, గురువాజ్ఞచే శ్రీమన్నారాయణుని ఎట్లు శరణాగతి చేయవలెనో తెలుపుతున్నది. అనంతాళ్వారు గురుభక్తితో చేసిన ఈ శరణాగతి వలన సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరునితో సంభాషణలు, చమత్కార వాగ్వాదాలు, తన తోటలో వికసించిన పుష్పాలతో, తులసీదళాలతో స్వామికి అలంకారాలు, ఆ అలంకారాన్ని చూసి మురిసిపోతూ ఉండటాలు వంటివి నిత్యకృత్యాలైపోయినవి. తన గురువర్యులైన రామానుజుని ఆజ్ఞలను పొల్లుపోకుండా ఆచరించుట వల్లనే అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీనివాసుడి అసామాన్య అపూర్వ సాంగత్యం లభించినది. అనంతాళ్వారు పట్ల వేంకటేశ్వరుని ప్రేమ కూడా అద్వితీయము. శ్రీవేంకటేశ్వరుని గడ్డానికి ప్రతినిత్యం మెత్తటి పచ్చకర్పూరం, చందనచూర్ణం అద్దుటయూ అనంతాళ్వారు కోపాన గడ్డపార విసిరినందుకే ప్రారంభమైనది. ఇక జగన్మాతయైన శ్రీమహాలక్ష్మిని తన ఇంటి పుత్రికగా తలచి వేంకటేశ్వరునకిచ్చి కన్యాదానం చేసి త్రేతాయుగంలో జనకునికి, ద్వాపరయుగంలో భీష్మకునికి, కలియుగమున పెరియాళ్వారులకి సరియగు సమస్థానమున నిలిచి పెరుమాళ్ళచే 'మామా' అని పిలిపించుకున్న ప్రియమైన భక్తుడు అనంతాళ్వారు.

రామానుజులకు ఒకనాడు నమ్మాళ్వారు రచించిన తిరువాయ్ మొళి లోని మూడవ పత్తు మూడవ పాశురము పదే పదే గుర్తుకు వస్తున్నదట.

**"ఒయినిల్ కాలమెల్లామ్, ఉడనాయ్ మన్ని,**
**వయివిలా అడిమై శెయ్య వేండుమ్ నామ్**
**తెయికురలరువి తిరువేంగడత్తు ఎయిల్ కొళ్ళోది,**
**ఎందై తందై తందైక్కే!"**

దీని అర్థము : గంభీరమైన సెలయేర్ల ప్రవాహములు గల

వేంకటాద్రిలో సౌందర్యవంతమైన తేజోమయ విగ్రహ రూపంలో విరాజిల్లుతున్న నా యొక్క తండ్రి తాతల ముత్తాతల మొదలగు వారి సృష్టికర్త యైన శ్రీవేంకటేశ్వరునికి మనము ఎల్లప్పుడూ సర్వకాల సర్వావస్థల యందు నిరంతరం కైంకర్యములు చేయవలెనని నమ్మాళ్వారు ఈ పాశురములో చెప్పియున్నారు. ఈ పాశురములో శ్రీనివాసుడు వేంకటాచలంపై కొలువై యున్నాడని తెలియకముందే నమ్మాళ్వారు వేంకటాచలపతి గూర్చి పేర్కొనినాడు. అంతట, రామునుజులు తన శిష్యులతో సమావేశమై, వేంకటాచలంపై పెరుమాళ్ళు ఉన్నందున ఎవరైనా అచ్చటనే నివాసముండి పెరుమాళ్ళను సేవిస్తూ, తిరుమల పుష్పమండపం గనుక పుష్పకైంకర్యము విశేషముగా జరుపవలెనని, దీనికి కొండపైనే సౌకర్యములు నెలకొల్పవలెనని కోరెను. ఇది విన్న శిష్యులు భయాందోళనలు చెందిరి. అప్పటి తిరుమల జనసంచారమే లేని కీకారణ్యము. క్రూరమృగములు, విషసర్పములు, కీటకాలు విచ్చలవిడిగా సంచరించెడివి. విపరీత అననుకూల వాతావరణము. జలము, సాపాటు దొరుకునో లేదో కూడాతెలియదు.శిష్యులంతాభయపడుచుండగాఅనంతాళ్వారు మాత్రం గురువాజ్ఞ పాలించుటకు సతీసమేతముగా పోవుటకు సిద్ధమయ్యెను. గురువైన రామానుజుని ఆనందార్ద్రాలలో తేలించి ''ఆణ్ పిళ్ళై'' (నిజమైన మగవాడు) అన్న బిరుదును పొందెను. పిమ్మట, ఎన్నెన్నో ప్రతికూల పరిస్థితులను తట్టుకొని కొండపై ఎకరాల కొద్దీ భూమిని చదును చేసి ఎక్కడికక్కడ జలాశయాలను ఏర్పరచి, తులసి మరియు ఇతర పుష్ప సుగంధ తోటలను నిర్మించిరి. గర్భవతియై యున్న వారి సతీమణి యొక్క సహకారము కూడా చెప్పనలవి కానిది. ఈ పుణ్యదంపతుల పుణ్య కార్యాచరణయే ఈనాడు తిరుమలలో సుందరమైన పూదోటలు, సుగంధ పుష్పసౌరభాలు, వాటిచుట్టూ ఝుంకార నాదాలతో తిరిగే తుమ్మెదలు, తేనెటీగలు మనకు దృశ్యాకర్షణగా నిలుస్తున్నవి. అనంతాళ్వారుల తిరుమాళిగ పక్కనే రాతితో పుష్పమండపము కూడా నిర్మించి అక్కడే పూలమాలలు అల్లి శ్రీవారికి అలంకారము చేసెడివాడు.

**వేంకటరమణునితో చమత్కార సంభాషణలు :**

ఒకానొక సమయమున అనంతాళ్వారు పూలమొగ్గలతో మాలలల్లుటలో నిమగ్నమైయుండగా వేంకటేశుడు సేవకునితో ఒకమారు అనంతాళ్వారును ఆనందనిలయానికి రమ్మని పిలువంపెను. ఆ సేవకుడు వెళ్ళి సందేశించగా, ''మీకూ, మీ స్వామికీ ఏమీ పనీ పాటా లేదా? నేను కూడా ఏ పని లేక కూర్చున్నాననుకున్నారా? నేనిప్పుడు మొగ్గలతో మాలలల్లుచున్నాను. ఇవి అల్లితేనే అవి విచ్చుకొని అలంకారానికి మాల బహు సుందరముగా ఉండును. స్వామి పిలిచినాడని నేను వస్తే ఈ శ్రమంతా వృధా అగును. అయినా, మాలలల్లి పుష్పకైంకర్యము చేయవలెనని నా గురువాజ్ఞ. నాకు స్వామి ఆజ్ఞ కంటే గురువాజ్ఞే శిరోధారణము. అతి ముఖ్యము. ఇదే మాట స్వామికి చెప్పగలర''ని సేవకుని పంపెను. సేవకుడు అటులనే స్వామికి విన్నవించగా, అనంతాళ్వార్ల ఆచార్య నిష్ఠకు లోలోపల సంతోషించి, బయటకు మాత్రం అలిగినట్లు నటించెను నటనసూత్రధారి. మాలలల్లి బుట్టలో పెట్టుకుని స్వామికి అలంకరించుటకు అనంతాళ్వారు ఆనందనిలయమునకు వచ్చుటను గమనించి భక్తవత్సలుడు బుంగమూతి పెట్టి అలుక నటించెను. ''అనంతా! నేను పిలిస్తే రానంటివే?! నా పిలుపు కోసం ముప్పై మూడు కోట్ల మంది దేవతలు వేచి ఉందురు. అటువంటిది నా పిలుపుకు నీవు రానని, నాకంటే నీ గురువాజ్ఞే



ముఖ్యమని పలికితివట. నీ మాలలు నాకొద్దు. నీవే తీసుకుపో'' అనెను. స్వామికి జవాబుగా వెంటనే అనంతాళ్వారు ''నీవు అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడివే కావచ్చు. కానీ నా గురువాజ్ఞ నేనెన్నటికీ జవదాటను. ఈ మాలలు నీవొద్దంటే ఈ గుమ్మానికే వదిలేసి వెళ్తాను. అవి నీవు ధరించ దలచితే ధరించు, లేదంటే లేదు'' అని తన గురుభక్తిని చాటిన ఘనుడు. అనంతాళ్వారుల గురుభక్తికి, స్వచ్ఛమైన చిన్నపిల్లవాని మనస్తత్వానికి మెచ్చి, ''అనంతా! నీవు ఎప్పుడైతే రామానుజుల దివ్య చరణాలను పట్టితివో అప్పుడే నీకు మోక్ష ద్వారాలు తెరుచుకున్నవి. నీవే నా ప్రియమైన బంధువువయ్యా!'' అనెను శ్రీనివాసుడు. అనంతాళ్వారు పరవశించిపోయెను. నిజమైన శిష్యునికి గురువు, దైవము ఒక్కటే. నిజమైన శిష్యుడే గురువుకు, పెరుమాళ్ళకు ఆత్మబంధువు అగును.

మరొక సందర్భంలో అనంతాళ్వార్ పుష్కరిణిలో సంధ్యావందనం చేయునప్పుడు ఒక ముసలి పులి ఒడ్డున పడుకుని కనపడెను. దానిని చూసి దాని దేహము చాలించే సమయం ఆసన్నమైనదని గుర్తించి, అనంతాళ్వార్ మనసులో వేంకటేశుని దానికి మోక్షమును ప్రాప్తించమని కోరెను. తలచిన కొద్దిసేపటికే పులి తన తనువు చాలించెను. మరునాడు అనంతాళ్వారు ఆనందనిలయము లోనికి వెళ్ళగా శ్రీవారి పాదపద్మములయందు ఆ పులి ఆత్మ కనపడెను. తాను కోరుకున్న చోటికే చేరినదని సంతోషించెను. శ్రీనివాసుడు తన ప్రియ భక్తులతోనే సయ్యాటలాడువాడు కనుక అనంతాళ్వారుతో ఇట్లు పలికెను. ''అనంతా! నీకు మోక్షమొసంగెదను, కానీ పశువులకు మరియు నీవెవరంటే వారికి మోక్షమునిచ్చుటకు నాకేమీ పనిలేదా? అసలు నీవెవరివి? ఈ కొండపై ఉండుటకు? ఇక్కడ నుంచి వెళ్ళిపో!'' వెంటనే అనంతాళ్వార్ ''ఏమి స్వామీ! అసలు నీవెవరు నన్ను వెళ్ళిపొమ్మనుటకు? నీవే వరాహస్వామిని అడిగి ఇక్కడ నివాసమేర్పరచుకుంటివి. నన్ను పొమ్మనే హక్కు నీకు లేదు. నా గురువుగారి ఆజ్ఞ నేను పాలిస్తుంటిని. నేను నా గురువు పొమ్మంటే పోతాను కానీ నీవు పొమ్మంటే ఎందుకు పోతాను?'' అని వాదించెను. వీరిద్దరికీ ఒకరంటే ఒకరికి అత్యంత ప్రీతి. అందుకే అపహాస్య వాగ్వాదములు చేసుకుంటిరి. భక్తి మితిమీరితే ప్రేమగా మారుతుందని వీరిరువురి సంభాషణయే దృఢంగా రుజువు చేయుచున్నది. ఒకరిపై ఒకరికి అమితమైన ప్రేమచే ఒకరినొకరు చూడకుండా ఒక్కరోజు కూడా ఉండేవారు కాదు. అనంతాళ్వారుకు జ్వరం వచ్చినా, పాము కాటు వేసినా శ్రీనివాసుడే ఆలింగనముతో చికిత్స చేసి కాపాడినప్పటికీ అనంతాళ్వారుకు తన దేహముపై అసలు దృష్టి ఉండేది కాదు. దేహమున్నంతవరకు శ్రీనివాసునికి తిరుమలలో కైంకర్యము, దేహము వీడినతరువాత వైకుంఠనాథునికి ఇదేమాదిరి కైంకర్యము చేయుదునని దృఢంగా నిశ్చయించుకున్న మహాయోధుడు, భక్తశిఖామణి. ఎంతోమంది శిష్య ప్రశిష్యులను తయారు చేసిన మహాజ్ఞాని, సద్బ్రాహ్మణ పండితుడు. రామానుజులను కూడా శ్రీరంగము నుండి తిరుమలకు రప్పించి, తాను కొండపై చేసిన కార్యాలకు మెప్పు పొందినాడు. రామానుజుల ఆదేశానుసారం తిరుమలలో మండపాలు, ప్రాకారాలు కట్టించెను. జీయర్ల వ్యవస్థను, మఠాలను స్థాపించెను. నిత్యకైంకర్యములు రామానుజులవారు నిర్దేశించినట్లు జరిపించెను. తిరుమలలో దివ్యప్రబంధ పారాయణాలు, అధ్యాయనోత్సవాలు కూడా ప్రారంభించిన మహానుభావుడు సర్వకాల, సర్వభూత దయతో, విశ్వమంతటా శ్రీమన్నారాయణుడు వ్యాపించి యున్నాడు అనే నమ్మకంతో జీవించిన నిష్ఠాగరిష్ఠుడు. ఏ ఇతర ప్రాణికీ చీమకైననూ హాని తలపెట్టని అజాతశత్రువు. వైష్ణవ తత్త్వమును కొంగ, కోడి, ఉప్పుతో పోల్చిన తత్త్వజ్ఞాని. కొంగ ఎట్లైతే తనకు ప్రశాంతముగా ఉండే సరస్సుని చూసుకుని నివసించునో, వైష్ణవుడు కూడా తనకు మనశ్శాంతినిచ్చే భగవంతుని సన్నిధిలోనే నివాసమేర్పరచుకొనవలెను. కొంగ ఎట్లైతే చిన్న చిన్న చేపలను ఆహారముగా పట్టుకొనక, ఒకే ఒక పెద్ద చేపను వెతికి పట్టుకుని దాన్నే ఆహారముగా స్వీకరించునో, భాగవతోత్తముడైన గురువునే ఆశ్రయించి వారి నుంచి మంచి జ్ఞానాన్ని స్వీకరించవలెను. కోడి ఎట్లైతే ఇసుక రేణువులను గెలికి గెలికి తనకు కావలసిన పోషకాహార పదార్థాలను తాను తిని తన పిల్లలకు పెట్టునో వైష్ణవుడు కూడా వేదశాస్త్రాలను ఔపోసన పట్టి, వాటి సారమును తన శిష్యులకు, తరువాతి తరము వారికి అందించవలెను. ఉప్పు ఎట్లైతే దాని గాఢతను బట్టి పదార్థముల రుచిని మార్చునో, సరిసమానముగా ఉన్నప్పుడే పదార్థమును రుచింపజేయునో, అటులనే వైష్ణవుడు కూడా ఏదీ ఎక్కువా తక్కువా ఆశించక, దేనికి పొంగిపోక, క్రుంగిపోక జీవితమును సాగించవలెను.

**అనంతాళ్వారు రచించిన వాటిలో**

1. **శ్రీవేంకటాచలేతిహాసమాల**
2. **శ్రీ గోదా చతుఃశ్లోకి**
3. **మధురకవి దివ్యసూరి ప్రబంధము**
4. **శ్రీ రామానుజ చతుః శ్లోకి ముఖ్యమైనవి.**

వీరి 26వ తరము వారైన శ్రీమాన్ తిరుమలై ఆనందాన్ పిళ్ళై పురిశై రంగాచార్యుల పుణ్యదంపతులు ఇప్పటికీ అనంతాళ్వారు తోటలోని తిరుమాళిగలో నివసించి శ్రీహరిని తమ ఇంటి అల్లుడిగా భావించి, నిత్య కైంకర్యములు చేయుచున్నారు. వారి నిస్వార్థ జీవనశైలి సాగిస్తూ ఏ లోటూ లేకుండా జరిపే కార్యక్రమములకు, సేవా తత్పరతకు అనేకానేక దండ ప్రణామాలు సమర్పించినా తక్కువే. వారిని సేవించే అదృష్టం శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహం మాకు కూడా కలిగినందులకు ధన్యులము.



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

## కళ్యాణ గుణాలు

వానరశ్రేష్ఠుడు హనుమంతుడు. రామకథ చెప్పాడు. వినింది వైదేహి. మధురంగా పలుకుతోందామె. ''రామునితో నీకెలా పరిచయం కలిగింది? లక్ష్మణుడెలా తెల్సు? నర వానరుల సంగమం ఎలా జరిగింది? రాముని శరీర చిహ్నాలేవి? లక్ష్మణుని చిహ్నాలేవి? రామలక్ష్మణుల అవయవాలు ఎలా ఉంటాయి? వారి ఆకారాలెలా ఉంటాయి? తొడలు, చేతులు ఎలా ఉంటాయి? వివరంగా చెప్పు.

ఇతడు నిజంగా రామలక్ష్మణులను చూశాడా? తన ప్రశ్నలకు జవాబు చెబితే – తనకి నచ్చితే – అప్పుడు ఇతణ్ణి నమ్మవచ్చు అనుకుంది జానకి. ఇక్కడ ఓ విషయం గమనించాలి. వాల్మీకి మహర్షికి రాముడంటే ఇష్టం. ఆతని కళ్యాణ గుణాలు వర్ణించటం ఇష్టం. అవకాశం లభించినప్పుడల్లా రాముణ్ణి వర్ణిస్తాడు. కీర్తిస్తాడు. రామ కళ్యాణ గుణాల్ని మనమూ స్మరించాలని, కీర్తించాలని హెచ్చరిస్తున్నాడు వాల్మీకి.

సీతాదేవి ప్రశ్నలు విన్నాడు. అంటున్నాడు వాయుపుత్రుడు హనుమంతుడు. ''అన్నదమ్ముల రూప సౌందర్యాలు నీకు తెల్సు. అయినా నన్ను అడుగుతున్నావు. అది నా భాగ్యం.

రామః కమల పత్రాక్షః సర్వ సత్త్వ మనోహరః ।
రూపదాక్షిణ్య సంపన్నః ప్రసూతో జనకాత్మజ ॥

జనకరాజపుత్రీ! రాముడు కమల పత్రాల్లాంటి కన్నులు కలవాడు. సమస్త ప్రాణులకు ఆనందం కూర్చేవాడు. దయాది కళ్యాణ గుణాలు కలవాడు. అతనికి అవి పుట్టుకతో వచ్చాయి. అతడు తేజస్సులో సూర్యుని వంటివాడు. సహనంలో భూదేవి లాంటివాడు. బుద్ధిలో బృహస్పతి. కీర్తిలో దేవేంద్రుడు. సర్వప్రాణి సంరక్షకుడు. శరణాగతరక్షకుడు. చాతుర్వర్ణ ధర్మ రక్షకుడు. లోక మర్యాదని పాటించేవాడు. శత్రువుల్ని రూపు మాపేవాడు. కాంతిమంతుడు. సర్వలోక పూజ్యుడు. బ్రహ్మచర్య వ్రత నిష్ఠుడు. సాధువులకి ఉపకారం చేసేవాడు. లోకకళ్యాణం కోసం కర్మలాచరించేవాడు. కర్మల గతి తెలిసినవాడు. శీలవంతుడు. వినయవంతుడు. వేద వేదాంగ విశారదుడు. వేదపండితులతో పూజింపబడేవాడు. రాజనీతి కుశలుడు. బ్రాహ్మణులను ఆదరించేవాడు. సర్వవిద్యా పారంగతుడు. సదాచార సంపన్నుడు. శత్రు భయంకరుడు.

### రూపు రేఖలు

రాముడు విశాల భుజాలు కలవాడు. పొడవైన చేతులు

కలవాడు. శంఖం లాంటి కంఠం కలవాడు. అందమైన ముఖం కలవాడు. ఎర్రని కనులు కలవాడు. దుందుభి ధ్వనిలా గంభీరమైన స్వరం కలవాడు. నిగనిగలాడే దేహచ్ఛాయ కలవాడు. శ్యామల వర్ణుడు. లోకవిఖ్యాతుడు. ప్రతాపవంతుడు.

వక్షఃస్థలం, మణికట్టు, పిడికిలి – దృఢంగా ఉంటాయి. కనుబొమలు, బాహువులు, వృషణాలు పొడుగ్గా ఉంటాయి. కేశాగ్రాలు, వృషణాలు, మోకాళ్ళు సమంగా ఉంటాయి. ఉదరం, బొడ్డుభాగం, హృదయం ఎత్తుగా ఉంటాయి. కనుకొనలు, గోళ్ళు, అరిచేతులు, అరికాళ్ళు ఎర్రగా ఉంటాయి. పాదరేఖలు, కేశాలు, లింగం నునుపుగా ఉంటాయి. స్వరం, నడక, నాభి గంభీరంగా ఉంటాయి. కంఠానికి, కడుపుపై మూడు మడతలుంటాయి. తలమీద మూడు సుళ్ళుంటాయి. స్తనాలు, స్తనాగ్రాలు, పాదరేఖలు లోతుగా ఉంటాయి. నరాలు లేని పాదాలు, రోమకూపాలు, మాంసం లేని పొత్తికడుపు దీర్ఘం కాని లింగం. పిరుదులు, పిక్కలు పొట్టివి. నుదురు అరికాళ్ళు అరచేతులు – వీటిపై నాల్గురేఖలుంటాయి. నాలుగు కిష్కువులు (నాలుగు మూరలు) 92 అంగుళాల ఎత్తు. అంటే రాముడు 8.6 అడుగుల ఎత్తుంటాడు. బాహువులు పిక్కలు తొడలు సమంగా ఉంటాయి. పళ్ళలో పైన కింద – రెండేసి కోరపళ్ళు వుంటాయి. తెల్లని పళ్ళు గట్టిగా వాడిగా సమంగా ఉంటాయి. కనుబొమలు, నేత్రాలు ముక్కుపుటాలు, చెవులు, పెదవులు, ముంజేతులు, స్తనాగ్రాలు, మణికట్లు, మోకాళ్ళు, వృషణాలు, పిరుదులు, చేతులు, పాదాలు, మడమలు ఈ పధ్నాలుగు సమంగా ఉంటాయి.

సింహం, శార్దూలం, ఏనుగు, వృషభం – నాలుగు జంతువుల నడకలాంటి నడక కలవాడు. చూపులు, దంతాలు, కేశాలు, పాదాలు స్నిగ్ధతగా ఉంటాయి. వెన్నెముక, చేతివేళ్ళు, కాలివేళ్ళు, చేతులు, ముక్కు, కనులు, చెవులు, లింగం – ఇవి ఎనిమిది పొడుగ్గా ఉంటాయి. దంతాలు, నేత్రాలు తెల్లగా ఉంటాయి. చంకలు, కడుపు వక్షఃస్థలం, ముక్కు, భుజాలు, నుదురు – ఈ ఆరు ఎత్తుగా ఉంటాయి. వేళ్ళ కణుపలు, వెంట్రుకలు, మీసం, దృష్టి – ఇవి సూక్ష్మంగా ఉంటాయి.

సత్యభాషి, ధర్మాచరణ నిరతుడు. ధనార్జనకై ధర్మమార్గం అవలంబించేవాడు. సపాత్ర దానం చేసేవాడు. దేశ కాలానుగుణంగా ప్రవర్తించేవాడు. అందరితో ప్రియంగా మాట్లాడేవాడు.

లక్ష్మణుడు ఇద్దరు తల్లుల (కౌసల్య, సుమిత్ర) ముద్దుల కొడుకు. అనురాగంలో రూపగుణాల్లో రాముని లాంటివాడు. సాటిలేని వీరుడు. రాముడు మేఘశ్యాముడు. లక్ష్మణుడు బంగారు వన్నెతో ఉంటాడు.

వానరరాజు వాలి. అతని తమ్ముడు సుగ్రీవుడు. తమ్ముణ్ణి తరిమేశాడు. సుగ్రీవుని వెంట మేం ఉన్నాం. అందరం ఋష్యమూక పర్వతం మీద ఉండేవాళ్ళం. రామలక్ష్మణులు నిన్ను వెదుకుతున్నారు. నార బట్టలతో ఉన్నారు. మా వైపు వస్తున్నారు. సుగ్రీవుడు చూశాడు. వాలి పంపిన వారని భయపడ్డాడు. నేను వెళ్ళాను. వారి కథ తెలుసుకున్నాను. నా భుజాలపై వాళ్ళని మోశాను. సుగ్రీవుని వద్ద చేర్చాను. రామ సుగ్రీవులు స్నేహితులైనారు. నీవు పడేసిన నగల మూట ఉంది. అది చూపాం. చూశాడు రాముడు. బోరున ఏడ్చాడు. తెలివితప్పిపోయాడు. సుగ్రీవుడు ఓదార్చాడు. రాముడు వాలిని చంపాలి. సుగ్రీవుడు నిన్ను వెదకాలి. అవి వారి ప్రతిజ్ఞలు.

ఒక్క బాణంతో వాలిని చంపాడు రాముడు. సుగ్రీవుణ్ణి రాజుని చేశాడు. వానరసేనని పిలిచాడు. నీకోసం వెదకాలన్నారు. నెల రోజులు గడువు పెట్టారు. వేలాదిమంది నలుదిశలూ వెదికారు. వాలికొడుకు అంగదుడు. అతను మా నాయకుడు. దక్షిణానికి వచ్చాం. వెదుకుతూ ఓ బిలంలో చిక్కుకున్నాం. సుగ్రీవుడు విధించిన గడువు ముగిసింది. సముద్ర తీరం చేరాం. ప్రాయోపవేశం చేయాలనుకున్నాడు. రామకథ చెప్పసాగాడు అంగదుడు. రావణునితో జటాయువు మరణం దాకా చెప్పాడు. జటాయువు అన్న సంపాతి. అతడు చెప్పాడు – నీవు లంకలో ఉన్నావని. నేను నూరు యోజనాల సముద్రం దాటాను. రాత్రి లంకలో ప్రవేశించాను. రావణుణ్ణి చూశాను. నిన్ను చూశాను. అమ్మా! ఇదీ జరిగింది. నేను రామ దూతను. సుగ్రీవుని సచివుణ్ణి. రాముడు కుశలంగా ఉన్నాడు. లక్ష్మణుడూ కుశలమే. భయపడకు. నాతో మాట్లాడు తల్లీ.

వైదేహీ! మాల్యవంతం అనే ఒక పర్వతం. అక్కడ ఒక వానరుడు. పేరు కేసరి. శంబసాదుడనేవాడు రాక్షసుడు. వాడు మహా ఉపద్రవకారుడు. మహర్షులు ప్రార్థించారు. వాణ్ణి చంపాడు కేసరి. ఆ కేసరి భార్య అంజనాదేవి. వాయుదేవుని అనుగ్రహంతో ఆమెకు పుట్టాను నేను. నా పనులను చూశారు. హనుమంతుడన్నారు నన్ను.

అమ్మా నీవు కోరావు. రాముని కళ్యాణ గుణాలు చెప్పాను. రూపురేఖలు చెప్పాను. నీకు నమ్మకం కల్గాలి. అందుకే ఇంత వివరంగా చెప్పాను. త్వరలో రామలక్ష్మణులు వస్తారు. రాముడు నిన్ను తీసుకెళ్తాడు అని చెప్పాడు. ఆగిపోయాడు వాయుపుత్రుడు. మరేం మాట్లాడలేదు.

వినింది వైదేహి. అమితానందం పొందింది. ఆనందాశ్రువులు స్రవించాయి. రాహువు నుంచి విముక్తి పొందిన చంద్రునిలా భాసించింది. కపీశ్వరుణ్ణి చూసింది. రామదూతగా నమ్మింది.

## అంగుళీయకం

మైథిలికి ఇంకా నమ్మకం కల్గించాలి. ఆ విశ్వాసం దృఢతరం కావాలి. అంటే ఆనవాలు చూపాలి. అది హనుమంతుని ఆలోచన.

**వానరోహం మహాభాగే దూతో రామస్య ధీమతః ।**
**రామనామా కింతం చేదం పశ్య దేవ్యంగులీయకమ్ ॥**

మహాభాగ్యశాలినీ! దేవీ! నేను వానరుణ్ణి. ధీమంతుడైన రాముని దూతను. ఈ ఉంగరం చూడు. ఇది రామ నామాంకితమై ఉంది.

"ప్రత్యయార్థం తనానీతం తేన దత్తం మహాత్మనా" – నీవు నమ్మాలి నన్ను. అందుకే మహాత్ముడు రాముడు దీన్ని ఇచ్చాడు. నేను తెచ్చాను. ఊరడిల్లు. ఇక నీ దుఃఖాలన్నీ సమసిపోతాయి. నీకు మంగళమగుగాక్ అన్నాడు. ఉంగరం ఇచ్చాడు.

సుందరకాండ పారాయణం చేస్తూ ఉంటారు. వారికి ఈ విషయం తెలిసి ఉంటుంది. తెలియని వారికోసం – సుందరకాండ 36 సర్గ 2 శ్లోకం. పారాయణానికి ముందు పఠించాలి. సీతా రామ లక్ష్మణ హనుమత్ సమేతమైన విగ్రహాలకి కాని, ఫొటోకి కాని అర్ఘ్యం అర్పించాలి. పాద్యం అర్పించాలి. తర్వాత హారతి ఇవ్వాలి. పారాయణం ప్రారంభించాలి. ఇది ఆచారం. పెద్దలు చెప్పారు.

అందుకుంది ఉంగరం. చూసింది. 'భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితా భవేత్' – భర్తను పొందినంతగా సంతోషించింది జానకి. ఆ విశాలాక్షి కన్నుల్లో వెలుగు నిండింది. అది భర్త సందేశమనుకుంది. పులకిత గాత్ర యైంది. మహాకపిని మెచ్చుకుంది. ప్రియవచనాలతో సమ్మానించింది హనుమంతుణ్ణి.

వానరోత్తమా! నీవు పరాక్రమశాలివి. సమర్థుడవు. ప్రాజ్ఞుడవు. నూరు యోజనాల సముద్రం ఆవు పాదమనుకున్నాం. అవలీలగా



దాటావు. నీది ప్రశంసించతగ్గ పరాక్రమం. నీవు సామాన్య వానరుడవు కావు. నీకు రావణుడంటే భయం లేదు. తొట్రుపాటు లేదు. నాతో మాట్లాడే యోగ్యుడవు. దూతగా నిన్ను పరీక్షించి వుంటాడు రాముడు. అందుకే పంపాడు నిన్ను. విశేషించి నా దగ్గరికి పంపాడు. రామ లక్ష్మణులు క్షేమంగా ఉన్నారు. అది నా అదృష్టం.

## ప్రశ్న పరంపరలు

రామునికి కోపం వస్తే ప్రళయాగ్నిలా విజృంభిస్తాడు. సముద్ర పర్యంతమైన ఈ భూమిని దహించేస్తాడు. అలాంటి వాడెందుకు ఊరుకున్నాడు? రాముడు నాకోసం దుఃఖించడం లేదా? నన్ను తీసుకెళ్ళాలనుకోలేదా? ఆ ప్రయత్నాలేవీ చేయడంలేదా? దీనుడుగా ఉన్నాడా? సంభ్రాంత చిత్తుడై ఉన్నాడా? దుఃఖంలో తన్ను తాను మైమరచాడా? పురుష ప్రయత్నం చేస్తున్నాడా? సామ దాన భేద దండోపాయాల్లో ఏది చేయాలనుకున్నాడు? స్నేహితుల్ని సంపాదించుకోలేదా? సంపాదించి వుంటే ఆ మిత్రులు మంచివాళ్ళేనా? దైవ ప్రార్థనలు చేయడం లేదా? దైవానుగ్రహం కోసం ప్రయత్నించడం లేదా? ఎంతో దూరదేశంలో ఉన్నాను. నామీద ప్రేమతోనే ఉన్నాడా? నా దుఃఖాన్ని పోగొట్టడా? ఏమీ చేయక దుఃఖిస్తున్నాడా? కృశించిపోయాడా? కౌసల్యా సుమిత్రల క్షేమం తెలుసుకుంటున్నాడా? భరత శత్రుఘ్నుల క్షేమ సమాచారం అందుతోందా? ఇంతకూ నన్ను కడతేర్చ రాడా? భరతుడు రామభక్తుడు. అక్షౌహిణీ సేనల్ని ఇక్కడికి పంపడా? రాక్షసుల నుంచి నన్ను కాపాడగలడా? వానరసేనతో సుగ్రీవుడు వస్తాడా? లక్ష్మణుడు శరపరంపరలు కురిపించడా? సబాంధవంగా రావణుడు నిహతుడు కావాలి. అది నేను చూడగలనా? ధర్మార్థం అరణ్యవాసం అనుకున్నాడు. అపుడు దుఃఖించలేదు రాముడు. బాధ పడలేదు, భయపడలేదు. నేను దూరమైనాను. ఇప్పటికీ ఆ మనోధైర్యంతో ఉంటున్నాడా? రామునికి నా మీద ప్రేమ అపారం. ఆ ప్రేమ తల్లి మీద లేదు. తండ్రి మీద లేదు. ఎవ్వరి మీద లేదు. రాముడు నా ప్రాణ ప్రియుడు. అతని సంగతి తెలియాలి. అంతవరకు బతికి వుండాలి నేను అంటూ ఆగిందామె. హనుమంతుడేం చెబుతాడో వినాలని ఉంది.

విన్నాడు భీమ విక్రముడు వాయుపుత్రుడు. చేతులు జోడించాడు. తలపై ఉంచాడు. అంటున్నాడు "కమల లోచనా! అనుహ్లాదుడు (హిరణ్యకశిపుని కొడుకు) శచీదేవిని అపహరించాడు. ఆమె ఎక్కడున్నది తెలియదు ఇంద్రునికి. తర్వాత తెల్సుకున్నాడు. ఆమెను తెచ్చుకున్నాడు. నీవు లంకలో ఉన్నట్లు తెలియదు రామునికి. ఇపుడు తెలుసుకున్నాను. నిన్ను చూశాను. వెనక్కి వెళతాను. నేను చెబుతాను. వెంటనే వస్తాడు రాఘవుడు. అతని వెంట వానర భల్లూక సేనలు

వస్తాయి. సముద్రాన్ని చూస్తాడు రాముడు. దాన్ని బాణాలతో స్తంభింపచేస్తాడు. లంకకు వస్తాడు. రాక్షసుల్ని భస్మం చేస్తాడు. ఆ సమయంలో సురాసురలైనా, యముడైనా అడ్డగిస్తే చంపేస్తాడు రాముడు.

అమ్మా! నీవు కనపడలేదు. శోకాకులునైనాడు రాముడు. సింహంతో పీడింపబడ్డ ఏనుగులా ఉన్నాడు. అస్సలు మనశ్శాంతి లేదు. కందమూల ఫలాలు మా ప్రాణాల్ని నిలుపుతాయా? వాటిపై ఒట్టేసి చెపుతున్నాను. రాముడు త్వరలో వస్తాడు. నీవు రాముణ్ణి దర్శించగలవు. ఇది ముమ్మాటికీ నిజం.

దేవీ! రాముడెలా ఉన్నాడో తెలుసా? మద్యం లేదు. మాంసం లేదు. వానప్రస్థునిలా ఉన్నాడు. వన్యఫలాలు, కందమూలాలు తెస్తే – వాటిని ఐదు భాగాలు చేస్తాడు. ఒక భాగమే తింటాడు. అది శరీర ధారణ కోసమే. మనసంతా నీవే. తనమీద ఈగలు వాలుతాయి, దోమలు వాలుతాయి, పురుగులు తిరుగుతాయి, పాములు పారాడుతాయి, పట్టించుకోడు. నిద్ర లేదు. ఎప్పుడైనా కునుకు పడితే – సీతా! సీతా! అని పలవరిస్తాడు. ఉలిక్కిపడతాడు. లేస్తాడు.

మధుర ఫలాల్ని చూస్తాడు. పుష్పాల్ని చూస్తాడు. అందమైన వస్తువుల్ని చూస్తాడు. ప్రియా అంటాడు. నిట్టూరుస్తాడు. అహర్నిశం నీకోసమే తపిస్తున్నాడు. కఠిన నియమాలు పాటిస్తున్నాడు. నిన్ను పొందాలని తపిస్తున్నాడు.

రామగుణ కీర్తనం వినింది వైదేహి. ఆమె శోకం మటుమాయమైంది. శరత్కాల వెన్నెలలా ఆమె ముఖం శోభిల్లింది.

వానప్రస్థులు కందమూలాలు, ఫలాలు తెస్తారు. ఐదు భాగాలు చేస్తారు. ఒకటి దేవతలకు, రెండవది పితృదేవతలకు, మూడవది అతిథులకు, నాలుగవది భూత తృప్తి కోసం సమర్పిస్తారు. మిగిలింది స్వీకరిస్తారు.

మనలో మాట – సర్వమూ త్యజించాడు రాముడు. అరణ్యవాసానికి బయల్దేరాడు. ఉంగరం హనుమంతునకిచ్చాడు. ఆనవాలుగా సీతమ్మకివ్వమన్నాడు. ఆ ఉంగరం రామునికెలా వచ్చింది? వాల్మీకి మహర్షి ఎక్కడా చెప్పలేదు. ఎందరో తమ అభిప్రాయాలు చెప్పారు. అందులో ఒకటి నిజం కావచ్చు. నిర్ణయం పాఠకులదే.

1. దశరథుడు ఇచ్చాడు 'రామ' అన్న అక్షరాలున్న ఉంగరం. అయితే అది రాజముద్ర కాదు. కారణం అప్పటికి రాముడు అయోధ్యాపతి కాలేదు.
2. పెండ్లి కానుకగా జనకమహారాజు రామునికి ఇచ్చాడు.
3. సంధ్యావందనం ఆచరించేటప్పుడు – పూర్వం వేలికి పవిత్రం పెట్టుకునేవారు. లేదా ఉంగరం పెట్టుకునేవారు. తన పేరుగల ఉంగరం రాముడు ధరించేవాడు. త్రికాలాల్లో కాకపోయినా – రెండు పూటలా సంధ్య వార్చేవాడు.
4. అరణ్యవాసంలో పంచవటిలో ఉన్నారు సీతారామలక్ష్మణులు. సీతారాములు సరదాగా ఆడుతున్నారు. సీతమ్మ తన ఉంగరం తీసింది. పణంగా పెట్టింది. రాముడు గెలిచాడు. ఉంగరం రాముడు తీసుకున్నాడు. అది జనకుడు చేయించాడు. భర్త పేరున్న ఉంగరం భార్య ధరిస్తే శుభమనుకున్నాడాయన. అంటే పెండ్లి సమయంలో జనకుడు సీతమ్మకు ఇచ్చాడు.

ఆటలో సీతమ్మ ఓడింది. అంతలో మాయలేడి రావడం – రాముడు దానికోసం పోవడం – సీతాపహరణం జరగడంతో – ఉంగరం రాముని వద్ద ఉండిపోయింది. అంటే భర్త రక్షణ కోల్పోయింది వైదేహి. బంధితురాలైంది. మళ్ళీ హనుమంతుని ద్వారా ఉంగరం వచ్చింది. భర్త వచ్చాడు. విముక్తిని కలిగించాడు జానకికి.

ఉంగరం విషయం మహర్షి స్పష్టంగా చెప్పలేదు. అందుకే వివిధ వ్యాఖ్యలు వచ్చాయి. మళ్ళీ మనలో మాట – మొదట్లోనే హనుమంతుడు ఉంగరం ఇచ్చి ఉండొచ్చు కదా. అపుడు సీతమ్మలో భయాలు, సందేహాలు ఉండేవి కావు. చెట్టుపై నుంచి ఉంగరం కింద పడేశాడు హనుమంతుడు. అది రామచరిత మానస్ లో తులసీదాస్ – అలా రచించాడు. కాని మొదట ఉంగరం ఇవ్వలేదు అని మన పెద్దలు చెప్పారు.

సీతమ్మ – జీవుడు. లంక – శరీరం. దశ ఇంద్రియాలు – దశ కంఠుడు (రావణుడు). హనుమంతుడు – ఆచార్యుడు. నిరంతర రామ ధ్యానంలో ఉంది సీతమ్మ. కించిత్ భగవదనుగ్రహం కలిగింది. భగవంతుడు తన దూతగా ఆచార్యుని పంపాడు. వెదుక్కుంటూ వచ్చాడతడు. భగవత్ కథలు వినిపించాడు. భగవత్ కళ్యాణ గుణాలు కీర్తించాడు. భగవంతుని రూపురేఖలు వర్ణించాడు. జీవస్వరూప జ్ఞానం – భగవత్ స్వరూప జ్ఞానం తెలియ చెప్పాడు. భగవంతుడే రక్షకుడు. అలా విశ్వాసం కల్గించాడు. అపుడు అంగుళీయకమిచ్చాడు. అది రామ నామాంకితం. అందులో రాముని దివ్య మంగళ రూపాన్ని దర్శించింది వైదేహి. ఆనందభరితురాలైంది. ఉంగరం – మంత్రోపదేశానికి ప్రతీక. ఏ మంత్రమది? రామ తారక మంత్రం – అష్టాక్షరీ మంత్రం – ఓం నమో నారాయణాయ. అందుకే ఆమె ఆనందం పొందింది.

అంగుళీయకాన్ని కర విభూషణం అన్నాడు వాల్మీకి. భగవంతుని కరం (చేతులు) చేసే కార్యాలేమిటి? దుష్టశిక్షణ, శిష్టరక్షణ. జగద్రక్షణ. అది చేయగలవాడు నారాయణుడే. వాడే సృష్టికర్త. స్థితికర్త. లయకర్త. ఆ నారాయణుడే నరునిగా అవతరించాడు. అతడే రాముడు. ఆచార్యుడు ఏం చేశాడు? జీవునికి భగవంతుడే రక్షకుడని స్ఫురింపచేశాడు. అదే రామ నామాంకితమైన కరవిభూషణం.

**(సశేషం)**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 350. ద్వారకాధిపాయ నమః

ద్వారకా నగరమునకు అధిపతి కృష్ణుడు.

ద్వారకానగరమునకు అధిపతియైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 351. మణ్యాహర్త్రే నమః

– శమంతకమణి సూర్యునిచే సత్రాజిత్తునకు (ఇతడు వృష్ణి వంశస్థుడగు నిమ్నుని కొడుకు. సత్యభామ తండ్రి) ఈయబడిన మణి. ఇది ప్రతిదినము ఎనిమిది బారువుల సువర్ణమును ఒసంగును. ఒకనాడు సత్రాజిత్తు యొక్క తమ్ముడగు ప్రసేనుడు ఈ మణిహారమును కంఠమున ధరించి అడవికి వెళ్ళినాడు. అడవిలో ఒక సింహము ప్రసేనుని చంపి ఆ మణిహారమును తీసుకొని పోవుచుండగా అది చూచిన జాంబవంతుడు ఆ సింహమును చంపి దానివద్ద ఉన్న శమంతకమణి హారమును కొనిపోయి తన కుమార్తె యగు జాంబవతి యొక్క ఉయ్యాలకు వ్రేలాడకట్టెను. ఆ మణికాంతులచే జాంబవంతుడు నివసించి యున్న కొండ గుహ దేదీప్యముగ వెలుగుచుండెను.

ప్రసేనుడు శమంతకమణిహారముతో అడవికి వెళ్ళకముందు సత్రాజిత్తును కృష్ణుడు శమంతకమణిని తనకు ఇమ్ము అని అడిగి యున్నందున శమంతకమణి కొరకు కృష్ణుడే ప్రసేనుని చంపెను అని ఒక అపవాదము కలిగింది. అంతట కృష్ణుడు ఆ నిందను పోగొట్టుకొనుటకై ప్రసేనుని చంపిన సింహము యొక్క జాంబవంతుని యొక్క జాడలు గుర్తించి, జాంబవంతుని గుహలో ప్రవేశించి మణిని చూచినాడు. ఈ సందర్భమున కృష్ణుడు జాంబవంతునితో ఇరువది ఎనిమిది దినములు పోరాడి, జాంబవంతుని జయించినాడు. ఆ పోరాటములో బలహీనుడైన జాంబవంతునికి పూర్వస్మృతి కలిగి లోక రక్షణార్థము త్రేతాయుగమున అవతరించిన శ్రీరాముడు ద్వాపరయుగమున కృష్ణుడుగా వెలసెనని గ్రహించినాడు. అంత కృష్ణుడు తన చేతితో జాంబవంతుని వెన్ను తట్టెను. అంత జాంబవంతుని అలసట అంతయు తొలగి స్వస్థుడయ్యెను. అప్పుడు కృష్ణుడు జాంబవంతునితో జాంబవంతా! ఈ శ్యమంతకమణిని నేను అపహరించినట్లు అజ్ఞానులు నాపై నింద మోపినారు. ఆ మిథ్యా అపవాదమును తొలగించుకొనుటకై శ్యమంతకమణి కొరకై నేను నీ గుహలో ప్రవేశించితిని అని చెప్పినాడు.

అంత జాంబవంతుడు ఆ మణినే గాక దానితోపాటు తన పుత్రికామణి యగు జాంబవతిని కూడా కృష్ణునకు కానుకగా సంతోషముతో సమర్పించి కృతార్థుడయ్యెను. అంతట కృష్ణుడు జాంబవంతునికి వీడ్కోలు చెప్పి శ్యమంతకమణి హారమును కంఠమున ధరించి జాంబవతితో కూడ ద్వారకా నగరమునకు వచ్చెను. ద్వారకా వాసులందరూ కృష్ణుని రాకకు పరమానందమును పొందినారు.

అనంతరము కృష్ణుడు సత్రాజిత్తును ఉగ్రసేన మహారాజు యొక్క సభకు పిలిపించెను. శ్యమంతకమణి తనకు లభించిన తీరు తెన్నులను వివరించి, దానిని సత్రాజిత్తునకు ఇచ్చివేసెను. సత్రాజిత్తు మిగుల సిగ్గుపడుచు తల వంచుకొని కృష్ణుని నుండి మణిని గ్రహించినాడు. పిమ్మట సత్రాజిత్తు ఒక మహాపురుషునిపై అకారణముగా నింద మోపిన పాపమునకు ఎంతయు పశ్చాత్తాప పడుచు తన భవనమునకు వెళ్ళెను.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

సత్రాజిత్తు కృష్ణుని యెడ చేసిన అపరాధమునకు ప్రాయశ్చిత్తము ఆలోచించి తన కుమార్తె అయిన సత్యభామను, తన శ్యమంతకమణిని స్వయముగా తీసుకొనిపోయి కృష్ణునకు సంతోషముగా సమర్పించినాడు. సత్యభామ సౌందర్యవతి, సద్గుణములు కలది అగుటచే పెక్కుమంది రాజకుమారులు శతధన్వుడు, కృతవర్మ మున్నగువారు ఆమెను భార్యగా పొందుటకై సత్రాజిత్తును అర్థించి యున్నారు. అంతేగాక సత్రాజిత్తు సత్యభామను శతధన్వునికి ఇచ్చునట్లు వాగ్దానము చేసియుండెను. అట్టి సత్యభామను కృష్ణుడు విద్యుక్తముగా వివాహము చేసికొన్నాడు. పిమ్మట కృష్ణుడు సత్రాజిత్తుతో రాజా! నేను శ్యమంతకమణిని స్వీకరించుట లేదు. నీవు సూర్యభగవానుని భక్తుడవు. కావున దీనిని నీ యొద్దనే వుండనిమ్ము. దాని ఫలముగా లభించెడి బంగారమును మాత్రము ప్రజా సంక్షేమము కొరకు ఉగ్రసేన మహారాజుకు సమర్పించుమని చెప్పినాడు.

సత్యభామ వివాహ విషయమున మాట తప్పినందులకై శతధన్వుడు, అక్రూరుడు కృతవర్మలు ప్రేరేపించగా సత్యభామను ఇవ్వనందుకు కోపించి మణిపై లోభబుద్ధి గలవాడై సత్రాజిత్తు నిద్రించుచుండగా వధించి శ్యమంతకమణిని తీసుకొనిపోయినాడు. పిమ్మట సత్యభామ మీది ప్రేమచే కృష్ణుడు తనను చంపునని తలంచి భయపడి మణిని అక్రూరుని వద్ద దాచి తను గుర్రమును ఎక్కి మరలా నగరమునకు పోవుచుండెను. ఆ సంగతి తెలుసుకొని కృష్ణుడు శతధన్వుని వెంబడించి తరిమిపట్టుకొని చంపి, వాని వస్త్రములందు మణి కనిపించనందున తిరిగి వచ్చి ఆ వృత్తాంతమును సత్యభామకు చెప్పి మణి పోయిన పోబడిని విచారించుచుండెను.

ఆ విషయము తెలిసి అక్రూరుడు తన వద్ద శ్యమంతకమణి వుండుటచే ఏమీ కీడు కలుగునో అని తలచి ద్వారకను విడిచి దేశాంతరము పోయినాడు. అంతట ద్వారకలో ఉత్పాతములు కలిగినవి. అందుకు కారణము అక్రూరుడు నగరము విడిచిపోవుటయే అని తెలిసికొని కృష్ణుడు అతనిని వెదకి పిలుచుకొని వచ్చి గౌరవించి అక్రూరా! శతధన్వుడు శమంతకమణిని నీ వద్ద దాచి ఉంచినట్లు, అది నీ దగ్గర భద్రముగా యున్నట్లు నాకు తెలియును. సత్రాజిత్తు కుమార్తె సత్యభామ శ్యమంతకమణిని కల్గియుండుటకు అర్హురాలు అయినను ఆ మణిని నీ యొద్దనే ఉండనిమ్ము ఎందుకనగా నీవు పవిత్రాత్ముడవు. నిష్ఠా గరిష్ఠుడవు. అందువలన శ్యమంతకమణిని బయటికి తీసి కృష్ణునికి సమర్పించినాడు. కృష్ణుడు ఆ మణిని సత్యభామకు, జాంబవతికి, బలరామాదులకు ఒక పర్యాయము చూపించి, మణి విషయమున తన వారందరికీ గల అపోహలు తొలగించి, శ్యమంతకమణిని అక్రూరునికే ఇచ్చినాడు.

సత్రాజిత్తు నుండి శతధన్వుడు తీసికొని పోయిన శ్యమంతకమణిని తెచ్చి ఇచ్చిన వాడగు కృష్ణునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

హర్త = దొంగ. హరించువాడు. విద్య హర్తకు గాదు గోచరమని ప్రయోగము.

మణి + అహర్త = మణ్యాహర్త – యణాదేశము

సంస్కృత భాషలో నమః అని చెప్పినప్పుడు కర్త చతుర్థీ విభక్తిలో ఉండుట సంప్రదాయము. కనుక మణ్యాహర్త్రే నమః



# సరస్వతీ నదీ పుష్కరాలు

– చిల్లర సీతారామారావు

సమస్త జీవరాశుల మనుగడకు నీరు అత్యంత ఆవశ్యకము. నీరు పుష్టినిస్తుంది. బలాన్నిస్తుంది. ధాన్య సంపదలతో పాటు అనేకమైన ఐశ్వర్య సంపదలకు నీరే కారణం. సముద్రాలు, నదులు, చెరువులు, తటాకాలు, కొలనులు, బావులు మున్నగునవి నీటికి తావులు. బ్రహ్మదేవుడు నీటిలో పుట్టే కమలం నుంచి ఆవిర్భవించాడు. ఆ అనంత జలశక్తి, దేవతల అనుగ్రహంతో నదుల రూపంలో సమస్త జీవుల కోసం పృథ్విని చేరుతోంది. అన్ని ఋతువులందు ఎండిపోకుండా, నిండుగా జలాలతో ప్రవహించే నదులను జీవనదులు అని అంటారు. అవి గంగ, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, భీమరథి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, సింధు, ప్రణీత.

మానవులందరూ నదులలో, సముద్రములో స్నానము చేసి తమ పాపాలను, రోగాలను పోగొట్టుకోసాగారు. నదులకు ఆ పాపాలు వచ్చి చేరి అవి పాపభారంతో కుమిలిపోసాగాయి. నదుల అవస్థను గమనించిన తుందిలుడు అనే విప్రుడు పరమేశ్వరుని కోసం ఘోరమైన తపము గావించాడు. అతని తపమునకు ప్రసన్నుడైన పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరమును కోరుకొమ్మని అన్నాడు. పంచభూత తత్త్వాలలో ఒకటైన జలతత్త్వం తనకు ప్రసాదించమని అడిగాడు. పరమేశ్వరుడు తుందిలునకు ఆ వరమును ప్రసాదించాడు. ఆయన దయవల్ల మూడున్నర కోట్ల పుణ్యతీర్థాలకు రాజై 'పుష్కరుడు' అను పేరుతో ప్రసిద్ధికెక్కాడు. బ్రహ్మదేవునకు సృష్టికార్య నిమిత్తం జలం ఆవశ్యకమైంది. అతడు తన తపము చేత పరమేశ్వరుడిని మెప్పించి అన్ని కోర్కెలను తీర్చే పుష్కరుడిని సృష్టికార్య నిమిత్తం తనకిమ్మని ప్రార్థించాడు. 'తథాస్తు' అన్నాడు పరమేశ్వరుడు. బ్రహ్మ జలరూపములో ఉన్న పుష్కరుడిని తన కమండలములో పెట్టుకుని సృష్టి గావిస్తున్నాడు. ఇలా కొంతకాలం గడిచి పోయింది. దేవతల గురువు బృహస్పతి. ఆయన బ్రహ్మ గురించి తపమొనరించాడు. బ్రహ్మ అతని తపమునకు మెచ్చి ప్రత్యక్షమై వరము కోరుకొమ్మని అడిగాడు. దేవా! ప్రాణులను రక్షించే ధర్మము నాది. దాని కొరకు జలము ఆవశ్యకము. కనుక జీవనాధారుడైన పుష్కరుడిని నాకు ప్రసాదించండి అన్నాడు. బ్రహ్మ తథాస్తు అని పలికాడు. కాని పుష్కరుడు బ్రహ్మను విడిచి వెళ్ళడానికి అంగీకరించలేదు. బ్రహ్మ దీర్ఘంగా ఆలోచించి అందరికీ ఆమోదయోగ్యమైన ఒక నియమాన్ని ఏర్పాటు చేశాడు. దాని ప్రకారం బృహస్పతి ఏ రాశిలోకి ప్రవేశించినా మొదటి పన్నెండు రోజులు, చివరి పన్నెండు రోజులు, మిగిలిన రోజులలో మధ్యాహ్న సమయంలో నాలుగు ఘడియల కాలం పుష్కరుడు బృహస్పతిలో ఉండాలి. ఆ సమయములో బ్రహ్మ సమస్త దేవతా గణముతో పుష్కరుని చెంతనే ఉంటాడు. పుష్కరుడు నదులలో అంతర్వాహినిగా ఉండటాన్ని పుష్కరం అని అంటారు. పుష్కరం అంటే పన్నెండేళ్ళ కాలం, పర్వం అనే అర్థాలున్నాయి. 'పోష యతీతి పుష్కరం' అనగా అందరినీ పోషించేది పుష్కరం. భూలోకంలోని పన్నెండు జీవనదులకు, బృహస్పతి పన్నెండు రాశులలో ప్రవేశించినప్పుడు మాత్రమే పుష్కరాలు వస్తాయి. బృహస్పతి మేషరాశిలోనికి ప్రవేశించినప్పుడు గంగానదికి, వృషభరాశి లోనికి

ప్రవేశించినప్పుడు నర్మదానదికి, మిధునరాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీనదికి, కర్కాటకములో ప్రవేశించినప్పుడు యమునానదికి, సింహరాశిలో ప్రవేశించినప్పుడు గోదావరినదికి, కన్యరాశిలో ప్రవేశించినప్పుడు కృష్ణానదికి, తులరాశిలో ప్రవేశించినప్పుడు కావేరినదికి, వృశ్చికంలో ప్రవేశించినప్పుడు తామ్రపర్ణినదికి, ధనుస్సురాశిలో ప్రవేశించినప్పుడు బ్రహ్మపుత్రానదికి, మకరరాశిలో ప్రవేశించినప్పుడు తుంగభద్రానదికి, కుంభరాశిలో ప్రవేశించినప్పుడు సింధునదికి, మీనరాశిలో ప్రవేశించినప్పుడు ప్రణీతానదికి పుష్కరాలు వస్తాయి.

ప్రకృతిలోని పంచభూతాలలో ఒకటైన జలతత్త్వం కలిగి వున్న నదులలో స్నానం చేసినా, పిండాది దానధర్మాలు చేసినా సంపూర్ణ ఫలితం ప్రాప్తిస్తుంది. నీరు సదా పారుతూ ప్రవహిస్తూ ఉంటుంది. కనుక ఎన్నో ప్రాంతాల నుండి ఆయా ప్రాంతాల సారాన్ని, ఔషధీ మూలికలను తనలో కలుపుకొస్తుంది. పంచభూతాలలోని తక్కినవాటితో పూర్తి సహజీవనం సాగించి, వాటి ప్రత్యక్ష ప్రభావాన్ని తాను పోగొడుతుంది. ఈ కారణం వల్లనే నదీస్నానం సర్వరోగాలను నివారించడమే కాకుండా, చర్మగ్రంధులలోకి నీరు సరాసరి చేరడంతో అదొక చక్కటి వ్యాయామంగా కూడా అయి శరీరంలోని బాహ్యాంతర అలసత్వాన్ని పోగొట్టి, నూతనత్వాన్ని, ఉత్తేజాన్ని కలిగిస్తుంది. అంటే నదీస్నానం మనిషి శరీరానికి ఆరోగ్యాన్ని, ఉల్లాసాన్ని కల్గిస్తుంది. పుష్కరాల సమయంలో నదీస్నానం సర్వపాపహరణం. ప్రస్తుతం బృహస్పతి మిథునరాశిలోకి ప్రవేశిస్తున్నాడు కనుక సరస్వతీనదీ పుష్కరాలు ప్రారంభమవుతాయి.

సరస్వతీనదికి పుష్కరాలు మే మాసం 15వ తారీకు నుండి 26వ తారీకు వరకు జరుగుతాయి. ఈ పుష్కరాలు ఉత్తరాఖండ్ లోని బదరీనాథ్ కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న 'మానా' అను గ్రామంలో జరుగుతాయి. సరస్వతీనది భూగర్భంలో ప్రవహించి 'మానా' వద్ద కనిపిస్తుందని ప్రజల విశ్వాసం. భారతదేశములోని పుణ్యనదులలో సరస్వతీనది ఒకటి. ఈ నది ఉత్తమమైనది. బ్రహ్మ కొరకు ఉద్భవించింది. విజ్ఞుల సంతోషం కొరకు ఉద్భవించింది. పుణ్యమునకు పుణ్యమును ప్రసాదించునది సరస్వతీనది. సరస్వతి ధర్మఫలమున కరణి. జన్మాది దుఃఖముల వలన మనసు దిగులొందిన వారికి సర్వవిధముల చక్కని ఫలమిచ్చునది సరస్వతీనది. సరస్వతీనది జలము పవిత్రము. దోసెడు జలమును సేవించినవారు పరమపదము నొందెదరు. పుణ్యప్రదము, పాపహరము అయిన సరస్వతీనది యందు స్నానమాచరించుటకు ఎటువంటి నియమములు లేవు. తినిగాని, తినకుండా గాని, పగలు గాని, రాత్రి గాని సరస్వతీ తీర్థమునందు స్నానమాచరించవచ్చును. స్నానానంతరం విష్ణువును ఆరాధిస్తారు. పురాణాలు సరస్వతీ ప్రాశస్త్యాన్ని వర్ణించాయి. సరస్వతీనది నామస్మరణ మాత్రము చేతనే సమస్త పాపములు సమూలంగా నశించిపోతాయి. ఈ నది యందు స్నానము చేయుట వలననే చంద్రుడు రాజయక్ష్మ రోగాన్ని పోగొట్టుకున్నాడు. ఇంద్రుడు తన బ్రహ్మహత్యా పాతక దోషమును సరస్వతీనదీ స్నానము ద్వారానే పోగొట్టుకున్నాడు. విశ్వామిత్రుడు బ్రహ్మర్షి కావడానికి మూల కారణం సరస్వతీ నదియే. ఈ నదిని సేవించడం వలననే వరుణునికి జలాధిపత్యము, కుబేరునకు ధనాధిపత్యము వచ్చాయి. ఈ సరస్వతీ నదీ తీరముననే వేదములను విభజించాడని, భాగవతమును వ్యాసుడు రచించాడని పురాణాలు తెలియజేస్తున్నాయి.

సరస్వతీనది అత్యంత పురాతనమైనది. ఒకప్పుడు సరస్వతీనది పెద్ద నది. భౌగోళిక మార్పుల వలన ఈ నది అంతర్వాహినిగా ప్రవహిస్తున్నది. ఈ నది హిమాలయ పర్వతముల నుండి త్రివేణీ సంగమ స్థానం వరకు ప్రవహిస్తున్నదని పురాణోక్తి. తెలంగాణమున సరస్వతీనది పుష్కరాలు కాళేశ్వర క్షేత్రములో జరుగుతాయి.

**శ్లో ॥ "ప్లక్ష వృక్షాత్ సముద్భూతా పరిచ్ఛేష్ఠా సనాతనీ**
**సర్వపాప క్షయకారీ స్మరణాదేవ నిత్యశః"**

స్మరణ మాత్రము చేతనే సమస్త పాపములను నాశనమొందించు సరస్వతీనది ప్లక్ష వృక్షము నుండి ఉత్పన్నమైంది. తపోబల సంపన్నులైన మహాత్ములు సరస్వతీనదిని ఆవాహన గావించిన చోటికెల్లా ప్రవహించింది. సప్తాకారములను ధరించుట చేత సప్తసారస్వతము అని సరస్వతికి పేరు వచ్చింది.

**శ్లో ॥ "సుప్రభా కాంచనాక్షిచ విశాలాచ మానసహృదా**
**సరస్వత్యోఘ నామాచ సురేణు ర్విమలోదకా"**

సుప్రభ, కాంచనాక్షి, విశాలా, మానసహృదా, సరస్వతీ, ఓఘవతీ, విమలోదకా, సురేణు అనునవి సప్తసారస్వత నదులు. సరస్వతీనది బ్రహ్మ చేసిన యాగానికి సుప్రభ యను పేరుతో, నైమిశారణ్యములో మునులు చేసిన యాగానికి కాంచనాక్షి యను పేరుతో, గయుడు చేసిన యాగమునకు విశాల యను పేరుతో, ఉద్దాలకుడు చేసిన యాగమునకు మానసహృదా యను పేరుతో, వసిష్ఠుడు చేసిన యాగమునకు ఓఘమాల అను పేరుతో, బృహస్పతి చేసిన యాగమునకు సురేణు అను పేరుతో, బ్రహ్మ చేసిన యాగమునకు విమలోదక అను పేరుతో వచ్చి ఆ మునుల చేత నిరుపమానమైన గౌరవాన్ని పొందింది.

సరస్వతీనదికి సంబంధించిన కథలు పురాణాలలో పలు విధాలుగా వర్ణించబడ్డాయి. సరస్వతీదేవి నదిగా ప్రవహించుటకు సంబంధించి బ్రహ్మ వైవర్త పురాణమునందు ఒక కథ వర్ణితమయినది. లక్ష్మీదేవి, సరస్వతి, గంగ, విష్ణుమూర్తి ఒకచోట సమావేశమయ్యారు. ఆ సమావేశమునందు గంగ రెప్పవేయక విష్ణుమూర్తి వైపు చూడసాగింది. దానిని గమనించిన సరస్వతికి రోషము వచ్చి గంగను పరుష వాక్యములతో నిందించసాగింది.

గంగకు కోపం వచ్చి నాకు అనవసరంగా కోపం తెప్పించావు. కనుక నేను నీకు శాపమునిస్తున్నాను. నీవు నదివి కమ్ము అని శాపమునిచ్చింది. సరస్వతి కూడా గంగకు ప్రతిశాపము నిచ్చింది. గంగ ఉత్తరం దిక్కువైపు, సరస్వతి పశ్చిమ దిక్కుకు ప్రవహించడం మొదలుపెట్టాయి. బ్రహ్మాండ పురాణమున ఒక కథ ఇలా ఉంది. శివలింగమును చూచినానని బ్రహ్మ శివుడితో అబద్ధము చెప్పాడు. శివుడు ఆగ్రహంతో అతని వాక్కు అగు సరస్వతిని నదివి కమ్మని శపించాడు.

తన బ్రహ్మర్షిత్వానికి అడ్డుపడుతున్నాడని వసిష్ఠుడి మీద విశ్వామిత్రునికి అమితమైన ఆగ్రహం ఉంది. ఒకసారి సరస్వతిని స్మరించుకున్నాడు విశ్వామిత్రుడు. మహర్షి స్మరించగానే సరస్వతి అక్కడికి వచ్చింది. నీవు వేగముగా పోయి వసిష్ఠుడిని ఇక్కడికి తీసుకొని రమ్ము అని అదేశించాడు. నీవు వసిష్ఠుడిని తెచ్చిన వెంటనే అతడిని వధిస్తాను అని పలుకుతాడు. ఆ పలుకులు విని సరస్వతి బాధపడింది. అది గమనించిన విశ్వామిత్రుడు నీవు శీఘ్రముగా వెళ్ళి వసిష్ఠుడిని తీసుకొని రమ్మని గద్దించి పలికాడు. సరస్వతి భయపడి వేగంగా వసిష్ఠుడి దగ్గరకు వెళ్ళింది. విశ్వామిత్రుడు ఆయనను వధించడానికి తీసుకురమ్మన్నాడన్న వాస్తవాన్ని తెలియజేస్తుంది. ఆ మాట విని వసిష్ఠుడు నన్ను తొందరగా విశ్వామిత్రుడి దగ్గరకు తీసుకొనిపొమ్ము అని చెబుతాడు. ఆయన ఆనతిననుసరించి సరస్వతి వసిష్ఠుడిని విశ్వామిత్రుడి దగ్గరకు తీసుకుపోతుంది. వసిష్ఠుడిని చూచిన విశ్వామిత్రుడు ఆగ్రహంతో ఆయనను వధించడానికి కావలసిన ఉపకరణములను అన్వేషించసాగాడు. విశ్వామిత్రుడి ఆగ్రహానికి భయపడిన సరస్వతి వంచనకు పాల్పడింది. ఒక్కసారిగా ఉప్పొంగింది. ఉప్పొంగిన ఆ ప్రవాహంలో వసిష్ఠుడు కొట్టుకొనిపోయాడు. ఉపకరణములను తీసుకొని వసిష్ఠుని వైపు రాగా వసిష్ఠుడు కానరాలేదు. సరస్వతియే మోసం చేసినదని భావించి ఆమెను శోణితవు కమ్మని శపించాడు. ఆ శాప ఫలితముగా సరస్వతీనది శోణిత నదిగా మారిపోయింది. ఆ నదీ పరిసరాలలో భూతములు, పిశాచములు, రాక్షసులు ఆ నదిలోని శోణితమును అనగా రక్తమును త్రాగి ఆనందముగా జీవించసాగాయి. ఒక సంవత్సరకాలం గడిచిన తరువాత కొంతమంది మునులు సరస్వతినదిని చూచి, అలా మారడానికి గల కారణమును తెలుసుకున్నారు. వారు సమస్త పాపనాశిని అయిన అరుణానదిని తీసుకొని వచ్చి సరస్వతిలో కలిపారు. దానితో శోణితము పవిత్ర జలముగా మారిపోయింది.

దధీచి తనయుడు పిప్పలాదుడు. దేవతలు తన తండ్రిని మోసగించారన్న ఆగ్రహంతో బడబానలమును సృష్టించి దేవతల మీదకు వదిలాడు. ఆ బడబానలము రోజుకొక్క దేవతను మ్రింగసాగింది. దేవతలు భయభీతులై మహావిష్ణువును శరణు వేడారు. మహావిష్ణువు బడబానలము దగ్గరకు పోయి ఉపసంహరించుకొమ్మని అడుగుతాడు. సముద్రపు నీటితోనే తన దాహం తీరుతుందని జవాబు చెప్తుంది. అందరూ ఆలోచనల్లో పడిపోతారు. బడబానలమును సముద్రము లోనికి తీసుకొనిపోయేదెవరు? అని తర్జన భర్జనల అనంతరం సరస్వతిని ప్రార్థిస్తారు. నేను స్వతంత్రురాలను గాను. నా తండ్రి బ్రహ్మను అడగండి అని జవాబు చెబుతుంది. దేవతలు బ్రహ్మను కలుసుకుని ఆయనను ప్రార్థించారు. బ్రహ్మ సరస్వతిని బడబానలమును తీసుకుని వెళ్ళమని చెప్తాడు. సరస్వతి తన ఇష్టానుసారం దృశ్యా దృశ్య రూపములను ధరించవచ్చునన్న వరమును ప్రసాదిస్తాడు. సరస్వతి ప్లక్ష వృక్షములో దూరి అక్కడినుండి నదిగా మారి, బడబానలమును తీసుకొని అంతర్వాహినిగా బయలుదేరి సముద్రంలో నిమజ్జనం గావిస్తుంది. అయితే ఈ నది గురించి అనేక వాదప్రతివాదనలు ఉన్నాయి. సరస్వతీనది అంతరించిపోయిందని కొందరు వాదిస్తుండగా, హిమాలయాలలో పుట్టిన ఈ నది జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ నదులతో కలిసి పాకిస్తాన్ లో ప్రవహిస్తూ పశ్చిమ సముద్రములో కలిసేదని, ఆ ఏడు నదులు కలిసే ప్రదేశమే ఆర్యావర్తమని కొందరు వాదిస్తున్నారు. ఆర్యావర్తం నుండి అంతర్వాహినిగా వచ్చిన సరస్వతీనది త్రివేణీ సంగమమును చేరుకుంటుంది.

పుష్కర క్షేత్రమునకు చేరుకున్నవారు కొన్ని నియమములను పాటించాలి. స్నానమాచరించడం, నదిని పూజించడం, వ్రతమును ఆచరించడం, పితృదేవతలకు పిండప్రదానం చేయడం చాలా ముఖ్యమైనవి. పుష్కరములకు చేరుకున్నవారు ముందుగా నదికి నమస్కరించాలి. నదిలోనికి దిగి మూడు మునకలు నదిని స్మరించుకుంటూ వేయాలి. తర్వాత తూర్పుదిక్కుకు తిరిగి దేవతలకు అర్ఘ్యమివ్వాలి. స్నానానంతరం నదీమతల్లికి పూజలు చేయాలి.

స్నానము చేయుటకు సంకల్పించుకున్నవారు గమనించవలసిన విషయమేమిటంటే పుష్కరాదుల యందు ప్రాతఃకాల స్నానము చాలా ముఖ్యము. మధ్యాహ్న స్నానము మధ్యమము. అపరాహ్నమున స్నానము అధమము. తరువాత పితరులనుద్దేశించి హిరణ్యశ్రాద్ధము చేయవలెను. దానిలో వరిపిండి లేక గోధుమపిండితో నల్లనువ్వులు బెల్లం కలిపి పిండములు పెట్టాలి. షోడశ మహాదానములు చేయవచ్చును. మొదటిరోజు ధాన్యము, రెండవరోజు ఉప్పు, మూడవరోజున బెల్లము, నాలుగవ రోజు చక్కెర, అయిదవరోజు పండ్లు, ఆరవరోజున కర్పూరము, ఏడవరోజు పీట, ఎనిమిదవరోజు అల్లము, తొమ్మిదవరోజు పిండప్రదానములు, పదవరోజు పుస్తకం, పదకొండవరోజు తాంబూలం, పన్నెండవరోజు నువ్వులు, ఈవిధంగా పన్నెండు రోజులలో పన్నెండు దానములు చేయాలి.

ధారావాహికం

# శ్రీ కృష్ణ తత్వం



**- రాళ్ళబండి శ్రీనివాసన్**

**గత సంచిక తరువాయి**

పాండవులు రాజసూయయాగానంతరం ధర్మరాజు కృష్ణదేవునికి అగ్రపూజ చేసి–అతని పాదాలు కడిగాడు.దానిని చూసిన చైద్యుడు అంటే శిశుపాలుడు సహించలేకపోయాడు.

**అవనీనాథులనేకులుండగ విశిష్టారాధ్యులార్యులు మహీ**
**దివిజుల్ పూజ్యులు పల్వురుండగ ధరిత్రీనాథ గాంగేయు**
**దుర్వ్యవసాయంబున కృష్ణున్ కష్టచరితున్ వార్ష్ణేయు పూజించి**
**నీ అవివేకంబెరిగింతిందరకు దాశార్హుడు పూజార్హుడే?**

అపుడు సహదేవుడు లేచి ఆవేశంతో అంటున్నాడు ఈవిధంగా–కృష్ణునికి అర్ఘ్యాన్ని ఇచ్చినాం మేం. దానికి తిరుగులేదు. దుర్బుద్ధితో దీన్ని కాదనే వీరుల తలమీద ఇదుగో నా పాదంపెట్టి అణగదొక్కుతా.

అటు కృష్ణుని–ఇటు శిశుపాలుని వర్గాల వారు ఆయుధాలతో పోరాడటానికి సన్నద్ధులైనారు.కానీ కృష్ణభగవానుడు తన వారిని నివారించాడు. చక్రాన్ని చేతపట్టి– విడిచిపెట్టినాడు. ఇక అది శిశుపాలుని శిరస్సును తెంచేసింది. అది చూడగా భయభ్రాంతులకు లోనయ్యారు అందరూ.

విచారిస్తే యదువంశంలో వృష్ణివంశం ఒకటి. దాశార్హవంశం మరొకటి. కృష్ణుడు తక్కువ జాతికి చెందినవాడు అనేది శిశుపాలుని అభిప్రాయం.

కృష్ణ భగవానుడే అగ్ర పూజకు అర్హుడు అని భీష్ముడు చెప్పినప్పటికీ కొందరు మనస్సులలో తమ అసమ్మతిని అణచుకున్నారు. శిశుపాలుడు ఒక్కడే బయటపడ్డాడు.అయితే కృష్ణతత్వాన్నిఎరుగనివాళ్లకు శిశుపాలుడు ఆదర్శంగా నిలిచాడని భావించవచ్చు. అలాంటి వారిలో పౌండ్రకవాసుదేవుడు ఒకడు. ఇక పోతే జరాసంధ దుర్యోధనాదులు కూడా ఆ కోవలోని వారే. కృష్ణుడు రాజు కాకపోవడం కూడా పూజార్హుడు కాడని చైద్యుని వాదన.

ఏది ఏమైనప్పటికి రాజసూయయాగం ఇంకా మయసభ కురుక్షేత్ర సంగ్రామానికి ప్రధాన కారణం అని చెప్పక తప్పదు.

ఖాండవ వన దహన సమయంలో అగ్ని నుంచి రక్షించబడిన మయుని ప్రత్యుపకారమే మయసభ. దుష్టశిక్షణ శిష్ట రక్షణ కోసంగా కృష్ణ భగవానుని ప్రేరణతో మయసభ సంకల్పించబడింది.

రాజసూయ యాగం వలన ఏదో ఒక చిన్నదైన కారణంతో సర్వ క్షత్రియ వినాశకరమైన భయంకర యుద్ధం సంభవించవచ్చు. కనుక లోకశ్రేయస్సుని దృష్టిని వుంచు.

రాజసూయయాగానికి పూనుకుంటే– దిగ్విజయయాత్ర సాగించడంలో కొందరు రాజులతో శత్రుత్వం ఏర్పడవచ్చు.దాని మూలంగా యుద్ధం చెయ్యాల్సిందే. దాని వలన క్షత్రియనాశనం సంభవించక తప్పదు. అందుకే రాజసూయయాగాన్ని దాని అనర్థాలను తెలియచేసాడు నారదుడు.

అయితే రాజసూయయాగం అనేది సర్వ అనర్థాలకు కారణమని శ్రీరామాయణం ఉత్తరకాండలో భరతుడు చెబుతాడు. దానికి బదులు అశ్వమేధ యాగం చేయాలంటాడు.

కృష్ణ భగవానుని మీద వున్న అచంచలమైన విశ్వాసంతో ధర్మరాజు రాజసూయయాగానికి సిద్ధపడ్డాడని తెలుస్తోంది.

రాజసూయం–రాజ అసూయాలకు దారితీసిందని అనుకోవాలి. దుర్యోధనుని మాయా ద్యూత రచనలో ధర్మజుడు బలిపశువు అయ్యాడు. అయితే కృష్ణ భగవానుడు ద్యూతక్రీడా సమయానికి ఎక్కడ వున్నాడు? అతనికి కౌరవుల నుంచి ఆహ్వానం రాలేదా? మరి జూదం విషయంలో కృష్ణస్వామి ఉదాసీనతకు కారణం ఏమిటి?ఇక ఆ సమయంలో కృష్ణుడు ద్వారకలో లేకపోయినప్పటికీ ద్రౌపది శరణాగతికి ప్రతిస్పందించిన కృష్ణభగవానునికి జరుగుతున్నట్టి విషయాలన్నీ తెలుసు. పైగా అతని సంకల్పంతో అన్నీ సంభవిస్తున్నాయని విదితమవుతోంది.

సంస్కృత భారతంలో వనపర్వంలో కృష్ణుడే స్వయంగా

పాండవుల దగ్గరికి వెళ్లాడు. నేను ఆ జూద సమయంలో లేను. ఉండివున్నట్లయితే–మీకు ఇలాంటి అవమానాలు జరిగేవి కావు అంటూ చెబుతాడు. కృష్ణ తత్వాన్ని ప్రభావాన్ని తెలిసినవారు ఎవ్వరే గానీ ఆ స్వామి మాటలను నమ్మరు.

ద్రౌపదికి కృష్ణ తత్వమే కాదు అతని శక్తిసామర్థ్యాలు సంపూర్ణంగా తెలుసును. పాండవులు వనవాసంలో వున్నపుడు వారిని చూడాలని వచ్చిన కృష్ణభగవానునితో ద్రౌపది ఈవిధంగా అన్నది. కృష్ణా! సర్వదేవతలూ సర్వలోకపాలురూ ఈ విశ్వంలో వుంటున్న సమస్త లోకాలు గ్రహాలు నక్షత్రాలు ఇంకా దశదిశలూ విశాలమైన ఆకాశమూ సూర్యుడునూ చంద్రుడునూ సర్వస్వమూ నీలోనే వున్నాయని అనేకానేక విధములుగా కీర్తిస్తూ పాండవులు పడిన భంగపాట్లను కన్నులకు కట్టినట్లు మహా ఆక్రోశంతో వివరించి విలపించింది.

ద్రౌపదీ! నీవు ఎవరెవరి పట్ల క్రోధాన్ని దిగమింగి వున్నావో భవిష్యత్తులో ఇక వాళ్లందరూ అర్జునుని శరపరంపరలకు హతమైపోతారు. చచ్చిన తమ భర్తలను చూసి భార్యలు రోదిస్తారని ద్రౌపది క్రోధావేశానికి సమాధానంగా ఈవిధంగా ప్రతిజ్ఞ చేసాడు కృష్ణభగవానుడు.

**పతౌ ద్యౌః–హిమవాన్ శీర్యత్–పృథివీ శకలీ భవేత్ తోయనిధిః కృష్ణే! నమే మోఘం వచో భవేత్ ॥**

ఆకాశం జారిపడిపోవచ్చునుగాక– హిమవత్పర్వతం నుగ్గు కావచ్చు– భూమి ముక్కలైపోవచ్చునుగాక – సముద్రం ఇంకిపోవచ్చు కానీ ద్రౌపదీ! నా మాట పొల్లుపోదు.

దుర్యోధనుడు తన దగ్గరకు వచ్చిన దుర్వాసన మహర్షిని పాండవులకు హాని కలిగించాలనే నెపంతో వాళ్లని చూసి రమ్మని పంపాడు. ఆ సమయంలో అక్షయపాత్ర అందించిన పదార్థాలతో భోజనాలు ముగించినారు పాండవులు. శిష్య సమేతంగా విచ్చేసిన మహర్షికి ఆతిథ్యం ఇవ్వడం సమస్యగా మారింది. అపుడు ద్రౌపది స్మరించడంతో కృష్ణ భగవానునుడు రానే వచ్చాడు. ఖాళీదైన అక్షయపాత్రను చూపించమన్నాడు. చూడగా అందులో వున్న ఆకును తిన్నాడు. యజ్ఞ భోక్త భగవానుడు తృప్తి చెందాడు.

అపుడు అక్కడ నదిలో స్నానాలు చేసిన మహర్షికి శిష్యులకూ కడుపు నిండగా తేన్పడం మొదలుపెట్టారు.

ధర్మరాజు జూదంలో పరాజితుడవడం కర్మఫలంగా కృష్ణుణ్ణి మరచిపోయాడని అనుకున్నపుడు– సర్వజ్ఞుడైనటువంటి స్వామి – తనని స్మరించేటట్లు ధర్మజుని అనుగ్రహించవచ్చుకదా అని మనలో మాట.

కర్మఫలాన్ని అనుభవించి తీరాలని అన్నపుడు–తనవారు పెరవారు అనే భేదభావం భగవానునికి వుండదు.

మొట్టమొదట ద్రుపదుని పురోహితుని కౌరవుల కడకు రాయబారిగా పంపారు పాండవులు. అది నిష్ఫలమైంది. తర్వాత కౌరవుల తరఫున సంజయరాబారం–అది కూడా వ్యర్థమైంది. రాజ్యం ఇస్తామని కానీ– కౌరవపాండవులు కలిసిమెలిసి ఎలా వుండాలో కూడా స్పష్టత లేదు. చివరికి కృష్ణభగవానుడే పాండవుల తరఫున రాయబారానికి బయల్దేరాడు.

జననాథా! నీవు ఎరుంగని పనులు కలవే–అంటూ ప్రారంభించాడు కృష్ణుడు. అంటే నీవు తలచుకుంటే భరతవంశం నిలబెట్టగలవని ఆంతర్యం. సుయోధనుని అవగుణాలను– పాపకార్యాలను– నివారించగలవు. నీ కొడుకుని సక్రమమైన మార్గంలో పెట్టగలవు అంటూ చివరికి ఇలా అన్నాడు.

**సారపు ధర్మమున్ విమల సత్యము పాపముచేత బొంకుచే**
**పారము పొందలేక చెడబారినదైన అవస్థ దక్షులు**
**ఎవ్వారలుపేక్ష చేసిరది వారల చేటగుగాని ధర్మ**
**నిస్తాకమయ్యు సత్యశుభదాయకమయ్యు దైవముండెడున్**

అది కూడా వ్యర్థమైంది

మహారాజా!ఉత్తమమైన ధర్మం పాపంతో– నిర్మలమైన సత్యం అబద్ధంతో–దరిచేరలేక– చెడిపోవడానికి సంసిద్ధంగా వున్న స్థితిలో–వాటినీ రక్షించగల శక్తివుండి కూడా ఎవ్వరేగానీ అడ్డుపడకుండా– అశ్రద్ధ చేస్తారో–అది వారికే చేటవుతుంది.ఆ సమయంలో దేవుడు ధర్మాన్ని వుద్ధరించడానికి– సత్యాన్ని స్థాపించడానికి ముందుకు వస్తాడు.

మామా ధృతరాష్ట్ర మహారాజా! ధర్మం ఎల్లప్పుడూ సారవంతమైనదే. శక్తిమంతమైనదే.ఇకపోతే సత్యం కూడా ఎల్లప్పుడూ కల్మషం లేనిదే. స్వచ్ఛమైనదే. అవి రెండునూ స్వయం సంవృద్ధాలే. వాటిని నాశనం చేసేవి–పాపం–అసత్యం. సత్యధర్మాలు ఫలవంతమయ్యే సమయంలో–అడ్డుపడి చెరిచే ప్రయత్నాలు సాగిస్తాయి. అపుడే సత్యధర్మాలు చెడబారే పరిస్థితులు ఏర్పడుతాయి. అయితే అవి ఎప్పటికీ చెడిపోవు. ధర్మో రక్షతి రక్షితః అనే న్యాయానుసారంగా– ధర్మాత్ములూ సత్యశీలురూ వాటిని తమ తమ శక్తియుక్తులతో రక్షిస్తారు.

పాపాత్ములు అసత్యవాదులు ఇద్దరూ మనుషులే. సత్యధర్మాలను రక్షించేవారూ మనుషులే. అయితే దక్షులైనట్టివారు సత్యధర్మాలను రక్షించ లేనపుడు బెడిసికొడుతుంది. నాశనమైపోతారు.

కౌరవులు పాండవులు కలిసి వుంటే నీవు లోకేశ్వరత్వాన్ని తప్పక పొందగలవని ఎన్నో విధాలుగా యుద్ధం సంభవిస్తే కలగబోయే అనర్థాలను వివరించాడు కృష్ణభగవానుడు. అయితే యుద్ధమే సంభవిస్తే–పాండవులతో నీ కొడుకులు హతులైపోవడం ఖాయం. అందుచేత నీ కొడుకులను కాపాడుకో. ఈ లోకం క్షేమంగా వుండాలని కోరుకో. పాండవులకు ధర్మబద్ధంగా వారి తండ్రి నుంచి సంక్రమించినట్టి దానిని ఇచ్చేయాలని ముగించాడు. పాండవులు అటు నీ సేవకైనా సిద్ధమే. యుద్ధానికైనా సిద్ధమే యని సుస్పష్టం చెప్పేసాడు కృష్ణ భగవానుడు. **(సశేషం)**

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



తత్త్వం బ్రువాణాని పరం పరస్మాత్
మధు క్షరంతీవ సతాం ఫలాని ।
ప్రావర్తయ ప్రాఞ్జలి రస్మి జిహ్వే
నామాని నారాయణ గోచరాణి ॥

ఓ నాలుకా! పరాత్పరమైన తత్త్వమును తెలియజేసేది, సత్పురుషులు ఎవరి గురించి విన్నవిస్తే వారి మనస్సు మధువు స్రవించినట్లు ఆనంద తన్మయంలో స్రవిస్తుందో, మధుర ఫలముల కన్నా మధుర మైనటువంటి శ్రీమన్నారాయణుడి యొక్క నామములను పదే పదే స్మరిస్తూ ఉండుము. అలా ప్రవర్తించమని నీకు అంజలి ఘటిస్తున్నాను.

"పరస్మాత్" ఉత్తమమైనదాని కంటే "పరం" ఉత్తమమైన "తత్త్వం" సత్యమైన, నిత్యమైన దానిని "బ్రువాణాని" చెప్పుము అంటున్నారు కులశేఖరాళ్వార్లు.

మనము ఏదైతే గొప్పవి అని భ్రమించి ఆ లౌకికముల యందు పరిగెడుతున్నామో, ఆ కోర్కెలను కలిగించి నెరవేర్చినటువంటి బ్రహ్మ రుద్ర ఇంద్రాది దేవతలు కూడా ప్రకృతి మాయలో పడినటువంటి వారే. మరి ఈ బంధంలో లేనటువంటి తత్త్వం ఏది? ప్రకృతి బంధం ఎప్పుడు లేనటువంటిది అప్రాకృతమైన త్రిపాద్విభూతి అయినటువంటిది నిత్యముక్తాది గణములచేత నిరంతరం సేవించబడేది, సత్యమైనది, నిత్యమయినది, దేవతలు అసురులు కష్టపడగా వచ్చినటువంటి అమృతమైన ఇక చాలు అని తృప్తి కలుగుతుందేమో కానీ, ఎంత పానము చేసిన తృప్తిలేనటువంటిది (అతృప్త అమృతము) అటువంటి తత్త్వము 'శ్రీ' ని పతిగా కలిగినటువంటి పరమాత్మ శ్రీమన్నారాయణ తత్త్వము. అతడే పరతత్త్వం. ఆ తత్త్వం విశిష్టత ఏంటి? అంతటి మహాతత్త్వం మనకు ఉపకరిస్తుందా? అంటావేమో నాలుకా! వినుము.

పరతత్త్వం అంటే దీనిని మించిన తత్త్వం కానీ సమానమైనది కానీ లేదు. ఎంతటి పరత్వం ఉన్నదో! అంతటి సులభత్వం కూడా ఉన్నది కనుకనే పరమాత్మ తత్త్వం ఒక్క మాటలో చెప్పాలంటే "విలక్షణ తత్త్వం". అటువంటి శ్రీమన్నారాయణుడు కృతయుగంలో నృసింహుడై వేంచేసి కేవలం ఒకే ఒక్క భక్తుడి కోసం శ్రీవైకుంఠాన్ని విడిచి ప్రహ్లాదుడి యొక్క భక్తిని నిరూపించడం కోసం ఆవిర్భవించి అటు తనని ఆరాధించిన ప్రహ్లాదుడిని తనను ద్వేషించినా హిరణ్యకశ్యపుడిని కూడా కటాక్షించిన దయాళుడు పరమాత్మ. అలాగే త్రేతాయుగమున శ్రీరామచంద్రమూర్తిగా అవతరించాడు. రామచంద్రుడి గురించి వాల్మీకి మహర్షి పరమాత్మ కారుణ్యాన్ని అద్భుతంగా తెలియజేస్తారు,

"వ్యసనేషు మనుష్యానాం భృషం భవతి దుఃఖితః", ఎవడైనా తన పరిపాలనలో దుఃఖిస్తే ఆయన హృదయం కంపించిపోయేదట. నావారే వీళ్ళు, అయ్యో కష్టం కలగకుండా ముందే నేను ఉండి చూడాల్సిందే అని ఒక తల్లి తన పిల్లవాడి గురించి బెంగ పడేలా, అట్లా బాధ పడేవాడట. వారి శోకమే తన శోకమని భావించి ఆ శోకం తీరేదాకా తాను నిద్రపోకపోతే వాడిని దయాళువు అని అంటాం. అట్లా చరాచర జగత్తుకు ప్రభువు తాను కనుక తనని ఆశ్రయించినవాడు ఏడుస్తుంటే చూస్తూ ఊరుకోలేడట పరమాత్మ. అంతటి భక్త సులభుడు.

అలానే ద్వాపరంలో శ్రీకృష్ణపరమాత్మగా వచ్చి, అర్జునుడి

యొక్క రథానికి సారథ్యం వహించి నటువంటివాడు. తనకన్నా ఇంకా కిందకు దిగ గలిగినవాడు లేడు కనుక సౌలభ్యం, అర్జునుడికి కించిత్ భావం కలిగినందుకు తనయొక్క విశ్వరూపాన్ని చూపించి తనకన్నా మించినవాడు లేడు అని పరతత్త్వాన్ని బోధించాడు. కాబట్టి శ్రీమన్నారాయణుడే పరాత్పరుడు తానే సులభుడు కూడా పరస్పర విరుద్ధంగా ఉండే ఇలాంటి ఎన్నో పదాలు పరమాత్మ యందు నిరూపకములు వారి యొక్క విలక్షణములైన గుణములు. అటువంటి తత్త్వమైన పరమాత్మ యొక్క నామములను ఎల్లప్పుడూ స్మరిస్తే మనకు కలిగేదేంటి? అంటే పరమాత్మకు ఉన్నటువంటి నామములలో "తత్" కూడా ఒకటి.

విష్ణు సహస్రనామాల్లో "ఏకో నైక సవః కః కిమ్ యత్ తత్" – తత్ అంటే జ్ఞానాన్ని వృద్ధి చేయువాడు. పరమాత్మ యొక్క నామోచ్చారణ వల్ల మనకుండేటువంటి జ్ఞానాన్ని విస్తరింప చేస్తాడు. మనకి జ్ఞానం ఉంది, కానీ అది కప్పబడి ఉంది. ఆ జ్ఞానాన్ని పైకి విస్తరించేట్టుగా చేస్తాడు. ఆ జ్ఞానాన్ని కూడా ఎలా ఇస్తాడు అంటే "ప్రీతిపూర్వకం దదామి బుద్ధియోగం తమ్ యేనమామ్ ఉపయాంతితే" చాలా సంతోషంతో ఇస్తాను అని తానే భగవద్గీత యందు చెప్పుకున్నాడు. సత్పురుషులు సదా ఆ మాధుర్యాన్ని సేవిస్తూ తరిస్తారు. అలా జ్ఞానోపార్జన కలిగితే తద్వారా తరించే అవకాశం ఏర్పడుతుంది.

అలా కులశేఖరాళ్వార్లు అద్భుతమైన శ్రీమన్నారాయణ మాధుర్యమును నాలుకకు రుచి చూపించి లొంగతీసుకుని తరించే ఉపాయమును సూచిస్తున్నారు. అదే బాటలో తరించిన వారు భక్త మీరాబాయి.

భక్తి సంప్రదాయానికి సంబంధించిన అగ్రశ్రేణి వ్యక్తుల్లో మీరాబాయి ఒకరు. ఆమె 15వ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ కృష్ణ భక్తురాలు. శ్రీకృష్ణుణ్ణి కీర్తిస్తూ ఆమె రచించి, గానం చేసిన భజనలు ఎన్నో ఉన్నాయి. రాజస్థానీ కలగలసిన ప్రజాభాషలో ఆమె శ్రీకృష్ణుడి గుణగణాలను కీర్తించారు.

శ్రీ మహావిష్ణువు యొక్క దశావతారాలలో ఎనిమిదో అవతారమే కృష్ణుడు. కృష్ణుడు ఇతర హిందూ దేవతలకన్నా ఎంతో భిన్నం. మిగతావారు తమ ప్రత్యేక లక్షణాలు, శక్తులతో ప్రసిద్ధులు కానీ కృష్ణుడు అనేక కళలున్న వాడు. మరి రాజపుత్ర రాణి అయినటువంటి మీరాబాయికి శ్రీ కృష్ణుడు అంటే ఎందుకు అంత ఇష్టం?

"మీరా" అని ప్రసిద్ధి చెందిన మిహిర, శ్రీకృష్ణుని గొప్ప భక్తురాలు మరియు 16వ శతాబ్దానికి చెందిన హిందూ కవయిత్రి. రాజస్థాన్‌లోని రాజపుత్ర కుటుంబంలో జన్మించిన ఆమెకు పుట్టినప్పుడు "మిహిర" అని పేరు పెట్టారు; కానీ ఆమె మీరా అనే పేరుతో కవితా ప్రపంచంలోకి ప్రవేశించి, ఆ పేరుతోనే ప్రజాదరణ పొందింది. ఆమె హిందూ సమాజంలో ఒక ప్రియమైన వ్యక్తి, భక్తి ఉద్యమ సంస్కృతిలో కూడా విస్తృతంగా ప్రసిద్ధి చెందింది.

మీరాబాయి 1498లో రాజస్థాన్‌లోని ఒక రాజ్‌పుత్ కుటుంబంలో జన్మించింది. ఆమె రతన్ సింగ్ మరియు వీర్ కుమారి దంపతుల కుమార్తె. మీరా తన చిన్నతనం నుండే గొప్ప శ్రీకృష్ణ భక్తురాలు. ఆమెకు కేవలం 4 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు, ఒకసారి సమీపంలో జరుగుతున్న వివాహ వేడుకను చూసి, తన తల్లిని తన వరుడు ఎవరు అని అడిగింది! ఆమె అమాయకమైన ప్రశ్న విని, ఆమె తల్లి నవ్వి కృష్ణుడి విగ్రహాన్ని చూపించింది. కానీ అది మీరా మనసులో నాటుకుపోయింది. ఆమె పెద్దయ్యాక కూడా, శ్రీ కృష్ణుడు తనను వివాహం చేసుకుంటాడని ఆమె నమ్మింది. ఆమె అందంగా మరియు ప్రశాంతమైన హృదయంతో ఉండేది.

ఆమె చిన్న పిల్లగా ఉన్నప్పుడు 'రాయ్ దాస్' అనే యోగి వారి ఇంటికి వచ్చాడు. చిన్నపిల్ల అయిన మీరాకు ఆయన ఓ శ్రీకృష్ణ విగ్రహం కానుకగా ఇచ్చాడు. అప్పటి నుంచి ఆమెకు ఆ విగ్రహమంటే పంచప్రాణాలు. మీరా ఆ విగ్రహాన్ని అలంకరించేది, పూజించేది. ఆ విగ్రహంతో ఆడుకునేది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఆ శ్రీకృష్ణ విగ్రహమే తోడుగా జీవితం గడిపేది. ఆమె దాన్ని కేవలం ఓ ప్రాణం లేని బొమ్మ అనుకోలేదు. సాక్షాత్తూ శ్రీకృష్ణుడే సజీవంగా ఆ విగ్రహం రూపంలో ఉన్నాడని భావించేది. ఆమె తల్లి ఆమె ఆధ్యాత్మిక భావనలకు మద్దతునిచ్చేది. కానీ ఆమె మీరా చిన్న వయసులో ఉండగానే చనిపోయారు.

మీరా వివాహం ఆమె చిన్న వయస్సులోనే చిత్తోడ్ రాణాసంగా పెద్దకొడుకు 'భోజ్‌రాజ్' యువరాజుతో సాంప్రదాయబద్ధంగా నిశ్చయించబడింది. కాని తనని తాను శ్రీ కృష్ణుని భార్యగా భావించుకునే మీరాకు ఈ వివాహం సంతోషం కలిగించలేదు. ఆమె కృష్ణుణ్ణి మాత్రమే నిజంగా పెళ్ళి చేసుకున్నానన్న భావనలో ఉండేది. ఆమె తనని తాను కృష్ణుడి ప్రేమలో పిచ్చిదైన గోపిక లలిత పునర్జన్మగా భావించేది.

భోజ్‌రాజ్ కుటుంబం వారు శక్తి ఆరాధకులు. దుర్గ, కాళి, చాముండి, పార్వతి మొదలైన రూపాల్లోని అమ్మవారిని వారు ఆరాధించే వారు. దాంతో, శ్రీకృష్ణుడి పట్ల మీరా భక్తి ఆమె భర్త కుటుంబంలోని వారికి మింగుడు పడలేదు. శ్రీకృష్ణుడి పట్ల ఆమెకున్న తీవ్రమైన భక్తిని అర్థంలేని ఆరాటంగా భావించారు.

1516లో మీరాకు ఇష్టం లేకుండా మేవాడ్ యువరాజు భోజ్‌రాజ్ తో వివాహం జరిగింది. 1518లో ఢిల్లీ సుల్తానేట్‌లో జరుగుతున్న హిందూ-ముస్లిం యుద్ధంలో గాయాలతో బయట పడిన మీరాబాయి భర్త భోజ్‌రాజ్ 1521లో జరిగిన యుద్ధంలో మరణించాడు. భారత ఉపఖండంలో మొఘల్

సామ్రాజ్యం స్థాపించిన బాబర్ కు చెందిన ఇస్లామిక్ సైన్యంతో జరిగిన యుద్ధంలో మీరాబాయి భర్త భోజ్‌రాజ్, తర్వాత కొన్ని సంవత్సరాలకు ఆమె తండ్రి, ఆమె బావ ఇద్దరూ చంపబడ్డారు.

మీరాబాయికి ప్రాపంచిక సుఖాలమీద విరక్తి కలిగింది. శ్రీకృష్ణునిపై విశ్వాసం, భక్తి స్థిరపడి పోయింది. తరచు దివ్యోన్మాదంతో తన్మయం పొందుతూండేది. దేవాలయంలో శ్రీకృష్ణుని దివ్య విగ్రహం ముందు కూర్చుని పాటలు కూర్చి పాడుతూండేది. ఈమెపాడే పాటలకు ముగ్ధులై అనేక మంది భక్తులు చేరేవారు.

ఇది ఇలా ఉండగా, రోజురోజుకూ మీరాలో భక్తి ఎక్కువ కాసాగింది. అంతకంతకూ సాధు సన్యాసులు, మహాత్ముల సన్నిధిలో ఆమె ఎక్కువ సేపు గడపడం మొదలుపెట్టింది. భోజ్‌రాజ్ తమ రాజమందిరానికి దగ్గరలో ఆమె కోసం ప్రత్యేకంగా ఓ ఆలయాన్ని నిర్మింప జేశాడు. దాంతో, శ్రీకృష్ణుణ్ణి పూజించడానికీ, ప్రార్థించడానికీ కావలసినంత స్వేచ్ఛ మీరాకు లభించింది. గుడిలో భగవంతుని గుణాలను సంకీర్తన చేస్తూ, భక్తి పారవశ్యంతో నర్తిస్తూ, సాధువుల, సన్నిధిలోనే ఆమె రోజంతా గడిపేది. ఇది చూసిన బంధువులు ఆమెకు పిచ్చి పట్టిందనే తీర్మానానికి వచ్చారు. అయితే, సాధుసన్యాసులు, మహాత్ములు మాత్రం భక్తి సంప్రదాయంలో ఆమె గొప్ప యోగిని అని గుర్తించి, గౌరవిస్తూ వచ్చారు. చివరకు అక్బర్ చక్రవర్తి తన ఆస్థానంలోని ప్రముఖ సంగీత విద్వాంసుడు తాన్సేన్ తో కలసి మీరాబాయిని సందర్శించినట్టు చెబుతారు.

ఈమె పారమార్థిక జీవితం ఉపద్రవకరంగా ఉందని రాజవంశీయులు తమ గౌరవాన్ని నిలబెట్టు కోడానికి ఈమెను హత్యచేయడానికి ప్రయత్నించారు.

ఇలా ఉండగా, సన్యాసులతో కలసి మీరా పాటలు పాడుతూ, నృత్యం చేస్తుండడం వల్ల తమ పరువు ప్రతిష్ఠలు మంట గలుస్తున్నాయని రాజ కుటుంబం భావించింది. ఇంతలో మీరాబాయి భర్త భోజ్‌రాజ్ మరణించాడు. దాంతో, భోజ్‌రాజ్ తమ్ముడు రాజు అయ్యాడు. అతను మీరాను వేధించడం మొదలుపెట్టాడు. ఆఖరికి ఆమె మీద విషప్రయోగం చేశాడు. కృష్ణ భక్తురాలైన మీరా మాత్రం భగవత్ ప్రసాదంగా భావిస్తూ, అన్నిటినీ అంగీకరించింది. దేనినీ నిరసించలేదు. శ్రీకృష్ణుడి కరుణతో అన్ని అపాయాల నుంచీ ఆమె క్షేమంగా బయటపడింది.



ఒక బుట్టలో పాము దాగి ఉన్న పూలబుట్టను పంపాడని చెప్పబడింది. కానీ మీరా బుట్ట తెరిచినప్పుడు, లోపల పాముకు బదులుగా కృష్ణుడి విగ్రహం ఉంది. మరొక సందర్భంలో, మీరాను చంపడానికి అతను ప్రసాదానికి విషం కలిపాడు. మీరాకు ఆ విషయం తెలుసు, కానీ శ్రీకృష్ణుడు తన ప్రాణాలను కాపాడతాడని గట్టి నమ్మకంతో దానిని తీసుకున్నది.

ఆమెను చంపడానికి పదే పదే ప్రయత్నాలు జరగడంతో, ఆమె తులసీదాసుకు ఒక లేఖ రాసి, ఏమి చేయాలో మార్గనిర్దేశం చేయమని కోరింది. దీనిపై అతను, "తనకు మరియు తన ప్రభువు పట్ల ఆమెకున్న భక్తికి మధ్య వచ్చే ప్రతిదాన్ని వదిలివేయమని సూచించాడు. దేవుని పట్ల ప్రేమ మాత్రమే నిజం, ఇతర ప్రాపంచిక సంబంధాలు అబద్ధం" అని తెలియచేశాడు.

కొన్ని కథలలో, అక్బర్ చక్రవర్తి మరియు తాన్సేన్ మీరా పాటలు వినడానికి (వేషధారణలో) చిత్తోర్‌ఘర్ ఆలయాన్ని సందర్శించేవారని కూడా ప్రస్తావించబడింది. అతను మీరాను దైవికంగా భావించి ఆమె పవిత్ర పాదాలను తాకాడు; కృష్ణుడి విగ్రహం ముందు విలువైన రాళ్ళ హారాన్ని కూడా ఉంచాడు.

ఈ విషయం తెలుసుకున్న రాణా తీవ్ర కోపంతో మీరాను వెళ్లి చనిపోవాలని ఆదేశించాడు; తన కుటుంబ సమస్యలన్నింటికీ, దురదృష్టాలకూ ఆమెనే బాధ్యత వహించాలని ఆదేశించాడు. అతనికి విధేయత చూపిస్తూ, ఆమె నదికి వెళ్లి తన ప్రభువును జపిస్తూ వెళ్ళింది. ఆమె నదిలో దూకడానికి ప్రయత్నించినప్పుడు, ఎవరో ఆమెను పట్టుకున్నారు మరియు ఆమె మునిగిపోకుండా నది నుండి బయటపడింది. వెనక్కి తిరిగి చూసేసరికి, శ్రీకృష్ణుడు నిలబడి ఉండటం చూసి ఆమె అతని ఒడిలో అపస్మారక స్థితిలో పడిపోయింది. అప్పుడు కృష్ణుడు ఆమె చెవుల్లో గుసగుస లాడుతూ, "ప్రియమైన మీరా, నువ్వు ఇప్పుడు అన్ని మర్త్య సంబంధాల నుండి విముక్తి పొందావు. సంతోషంగా ఉండు. నువ్వు నాదానివే మరియు ఎల్లప్పుడూ నాదానివే." చెప్పాడు.

జీవితాన్ని మార్చే ఈ సంఘటన తర్వాత, ఆమె బృందావనానికి వెళ్ళింది. రాణా అక్కడికి వెళ్లి ఆమెకు

క్షమాపణలు చెప్పాడు. కానీ శ్రీకృష్ణుడి పట్ల ఆమెకున్న బేషరతు ప్రేమను, ఎప్పటికీ మారని భక్తిని చూసి, ఆమెను అక్కడే వదిలి బృందావనం నుండి తిరిగి వచ్చాడు.

మీరా ఎదుర్కొన్న సవాళ్లు మరియు వేధింపుల గురించి నాన్సీ మార్టిన్–కెర్షా చెబుతూ, మతం లేదా సామాజిక సమావేశాలు అసంభవమైన కారణాలు అని పేర్కొన్నారు; ప్రధాన కారణం రాజ్‌పుత్‌లు మరియు మొఘల్ సామ్రాజ్యం మధ్య రాజకీయ సమస్యలు మరియు సైనిక సంఘర్షణలు.

చిట్టచివరికి మీరా తన స్వామి నడయాడిన బృందావనానికి వెళ్ళింది. ఆనంద పారవశ్యం మిన్ను ముట్టగా, శ్రీకృష్ణుడి ఎదుట ఆడి పాడింది. కాగా, జీవ గోస్వామి అనే ఓ వయసు మీద పడిన వైష్ణవ సాధువు అక్కడ ఉండేవాడు. ఆయన మీరా ముఖం చూడడానికి నిరాకరించాడు. తాను ఓ సన్యాసిననీ, కాబట్టి స్త్రీ ముఖం దర్శించననీ పేర్కొన్నాడు. ఆ సంగతి విని మీరాకు నవ్వొచ్చింది. బృందావనంలో శ్రీకృష్ణ పరమాత్ముడు ఒక్కడే పురుషుడనీ, మిగిలినవారందరూ గోపికలేననీ ఆమె బదులిచ్చింది. ఆమె మాటలు ఆ సాధువుకు ఆశ్చర్యం కలిగించాయి. అప్పటి దాకా సన్యాసిని కమ్ముకొని ఉన్న మాయ కాస్తా పటాపంచలైంది.

ఆమె తన జీవిత చరమాంకాన్ని భక్తురాలిగా గుజరాత్ లోని ద్వారకలో గడిపింది. కృష్ణుడితో కలయికకై ఆమె పడే తపన ఆమె కవిత్వంలో ఎక్కువగా కనిపిస్తుంది. ద్వారకలో మీరా శ్రీకృష్ణ విగ్రహం ముందు నిలిచి వెళ్ళడానికి అనుజ్ఞ ఇమ్మని వేడుకుంది. నాట్యంచేసి శ్రీకృష్ణునిపై రచించిన భక్తి పాటలు పాడింది. శ్రీకృష్ణ విగ్రహం పాదాలపై బడి పాదాలను కళ్ళకు అద్దుకుంది. చివరగా చూస్తూండగానే శ్రీ కృష్ణ విగ్రహంలో ఐక్యమైపోయింది. ఇక ఆ తరువాత గుజరాత్ లోని చిత్తోర్‌ఘడ్ కోటలోనే ఆమెకు ఒక దేవాలయాన్ని నిర్మించారు.

ఆమె తన ఆధ్యాత్మిక సందేశాన్ని ఒక కీర్తనలో సంగ్రహంగా చెబుతుంది, "సత్సంగ్ నో రస్ చఖ్ ప్రాణి..." – "ఓ జీవి! సత్సంగం ఫలాన్ని ఆస్వాదించు, ప్రారంభంలో అది చేదుగా ఉండవచ్చు. కానీ కాలం గడిచేకొద్దీ అది మామిడిపండులా తియ్యగా మారుతుంది. ఈ శరీరం గురించి గర్వపడకండి, చివరికి అది బూడిదగా మారుతుంది. మీరు ఈ లోకాన్ని విడిచిపెట్టినప్పుడు ఏనుగులు, గుర్రాలు లేదా ఇతర రకాల సంపదలను తీసుకోలేరు. మీరు సత్సంగం చేస్తే మీకు ముక్తి లభిస్తుంది; వేదాలు ప్రకటించినట్లుగా. మీరా హరి పాదాలను ఆశ్రయించమని చెబుతుంది."

మానవ జీవిత ఉద్దేశ్యం గురించి మాట్లాడుతూ ఆమె భజనలలో ఒకటి ఇలా ప్రకటిస్తుంది, "ఓ మనసా! మురళి పాత్రధారి అయిన ప్రియమైన మోహన్ ను నువ్వు పూజిస్తావు. ఏడు సముద్రాలను దాటావు, ఒడ్డున మునిగిపోకు. మానవ జన్మ విముక్తి కోసమే, కుటుంబం గురించి ఎందుకు బాధపడాలి. ఓ మనసా ఎల్లప్పుడూ గిరిధర్ గుణాలను కీర్తిస్తూ పాడాలి." ఆమె తన జీవితాంతం చేసిన దానిని ఇతరులకు ఉద్బోధిస్తూనే ఉంది.

మీరాబాయి రాసిన అనేక పాటలు ప్రస్తుతం భారతదేశంలో గానం చేయబడుతున్నాయి. ఇవి ఎక్కువగా భక్తి పాటలు (భజనలు) అయినప్పటికీ దాదాపు అన్నింటిలో తాత్విక అర్థాలు ఉన్నాయి. ఈమె రాసిన గీతాలలో "పయోజీ మైనే రామ్ రతన్ ధన్ పాయో" ఒక గీతం. మీరాబాయి రాజస్థానీ భాషలో మెట్రిక్ పద్యాలు (లిరికల్ పాడాస్) రాసింది. ఈమె వేలాది గీతాలు ఈమె రాసినట్టు చెప్పబడుతున్నప్పటికీ, వాస్తవానికి ఎన్ని గీతాలను స్వయంగా రాసిందనే విషయంపై పరిశోధకులలో భేదాభిప్రాయాలు వచ్చాయి. ఈమె కవిత్వానికి లిఖిత ప్రతులు ఏవీ లేవు, 18వ శతాబ్దం ఆరంభం నుండి, ఈమె మరణించిన 150 సంవత్సరాల తరువాత ఈమె పేరుతో రెండు గీతాలతో కూడిన తొలి రికార్డులు ఉన్నాయి. అలిస్టన్, సుబ్రమణియన్ ఇద్దరు అనువాదకులు మీరాబాయి రచనల్లో కొన్నింటిని ఎంపికచేసి భారత దేశంలో ఆంగ్ల అనువాదంతో ప్రచురించారు. షెల్లింగ్, లాండెస్–లెవి యునైటెడ్ స్టేట్స్ అమెరికాలో సంకలనాలను అందించారు. స్నెల్ ది హిందీ క్లాసికల్ ట్రెడిషన్ పేరుతో అనువాద సంకలనాన్ని అందించాడు. సెయింట్ రవిదాస్‌తో పరిచయం ఏర్పడిన తర్వాత సేథి మీరాబాయి రాసిన కవితలను సేకరించి అనువదించింది. రాబర్ట్ బ్లై, జేన్ హిర్ష్‌ఫీల్డ్ ఇంగ్లీష్ అనువాదకులు మీరాబాయి రాసిన కొన్ని భజనలను మీరాబాయి: ఎక్స్టాటిక్ పోయమ్స్ పేరుతో ఇంగ్లీషులోకి అనువదించారు.

మీరాబాయి స్వరపరిచిన అనేక భక్తి భజనలు, వివిధ తాత్విక అర్థాలతో, నేటికీ భారతదేశంలో పాడబడుతున్నాయి. ఆమె ఎక్కువగా పారాయణం చేయబడిన భజన ఇప్పటికీ ఉంది—

"పాయోజీ మైనే రామ్ రతన్ ధన్ పాయో" (రాముని ఆశీస్సులు నాకు చాలా లభించాయి).

మెర్టాలో, మీరాబాయి జ్ఞాపకార్థం "మీరా మహల్" అని పిలువబడే మ్యూజియం నిర్మించ బడింది, ఇక్కడ మీరాబాయి జీవిత కథను వర్ణించే చిత్రాలు, శిల్పాలు, ప్రదర్శనలు మరియు తోట ఉన్నాయి.

మీరాబాయి హిందూ ఆధ్యాత్మిక కవయిత్రి, గాయకురాలు, శ్రీకృష్ణుని భక్తురాలు. 16వ శతాబ్ద కాలంలో ఉత్తర భారతదేశ హిందూ సాంప్రదాయంలో పేరొందిన భక్తురాలుగా తన జీవితాన్ని సాగించింది. మన దేశంలోని నక్షత్రాలతో నిండిన ఆధ్యాత్మిక ఆకాశంలో మీరాబాయి అత్యంత ప్రకాశవంతమైన నక్షత్రాలలో ఒకరు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## బ్రహ్మాండ పురాణాంతర్గతం

**గత సంచిక తరువాయి**

ఆ తరువాత సింహాదుని సంహరించిన చక్రవర్తి వేంకటేశ్వరునికి జరిగిన వృత్తాంతాన్నంతా పూర్తిగా వివరించి ఆ వేంకటాచలపతికి ఆయన తనకిచ్చిన పంచాయుధాలను తిరిగి సమర్పించాడు. అప్పుడు శ్రీనివాసుడు రాజును, పంచాయుధములను ఉద్దేశించి మేఘగంభీరమైన వాక్కులతో యిలా అన్నాడు. ఓ రాజా! భవిష్యత్తులో నీవు జయించుటకు సాధ్యంకాని యుద్ధంలో నీవు కోరినపుడు ఈ ఆయుధాలన్నీ వచ్చి నీకు గొప్ప సహాయాన్ని అందించి నీకు విజయాన్ని చేకూరుస్తాయి. అని చెప్పి పంచాయుధాలతో 'ఓ పంచాయుధములారా! ఈ రాజుకు అవసరమైనపుడు అతడు కోరిన సహాయన్నందిస్తూ మీమీ తీర్థాలలో ఉండండి. మీ తీర్థాలలో స్నానం చేసేవారికి నా సాయుజ్య వైభవాన్ని ప్రసాదిస్తూ నన్నే ధ్యానిస్తూ మీరంతా యధేచ్ఛగా విహరించండి. మిమ్మల్ని ఈ రాజునకిచ్చి యితనికి నా సాయుజ్యాన్ని ప్రసాదించాను. మీరు మరల నా దగ్గరికి వచ్చి నేనతనికిచ్చిన వరాన్ని పోగొట్టవద్దు. మీరు నా మనస్సులోనే ఉంటారు. ఇప్పుడు కొంతకాలం పాటు నేను ఆయుధాలు లేకుండానే దర్శనమిస్తాను.

ఆ తరువాత ఏదో కారణంగా కలియుగంలో ఒక మహానుభావుడు శంఖచక్రాలు తయారు చేయించి విమాన గోపురాదులు నిర్మిస్తాడు. అతని భక్తికి వశుడనై నేను అందరికీ దర్శనమిస్తూ వరద అభయహస్తాలతో కల్పాంతం వరకు ఉంటాను. పై రెండు చేతులలో శంఖచక్రాలను లోకుల తృప్తి కొరకు ధరిస్తాను 'ఓ చక్రవర్తీ! నీకు నా సాయుజ్యాన్ని ప్రసాదించాను నీవు వెళ్ళి రాజ్యాన్ని పరిపాలిస్తూ, రాత్రింబవళ్ళు నన్ను సేవించు అని ఆజ్ఞాపించగా, పంచాయుధాలు తమ తమ పుణ్య తీర్థాలకు వెళ్ళినాయి.

చోళరాజ పుత్రుడైన చక్రవర్తి దివ్యవైభవంతో దేవేంద్రుడు అమరావతికి వెళ్ళినట్లు తన పట్టణానికి వెళ్ళాడు. అని నారదమహర్షి చెప్పగా విన్న భృగు మహర్షి వేంకటేశ్వరుని యందు మిక్కిలి భక్తి ప్రపత్తులను పొందాడు. నారదమహర్షి చెప్పిన వేంకటాచల మాహాత్మ్యాన్ని, వృషభాచల ప్రభావాన్ని విన్న భృగుమహర్షి తాను కూడా ఆ లక్ష్మీపతిని దర్శించాలనే దృఢచిత్తంతో వేంకటాద్రికి వెళ్ళాడు.

# శ్రీ వేంకటేశ్వర సహస్రనామస్తోత్రం

వశిష్ఠమహర్షి నారదమహర్షిని 'బ్రహ్మదేవుడు వేంకటేశ్వరుని పవిత్రములైన కమలాలతో ఏవిధంగా పూజించాడు? ఆ శ్రీహరి దివ్యనామాలు గుణయోగ పరమైనవా? (సౌశీల్య వాత్సల్యాది గుణముల వలన ఏర్పడినవా?) లేక ప్రధానమైన నామాలా? లేక లక్షణార్థ బోధకములా? వాటిని వివరించండి? అని అడిగాడు. అంతట నారదుమహర్షి వశిష్ఠుమహర్షికి ఈ విధంగా చెప్పసాగాడు.

శ్రీహరి నామాలు అనంతాలు. అందులో కొన్ని ఆయన దివ్యగుణాలకు సంబంధించినవి. మరికొన్ని వాచ్యార్థ ప్రధానములైనవి. ఇంకొన్ని లక్ష్యార్థప్రధానమైనవి. ఉత్కృష్టములైన అర్థాన్ని బోధించే ఆ నామాలన్నీ పరమ పురుషుడు, ఆదిమధ్యాంతరహితుడు, అవ్యక్తుడు అనగా చక్షురాదీంద్రియములకు గోచరముకాని ఆ పురుషోత్తమునే తెలియజేస్తాయి.

చంద్రుడు, సూర్యుడు అగ్ని, వాయువు మొ వారు, అంగారకాది గ్రహాలు, నక్షత్రాలు, ఆకాశము దిక్కులు ఆయన సంకల్పిస్తే ఉంటాయి. ఆయన సంకల్పం చేతనే నశిస్తాయి. ఈ జగత్తంతా ఆయన ఇచ్ఛానుసారం ప్రవర్తిస్తుంది. ఓ సువ్రతా! వశిష్ఠమహర్షీ! ఆ దేవదేవుని నామముల మహిమౌన్నత్యాన్ని తెలుసుకోవడం ఎవరికి సాధ్యమౌతుంది? అయినప్పటికి బ్రహ్మదేవుడు కీర్తించిన మాత్రానే మానవుడు పాపముల నుండి విముక్తుడై పరమపదాన్ని పొందుతాడు. శ్రీవేంకటేశ్వర సహస్ర నామాలను ఉపదేశించిన ఋషి బ్రహ్మదేవుడు. ఛందస్సు అనుష్టుప్, శ్రీవత్సాంకుడైన లక్ష్మీపతి ఆరాధ్యదైవం ఓంకారం బీజంహ్రీం శక్తి, క్లీం కీలకం. 'ఓం నమో వేంకటేశాయ అనే మంత్రం దీనిలో ఉపదేశించబడుతున్నది. బ్రహ్మాండ గర్భుడు కవచం. చక్రగదాధరుడు అస్త్రం సకలాభీష్టసిద్ధిలో దీనికి వినియోగం సామగాయనుడు హృదయం.

## ధ్యాన శ్లోకాలు

భాస్వచ్చంద్రమసౌ యదీయనయనే భార్యా యదీయా రమా ।
యస్మాద్విశ్వసృడప్యభూ ద్యమికులం యద్ధ్యానయుక్తం సదా ॥
నాథోయో జగతాం నగేంద్రదుహితుర్నాథోఽపి యద్భక్తిమాన్।
తాతో యో మదన స్యయో దురితహాతం వేంకటేశం భజే ॥
ఊర్ధ్వౌహస్తౌ యదీయో సురరిపుదలనే బిభ్రతౌ శంఖచక్రే।
సేవ్యావంఘ్రీ స్వకీయా వభిదధ దధరో దక్షిణో యస్య పాణిః ॥
తావన్మాత్రం భవాబ్ధిం గమయతి భజంతా మూరుగో వామపాణిః।
శ్రీవన్మాత్రం భవాబ్ధిం గమయతి భజతామూరుగో వామపాణిః।
శ్రీవత్సాంకశ్చ లక్ష్మీ ర్యదురసి లసతస్తం భజే వేంకటేశమ్ ॥

-బ్రహ్మాండపురాణం అధ్యాయం 12 శ్లో 11,12.

ఏ దేవదేవునికి సూర్యచంద్రులు నయనాలో, లక్ష్మీదేవి భార్యయో, ఈ ప్రపంచ సృష్టికర్తయైన బ్రహ్మదేవుని పుట్టుకకు ఎవరు కారకులో, జితేంద్రియులైన మహాయోగులు నిరంతరం ఎవరిని ధ్యానిస్తుంటారో, ఎవరు సకల జగత్తుకు ప్రభువో, పార్వతీపతియైన పరమ శివుడు కూడా ఎవనియందు భక్తి కలిగి ఉంటాడో, మన్మథునికి తండ్రి ఎవరో, సకల పాపాలను పరిహరించే ఆ వేంకటేశ్వరుని సేవిస్తున్నాను.

ఆ పరాత్పరుని పై రెండు హస్తాలు రాక్షసులను సంహరించే శంఖ చక్రాలను ధరించి ఉన్నాయి. ఆయన కుడిచేత్తో తన పాదారవిందములను సేవించమని సూచిస్తున్నాడు, ఎడమ చేతిని నడుముపై పెట్టుకొని తననాశ్రయించిన వారికి సంసారసాగరం ఇంతమాత్రమే ఉంటుందని తెలియజేస్తున్నాడు. ఆయన వక్షఃస్థలంలో శ్రీవత్సమనే పుట్టుమచ్చ విరాజిల్లుతున్నది. విశాలమైన ఆయన వక్షఃస్థలంలో లక్ష్మి దేవి విరాజిల్లు తున్నది. అటువంటి దేవదేవుడు, పురుషోత్తముడైన వేంకటేశ్వరుని సేవిస్తున్నాను. ఈ విధంగా శ్రీవత్సనుడు, రమాపతియైన వేంకటేశ్వరుని మనస్సులో ధ్యానిస్తూ "వేంకటేశో విరూపాక్షః అని ప్రారంభించి క్రమంగా సహస్ర నామాలను జపించాలి.

వేంకటేశో విరూపాక్షో విశ్వేశో విశ్వభావనః ।
విశ్వసృ డ్విశ్వసంహర్తా విశ్వప్రాణో విరాడ్వపుః ॥

- బ్రహ్మాండపురాణం 2.12.శ్లో.1.

సర్వపాపాలు దహించే వేంకటమనే పర్వతానికి అధిపతి, వికృత రూపాలు గలవారిపై కూడా దయా దృష్టి కలవాడు, జగత్ప్రభువు, జగత్కర్తా, జగద్భర్తా, విశ్వస్రష్టా, సర్వలోకసంహర్తా, ప్రపంచానికి ప్రాణ స్వరూపుడు. విరాట్స్వరూపుడు అయిన వేంకటేశ్వరునికి నమస్కారము. శేషాచలనివాసి, అశేష భక్తజనుల దుఃఖములను పోగొట్టేవాడు, ఆదిశేషునిచే స్తుతింపబడేవాడు, శేషునిపై శయనించేవాడు, సకల వస్తువుల తారతమ్యం తెలిసినవాడు, సర్వవ్యాపి, స్వయంభువు, విశ్వాంతర్యామి, జయశీలుడు, వృద్ధిచెందేవాడు, లోకోత్తరకార్యములను చేయుటలో ఉత్సాహము కలవాడు అయిన శ్రీనివాసునికి నమస్కారము.

క్షమాశీలి, మహోదారుడు, ప్రకాశించేవాడు, ప్రళయకాలంలో లోకాల నన్నిటిని తనలోకి ఇముడ్చువాడు, మహాప్రళయంలో కూడా స్థిరంగా ఉండేవాడు, కాలాన్ని కూడా నియమించేవాడు, కాలాన్ని రక్షించేవాడు, కాలస్వరూపుడు కాలాంతకుడు, నాశరహితుడు, అనేక జన్మల పుణ్యంవల్ల కాలాంతరంలో పొందదగినవాడు, కాలకంఠుడైన శివునికి కూడా పూజ్యుడు కాలానికి కూడా ప్రభువు అయిన వేంకటేశ్వరునికి నమస్కారం.

సుఖాలకు ఉత్పత్తి స్థానమైనవాడు, స్వయంవ్యక్తమైనవాడు, పద్మనాభుడు, రామావతారంలో వారధి కట్టి సముద్రాన్ని

స్తంభింపజేసినవాడు, సాగర కన్యయైన లక్ష్మీపతి, ఎఱ్ఱతామరలవలె శోభించే పాదపద్మముల కాంతి కలవాడు, శంఖం వంటి కంఠం కలవాడు, మన్మథుని వలె మనోహర రూపం కలవాడు, పద్మముల వంటి నేత్రములు కలవాడు, దొండపండువంటి ఎఱ్ఱని అధరోష్ఠము కలవాడు, అర్చావిగ్రహరూపంలో ఉన్నవాడు, తనకు ప్రతిబింబాన్ని నిర్మించుటకు వీలుకానివాడు, (అనంత సౌందర్య లావణ్యాది గుణసాగరుడు) సకల కల్యాణ గుణనిధి అయిన శ్రీనివాసునికి నమస్కరిస్తున్నాను.

సద్గుణాలచే పొందదగినవాడు, గుణాతీతుడు, సద్గుణపక్షపాతి, దుర్గుణాలను పోగొట్టేవాడు, సకల సుగుణాలకు ఆటపట్టు, దివ్య గుణాలను ప్రకాశింపజేసేవాడు, పరాత్పరుడు, పరమాత్మ, పరంజ్యోతి, పరాగతి, పరమపదమైనవాడు, వైకుంఠనాథుడు, శుభపరంపరలను ప్రసాదించేవాడు, బ్రహ్మాండమును తనలో యిముడ్చుకున్నవాడు, బ్రాహ్మణ్యుడు, బ్రహ్మను సృజించినవాడు వేదప్రతిపాద్యుడు, తపస్సుతో తెలుసుకొనబడేవాడు బ్రహ్మదేవుని చేత వేదముల చేత స్తుతింపబడేవాడు వేదాలనుపదేశించిన వాడు, అనాది బ్రహ్మచారి, అస్ఖలిత బ్రహ్మచారి అయిన వేంకటేశ్వరునికి నమస్కరిస్తున్నాను.

**బ్రహ్మాండగర్భో బ్రహ్మణ్యో బ్రహ్మసృట్ బ్రహ్మబోధితః ।**
**బ్రహ్మస్తుత్యో బ్రహ్మవాదీ బ్రహ్మచర్యపరాయణః ॥**

**-బ్రహ్మాండపురాణం అ 12. శ్లో 9.**

## మత్స్యావతారం, కూర్మావతారం

సత్యార్థమైన సత్యవ్రతములతో సంతోషించేవాడు, సత్యస్వరూపుడు, మత్స్యావతారాన్ని ధరించినవాడు, వేదాలనపహరించిన సోమకాసురుని సంహరించినవాడు. వేదాలను ఉద్ధరించినవాడు, సముద్రంలో స్వేచ్ఛగా సంచరించేవాడు, దేవాసురుల చేత గొప్పగా స్తుతింపబడినవాడు, క్షీర సముద్రంలో మునిగిపోతున్న మందరపర్వతాన్ని వీపుపై ధరించిన కూర్మావతారి, అమృతకలశాన్ని తెచ్చిన ధన్వంతరి స్వరూపుడు, కూర్మరూపం ధరించిన వాడు, సముద్రాన్ని మధింపజేసినవాడు అయిన శ్రీనివాసునికి నమస్కారము.

## మోహినీ అవతారం

అమరులకు అమృత పానం చేసే భాగ్యాన్ని కల్పించినవాడు, రాక్షసులను సమ్మోహపరచే దివ్యలావణ్య స్వరూపమైన మోహినీ అవతారమును ధరించినవాడు, శివుని కూడా మోహింపజేసే మహామాయావి, రాక్షససమూహాన్ని భంజించినవాడు అయిన వేంకటేశ్వరునికి నమస్కరి స్తున్నాను.

## వరాహావతారం

శ్వేతవరాహమూర్తిగా హిరణ్యాక్షుని సంహరించినవాడు, యజ్ఞవరాహమూర్తి, యజ్ఞస్వరూపుడు, యజ్ఞం చేసేవాడు, యజ్ఞం చేయుటకనువైన భూమిని ఉద్ధరించినవాడు, తన విలాసార్థం వరాహరూపాన్ని ధరించినవాడు, మహా పరాక్రమశాలి, దండకారణ్యంలో ఉన్న రాక్షసులను సంహరించినవాడు, వంపు తిరిగిన కోరలు కలవాడు, భూమిని ధరించినవాడు సుందరుడనే గంధర్వుని శాపాన్ని పోగొట్టినవాడు, పుణ్యసంబంధం కలవాడు పవిత్రమైన సుగంధాన్ని ధరించినవాడు, సర్వకర్మసాక్షి, భయంకరమైన పెద్ద కోరలతో కూడిన ముఖం కలవాడు, సూర్యచంద్రులే నేత్రములుగా కలవాడు, జ్ఞానబలం, ఐశ్వర్యం, వీర్యం, శక్తి, తేజస్సు అనే ఆరు దివ్యగుణవైభవం కలవాడు, శ్వేతవరాహరూపధారి, హిరణ్యాక్షుడిపై కోపంతో కనుబొమలు ముడి వేసినవాడు, ఘుర్ఘురుమని విలాసంగా ధ్వనిచేసేవాడు, పొడవైన దేహం కలవాడు, నల్లని కేశములు కలవాడు, వికసించిన పద్మముల వంటి నేత్రములు కలవాడు, దయామూర్తి అయిన వరాహరూపియైన శ్రీనివాసునికి నమస్కరిస్తున్నాను.

## నృసింహావతారం

తన తేజస్సుతో మోహింపచేసేవాడు, ప్రళయ కాలాగ్ని వంటి కాంతి కిరణాలను వెదజల్లువాడు, అగ్నిజ్వాల వెలువడుతున్న భయంకరమైన నోరు కలవాడు, మండే కొరివిల వంటి నేత్రములు కలవాడు, ఆకాశంపైకి ఎగిరే జూలుతో మేఘాలను చెల్లా చెదరు చేసినవాడు, కోరల కాంతి దిగంతాల వరకు వ్యాపించినవాడు, తన ఉచ్ఛ్వాస ద్వారా భూతనాథుడైన పరమ శివుని తన వద్దకు ఆకర్షించిన వాడు, తన నిశ్వాసద్వారా సృష్టి కర్త యైన బ్రహ్మకపాలాన్ని శివుని చేతినుండి విడిపించినవాడు, మహోగ్రమూర్తి, మహాపరాక్రమశాలి, మహావిష్ణుస్వరూపుడు, జ్వలించేవాడు, సర్వతో ముఖుడు, అయిన నృసింహ రూపుడైన శ్రీనివాసునికి నమస్కారం.

నరసింహావతారం ధరించినవాడు, భయంకర రూపుడు, ప్రహ్లాదాది భక్తులకు ప్రసన్నుడు, మృత్యువుకే మృత్యువు వంటివాడు, సనాతనుడు, పురాణ పురుషుడు, శాశ్వతుడు, సభాస్తంభంలో నుంచి ఉద్భవించినవాడు, శత్రు భయంకరుడు, సహస్ర శిరస్సులు కలవాడు, మహేశ్వరుడు, ద్వాదశాదిత్యులు శిరోభూషణంగా కలవాడు, ప్రళయకాలాగ్ని ధూమము వంటి జటాజూటము కలవాడు, హిరణ్యకశిపుని వక్షఃస్థలాన్ని చీల్చే గోళ్ళు కలవాడు, సింహపుముఖం కలవాడు, పాపరహితుడు, ప్రహ్లాదవరదుడు, మహాబుద్ధిశాలి. భక్త సంఘములచే ప్రతిష్ఠితుడైనవాడు, బ్రహ్మరుద్రాదులచే సేవించబడేవాడు. సిద్ధులు, సాధ్యులచే

పూజించబడేవాడు, లక్ష్మీదేవితో కూడిన లక్ష్మీ నరసింహుడు, దేవదేవుడు,(దేవతలకు కూడా ప్రభువు) అగ్నిజ్వాలల నాలుకలవలె ఉన్న రక్తసిక్తాలైన ప్రేగులను మాలలుగా ధరించినవాడు, నందకమనే ఖడ్గాన్ని ధరించినవాడు, వైకుంఠంలో విహరించేవాడు, డాలు ధరించినవాడు, మహా ధనుస్సు కలవాడు, బ్రహ్మదేవుని కాపాడినవాడు (కపాలమును ధరించినవాడు) రోకలి ఆయుధముగా కలవాడు, నాగలిని ఆయుధముగా ధరించినవాడు, పాశమును ధరించినవాడు శూలాన్ని ధరించినవాడు, బ్రహ్మచారి, వేదాలు అధ్యయనం చేసినవాడు, ఉపనిషత్తులను ఉద్ధరించినవాడు, నైష్ఠిక బ్రహ్మచారి, శేష శయనమునందు ప్రీతికలవాడు, అదితి పుత్రుడు, పాపరహితుడు, భక్తులపాపాలను స్మరణమాత్రము చేతనే హరించే శ్రీహరిరూపునికి నమస్కారము.

జ్ఞాన ప్రియుడు, సామవేదము చేత తెలియదగినవాడు, బలిచక్రవర్తి గృహంలో ప్రతిష్ఠితుడై ఉన్నవాడు, బలిచక్రవర్తి చేత కడుగబడిన పాదపద్మములు కలవాడు, బలిచక్రవర్తి భార్య అయిన వింధ్యావళి చేత విశేషంగా గౌరవించబడినవాడు, బలి చక్రవర్తి వద్దనుండి మూడడుగుల భూమిని స్వీకరించినవాడు, త్రివిక్రముడై విశ్వరూపాన్ని ప్రదర్శించినవాడు, అద్భుతమైన త్రివిక్రమరూపంతో ముల్లోకాలను ఆక్రమించి, తన పరాక్రమాన్ని ప్రదర్శించినవాడు, తన కాలివ్రేలి గోటితో బ్రహ్మాండ కపాలాన్ని (పైకప్పును) ఛేదించినవాడు, ఆ బ్రహ్మాండ కపాలం చిల్లుపడగా తన పాదమునుండి ఉద్భవించిన పవిత్ర గంగానదీ జలధారలచే ముల్లోకాలను పవిత్రం చేసినవాడు, (ఆ ఆకాశగంగ మూడు పాయలై ముల్లోకాలలో ప్రవహించింది. దానిని స్వర్గంలోకంలో మందాకిని అని, భూలోకంలో భాగీరథిఅని, పాతాళలోకంలో భోగవతి అంటారు.) బ్రహ్మచేత పూజింపబడిన వాడు, పాపాత్ములను కూడా పవిత్రులను చేసే పుణ్యమూర్తి, రాక్షసులతో యుద్ధం చేసేవాడు, శత్రువులను జయించేవాడు, దేవతలకు స్వర్గసామ్రాజ్యాన్ని సంపాదించి ప్రసాదించినవాడు, శుక్రాచార్యుని మదమణచినవాడు, సద్గతిప్రదాయకుడు, అయిన వామనమూర్తికి నమస్కారము.

## పరశురామావతారం

జమదగ్ని మహర్షి పుత్రుడు, గండ్రగొడ్డలిని ఆయుధంగా ధరించినవాడు, సహస్రబాహువైన కార్తవీర్యార్జునుని సంహరించినవాడు, తండ్రి ఆజ్ఞవల్ల తల్లి రేణుకాదేవి శిరస్సును ఖండించినవాడు, దుర్మార్గులైన క్షత్రియులను మర్దించినవాడు, మహాతేజశ్శాలి, భూమండలాన్నంతా కశ్యపునికి దానమిచ్చిన మహాదాత, వైష్ణవ ధనుస్సును ధరించినవాడు, బ్రహ్మజ్ఞానంలో శ్రేష్ఠుడు అయిన పరశురామునికి నమస్కరిస్తున్నాను.

## శ్రీ రామావతారం

**రఘువంశసముద్భూతో రాఘవో భరతాగ్రజః ।**
**కౌసల్యాతనయో రామో విశ్వామిత్రప్రియంకరః ॥**

**-బ్రహ్మాండపురాణం అ12.శ్లో 31.**

మహోన్నతుడు, సర్వసద్గుణ పరిపూర్ణుడు, మర్రిచెట్టువలె అతివిశాల స్వభావుడై అందరికీ ఆశ్రయమిచ్చువాడు, దుష్టరాక్షసులను నిగ్రహించిన వాడు, పవిత్రమైన రఘువంశంలో ఆవిర్భవించినవాడు, రఘురాముడు, భరతుని అన్న, కౌసల్యాదేవి కుమారుడు, తన సౌందర్య సౌశీల్యాదులతో అందరినీ ఆనందింపజేసేవాడు, విశ్వామిత్రుని యాగ సంరక్షణచేసి, ఆయనకు ప్రీతిని కలిగించినవాడు, 'తాటక' అనే రాక్షసిని సంహరించిన వాడు, సుబాహువుని చంపినవాడు, విశ్వామిత్రమహర్షిచేత బలాతిబల మంత్రాలను ఉపదేశం పొందినవాడు, అహల్యాదేవి శాపాన్ని పోగొట్టినవాడు జనకమహారాజు మందిరాన్ని ప్రవేశించినవాడు సీతా స్వయంవరసభలో పాల్గొన్నవాడు, శివధనుర్భంగం చేసినవాడు, జానకీదేవిని పరిణయ మాడినవాడు, జనకమహారాజుచే స్తుతింపబడినవాడు, జమదగ్ని కుమారుడైన పరశురామునితో యుద్ధం చేసినవాడు, అయోధ్యా నగరాధీశులలో అగ్రగణ్యుడు, పితృవాక్య పరిపాలకుడు, అందుకై రాజ్యాన్ని త్యజించినవాడు, లక్ష్మణసహితుడు, సీతాసహితుడు, చిత్రకూట పర్వతంలో నివసించినవాడు, పంచవటిలో విహరించినవాడు, పుత్రునిగాను, సోదరుడుగాను, భర్తగాను, రాజుగాను, స్నేహితుడుగాను, తన ధర్మాన్ని పరిపూర్ణంగా ఆచరించినవాడు, విరాధుని సంహరించినవాడు, అగస్త్యుడు మొదలగు మహర్షులచే పూజింపబడినవాడు, పరమపురుషుడు అయిన శ్రీరామునికి నమస్కరిస్తున్నాను.

ఖడ్గాన్ని ధరించినవాడు, అక్షయతూణీరాలు కలవాడు, దండకారణ్యంలో ఖరుడనే రాక్షసుని సంహరించినవాడు, దూషణుడనే రాక్షస సంహారి, త్రిశిరసంహర్త, ధర్మస్వరూపుడు, నారచీరలు ధరించినవాడు, జడలు ధరించినవాడు, పర్ణశాలలో నివసించిన వాడు, మారీచుని బలాన్ని మర్దించినవాడు, పక్షిరాజైన జటాయువుతో సంభాషించినవాడు, సూర్యుని వంటి తేజస్సు కలవాడు, మహాబల పరాక్రమసంపన్నుడు, శబరి తెచ్చి యిచ్చిన పండ్లను భుజించిన వాడు, హనుమంతుని పరిచర్యలచే సంతోషించినవాడు, సుగ్రీవునికి అభయమిచ్చినవాడు, 'దుందుభి' అనే రాక్షసుని మహాకాయాన్ని సునాయాసంగా ఎగురగొట్టి తన పరాక్రమాన్ని ప్రదర్శించి విక్రమునిగా వెలుగొందినవాడు, ఏడు మద్ది చెట్లను ఒకే బాణంతో ఛేదించిన మహా బలశాలి, వాలిని సంహరించినవాడు అయిన శ్రీరామచంద్రునికి నమస్కరిస్తున్నాను.

వానరులతో కూడినవాడు, వాయుపుత్రుడైన హనుమంతుని చేత భక్తి శ్రద్ధలతో సేవించబడినవాడు, పంపాసరస్సును వదలినవాడు, ప్రాయోపవేశసమయంలో దర్భాసనంపై కూర్చున్నవాడు, సాగర తీరానికి చేరినవాడు, మహాశూరుడు, సముద్రానికి వారధి కట్టిన మహాశక్తిశాలి, రాక్షసులను అవలీలగా సంహరించినవాడు, లంకకు చేరినవాడు, శౌర్యము, సౌశీల్యము మొదలైన అలంకారాలతో శోభిల్లేవాడు, అతికాయుడనే అసురుని శిరస్సును ఛేదించినవాడు, కుంభకర్ణుని హతమార్చినవాడు, దశకంఠుడైన రావణాసురుని పదితలలను ఛేదించినవాడు, జాంబవంతుడు మొదలైన ప్రముఖవీరులచే పరివేష్టితుడైనవాడు జానకీదేవి భర్త, దేవతలకు ప్రభువు, సాకేత(అయోధ్య) పురాధీశుడు, పురాణ పురుషుడు, సనాతనుడు, పవిత్రమైన కీర్తిగలవాడు, వేదములచే తెలియదగినవాడు, స్వామి పుష్కరిణీ తీర్థతీరంలో నివసించేవాడు, పద్మసరస్సులో పద్మావతితో జలక్రీడల యందాసక్తి కలవాడు, లక్ష్మీదేవికి ప్రాణనాథుడు, సకలలోకసంరక్షకుడు అయిన శ్రీరామునికి నమస్కరిస్తున్నాను.

**పుణ్య శ్లోకో వేద వేద్యః స్వామితీర్థ నివాసకః ।**
**లక్ష్మీసరః కేళిలోలో లక్ష్మీశో లోకరక్షకః ॥**

**-బ్రహాండ పురాణం అధ్యాయం 12 శ్లోకం 44.**

## కృష్ణావతారం

**దేవకీగర్భసంభూతో యశోదేక్షణలాలితః ।**
**వసుదేవకృతస్తోత్రో నందగోపమనోహరః ॥**

**- బ్రహ్మాండపురాణం అధ్యాయం 12. శోక్లం 45.**

దేవకీదేవి గర్భమున పుట్టినవాడు, యశోదాదేవి చల్లని చూపులతో లాలింపబడినవాడు, వసుదేవునిచే భగవంతునిగా స్తుతించబడినవాడు, నందగోపుని మనస్సును ఆకర్షించినవాడు. చతుర్భుజుడు, సుకుమారమైన శరీరం కలవాడు. గదాయుధాన్ని ధరించినవాడు, నల్లని కురులు కలవాడు, పూతన అనే రాక్షసి ప్రాణాలు పోగొట్టినవాడు, తృణావర్తుడనే రాక్షసుని సంహరించినవాడు, తమ కులగురువైన గర్గాచార్యులచే నామకరణం చేయబడినవాడు, వసుదేవుని కుమారుడు, సర్వాంతర్యామి, సర్వవ్యాపి, అయిన వాసుదేవునికి నమస్కారము.

ఇంద్రియాతీతుడు, జితేంద్రియులకు గోచరించువాడు, (అధోక్షజుడు) గోపికాస్త్రీల స్తన్యమును త్రాగినవాడు, బలరామునికి తమ్ముడు, అచ్యుతుడు (తన స్థితినుండి చ్యుతిలేనివాడు), పులిగోరును ఆభరణంగా ధరించినవాడు, వత్సాసురుని జయించినవాడు, గోవత్సములను, గోపబాలురను ప్రేమతో వశం చేసుకొన్నవాడు, ఆవు దూడలను, గోపబాలురను పెంచినవాడు, క్షీరసారాలైన పెరుగు, మీగడ, వెన్న, నెయ్యి మొదలైన వాటిని తినుటయందు మిక్కిలి ప్రీతికలవాడు అయిన శ్రీకృష్ణునికి నమస్కారము.

పెరుగు కుండలను పగులగొట్టినవాడు, వెన్నను దొంగిలించినవాడు, నీలమేఘాలవలె ప్రకాశించేవాడు, గోపికాస్త్రీలయెడ చిలిపితనం ప్రదర్శించినవాడు, తల్లి యశోదకు తన నోటిలో బ్రహ్మాండాన్ని చూపించినవాడు, రోటికి కట్టివేయబడినవాడు, మద్దిచెట్లరూపంలో ఉన్న, నలకూబర, మణిగ్రీవులకు శాపవిమోచనం కలిగించినవాడు, గోధూళి ధూసరితమైన దేహం కలవాడు, గోబృందాన్ని రక్షించినవాడు అయిన శ్రీకృష్ణునికి నమస్కరిస్తున్నాను.

లక్ష్మీ (రుక్మిణి)పతి, బృందారణ్యంలో నివసించినవాడు, వత్సాసురుని సంహరించినవాడు, బకాసురుని చంపినవాడు, దైత్యులనే మేఘాలకు మహా ప్రభంజనం వంటివాడు, పెద్ద కొండ చిలువకు ప్రచండాగ్ని వంటి వాడు, శకటాసురుని ప్రాణాలను హరించినవాడు, దేవేంద్రుని చేత సేవించబడినవాడు, పావనమైన దేహం కలవాడు, ఖరుడనే రాక్షసుని సంహరించినవాడు, ప్రచండమైన తేజస్సు కలవాడు, బాగా పండిన తాటిపండ్లను తినేవాడు, కాళీయుడనే సర్పము యొక్క గర్వమణిచినవాడు, నాగ పత్నులు చేసిన స్తుతితో సంతోషించినవాడు, ప్రలంబాసురుని సంహరించినవాడు అయిన శ్రీకృష్ణునికి నమస్కరిస్తున్నాను.

దావాగ్నిని మ్రింగి గోవులను రక్షించినవాడు, ఫలాలను భుజించిన వాడు, రోహిణీ వసుదేవుల కుమారుడైన గదునికి అన్నయైనవాడు, గోపికల చీరలను అపహరించినవాడు, జలక్రీడావిశారదుడు, వేణుగాన ప్రవీణుడు, గోపికల కరకమలముల చేత పూజలందుకొన్నవాడు, మునిపత్నుల చేత భక్తితో సమర్పించబడిన ఆహారము కలవాడు, మునిశ్రేష్ఠుడు, మునులకు ప్రియమైనవాడు, గోవర్ధన పర్వతాన్ని పైకెత్తినవాడు, దేవేంద్రుని అజ్ఞానాన్ని పోగొట్టినవాడు, చక్కటి ఉద్యానవనాల్లో (బృందావనం) విలాసంగా విహరించేవాడు, రాసక్రీడలయందు మిక్కిలి ఆసక్తి కలవాడు అయిన శ్రీకృష్ణునికి నమస్కారము.

వరుణదేవునిచే పూజింపబడినవాడు, గోపికలచేత ప్రార్థింపబడినవాడు, పురుషోత్తముడు, మహాభాగవతోత్తముడైన అక్రూరుని స్తోత్రంతో సంప్రీతుడైనవాడు, భక్తితో మైపూతను సమర్పించిన 'త్రివక్ర' అనే కుబ్జకు సుందర శరీరాన్ని యౌవనాన్ని ప్రసాదించినవాడు, ముష్టికాసురుని, రొమ్ము గుద్దినవాడు, చాణూరుని పొట్టను చీల్చినవాడు మల్లయుద్ధంలో అగ్రగణ్యుడు, కంసుని చంపి తన తండ్రియైన వసుదేవుని చెర విడిపించిన శ్రీకృష్ణునికి నమస్కారము.

కువలయాపీడమనే మదపుటేనుగును సింహమువలె చంపినవాడు. కంసుని కంఠాన్ని ఛేదించినవాడు, కంసుని తండ్రియైన ఉగ్రసేనుని సింహాసనంపై అధిష్ఠింపజేసినవాడు, రత్నసింహాసనాన్ని అధిష్ఠించినవాడు, కంసుని రూపంలో

ఉన్న కాలనేమి అనే దుష్టరాక్షసుని సంహరించినవాడు, మిక్కిలి బలవంతుడైన కాలయవనుని యుక్తిగా చంపించి ముచికుందునకు వరాన్ని ప్రసాదించినవాడు, శిశుపాలుని తమ్ముడైన సాల్వుని, అతని నాశ్రయించిన వారిని సంహరించి వారందరి గర్వాన్ని అణచినవాడు, రుక్మిణీదేవి సోదరుడైన రుక్మి పొగరణచినవాడు, రుక్మిణీ దేవికి కనుల పండువైనవాడు, ప్రద్యుమ్నునికి తండ్రి, అంతులేని వరప్రదాత, చతుర్వ్యూహములలో ప్రద్యుమ్న, రూపంతో ఉన్నవాడు, ద్వారకాధిపతి అయిన శ్రీకృష్ణునికి నమస్కారము.

శమంతకమణిని తెచ్చియిచ్చినవాడు, మహామాయావి, సర్వజగత్తును మోహింపచేసేవాడు, మహాశ్చర్యకరమైన గుణాలు, చేష్టలు కలవాడు, శమంతక మణికొరకై జాంబవంతునితో యుద్ధం చేసినవాడు, సువర్ణమయమైన వస్త్రాలను ధరించినవాడు, అందరికీ పొందదగినవాడు, జాంబవతికి భర్త, కాళిందీనదీ తీరంలో ప్రసిద్ధమైన ఉద్యానవనంలో విహరించేవాడు, గురివింద గింజలను కర్ణాభరణాలుగా ధరించినవాడు, మందార కుసుమాలతో విరాజిల్లేవాడు, శచీపతియైన దేవేంద్రునికి అభీష్టాలను ప్రసాదించిన శ్రీకృష్ణునికి నమస్కరిస్తున్నాను.

**(సశేషం)**

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

1. **ధర్మాచరణ, అధర్మాచరణలు అధర్మాన్ని వదిలేందుకు ఏం చేయాలో వివరించండి? – జ్యోతి, మోకిలా–శంకరపల్లి**

జవాబు – ధర్మాచరణ మాత్రమే మానవ శ్రేయస్సుకు దోహదం చేస్తుంది. అదే మూడు లోకాలను ప్రకాశింప చేస్తుంది. "త్రైలోక్య దీపకో ధర్మః". పశు పక్ష్యాదులు, మానవుడు – అన్ని విషయాలలో సమానమే. అయినా ధర్మమే వీటినుండి మనిషిని వేరు చేస్తుంది. శాస్త్రం ఏది చెయ్యమందో, పెద్దలు ఏది ఆచరించాలో, దేనివల్ల ఇతరులకు బాధ కలగదో, దేనిని ఆచరిస్తే మానవ విలువలు నిలబడతాయో అదే ధర్మం. ధర్మాచరణే విజయానికి దారి తీస్తుంది. మానవ ధర్మం, హిందూ ధర్మం ప్రధానం. కుటుంబం పట్ల, ఉద్యోగ నిర్వహణ పట్ల నిజాయితీగా ఉండడం, సమాజం పట్ల, దేశం పట్ల మన కర్తవ్యం, బాధ్యత తెలుసుకుని ప్రవర్తించడమే ధర్మం. వీటికి విరుద్ధమయినవి అన్యాయం, అక్రమం. స్వార్థంతో చేసే పనులు అధర్మాలు. సత్సంగం, సద్గ్రంథ పఠనం, సద్గురు సమాశ్రయణం, సన్మార్గ గమనం, సత్యనిష్ఠలతో అధర్మాన్ని జయించి, ఆనందం పొందవచ్చు. అలా చేసినప్పుడే ఆ ధర్మం మనల్ని రక్షిస్తుంది. "ధర్మో రక్షతి రక్షితః" అని అన్నది ఇందులకే.

2. **ఉత్సాహం, ఉత్సాహం అంటూ దానిని అలవరచుకోవాలి. అప్పుడే జీవితం ఆనందమయం అవుతుంది అని అంటారు. హనుమంతుని దృష్టిలో పెట్టుకుని దీనిని వివరించగలరు – ఆహ్లాద్, పీర్జాదిగూడ**

జవాబు – మంచి ప్రశ్న. మనిషికి ఉత్సాహమే ప్రధానమైన బలం. మనిషి జీవితం ఎప్పుడూ సాఫీగా, విజయవంతంగా సాగదు. వైఫల్యం ఎదురైనప్పుడు, నిరాశ చుట్టుముట్టినప్పుడు, ఆపదలు కలిగినప్పుడు మనం నిరుత్సాహానికి, నిరాశ–నిస్పృహలకు అవకాశం ఇవ్వకూడదు. ఉత్సాహంతో చేసే పనే ప్రతిఫలిస్తుంది. ఇక రామాయణం విషయానికి వస్తే, సీతావియోగం కలిగినప్పుడు రాముడంతటివాడు కూడా ఎంతో నిరుత్సాహ పడ్డాడు. అప్పుడు లక్ష్మణుడు శ్రీరాముణ్ణి బాగా ఉత్సాహపరచి, సీతాన్వేషణ చేద్దాం, మనకు ఆమె తప్పక లభిస్తుంది అని అన్నాడు. ఇక ఆంజనేయుని విషయానికి వస్తే సీత జాడ తెలుసుకోడానికై లంకకు వచ్చి, లంకలో అణువణువూ వెదికి ఆమె కనబడలేదని ఎంతో నిరుత్సాహపడి, ప్రాణ త్యాగం చేసుకోవడానికి కూడా సిద్ధపడతాడు. కాని మరల ధైర్యం, ఉత్సాహం తెచ్చుకుని, లక్ష్యం సిద్ధి పొందాలంటే నిర్వేదం (నిరుత్సాహం) పొందకూడదు అనుకుని మరల వెదికి, సీతమ్మను అశోకవనంలో చూడగలిగాడు. "అనిర్వేదః శ్రేయోమూలం అనిర్వేదః పరం సుఖం". ఉత్సాహంతోనే సంపదలు, సుఖం పొందగలుగుతాం. వ్యక్తి శ్రేయస్సు, సమాజ శ్రేయస్సు, దేశ శ్రేయస్సు కూడా సాధ్యమవుతాయి.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**
***– ఎడిటర్, శ్రీవేంకటేశం***

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



**గత సంచిక తరువాయి**

## శ్రీవారి కైంకర్యపరులు

"కైంకర్యం" అంటే భగవంతునికి ప్రీతిపాత్రమైన కార్యాన్ని ఆచరించటం. కింకరుడు చేసే పని "కైంకర్యంగా" పిలువబడుతోంది. కింకరుడు అంటే భగవంతుడు చెప్పిన లేదా ఆయనకు ప్రీతికరమైన పనులను తూచా తప్పకుండా, ఏ విధమైన సందేహం, తడబాటు, తాత్సారం లేకుండా ఒక క్రమశిక్షణ గల సైనికుని వలె చేసుకుంటూ పోయేవాడు.

శ్రీవారి ఆలయంలో నిత్యం నిర్వహించే కైంకర్యాలలో అనేకమంది కైంకర్యపరులు వివిధ రకాల సేవలను శతాబ్దాలుగా అందించటం జరుగుతూ ఉంది. వీరిలో ప్రధానంగా మూడు రకాల వారున్నారు.

- **శ్రీ వైఖానస అర్చకులు**
- **జియ్యరు స్వాములు**
- **ఆచార్య పురుషులు**

వీరితో పాటు సన్నిధి గొల్ల కూడా ముఖ్యభూమిక పోషిస్తున్నారు.

శ్రీవారి కైంకర్యాలలో ఎవరెవరు పాల్గొంటారు, వారు ఎప్పటినుండి ఆలయంతో అనుబంధం కలిగి ఉన్నారు, వారెటువంటి విధులు నిర్వహిస్తారు మొదలైన వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### శ్రీ వైఖానస అర్చకులు

వైఖానస అనే పదం విష్ణ్వాలయాల్లో అత్యంత అంకితభావంతో సేవలందించే నిమిత్తం శ్రీమహావిష్ణువు అంశతో జన్మించిన "విఖన మహర్షి" నుండి వచ్చింది. విఖనమహర్షి ఆలయాన్ని తిరుమలలోని ఉత్తర మాడవీధిలో, రాధాగోపాల ఆలయానికి ఎడమ ప్రక్కగా దర్శించుకోవచ్చు. విష్ణువు అంశతో జన్మించడం వల్ల, ఈ మహర్షి సాక్షాత్తు బ్రహ్మదేవునికి సోదరుడన్నమాట.

వైఖానస శాఖకు చెందినవారు ఇతర వైష్ణవ శాఖల్లో వలె తర్కం, మీమాంస జోలికి వెళ్ళకుండా, కేవలం విష్ణువు పూజా పునస్కారాల మీదనే శ్రద్ధ వహిస్తారు. శ్రీవారి కైంకర్యాలకు వీరి ప్రధాన గ్రంథమైన "శ్రీ వైఖానస ఆగమం" మూలాధారం. దీనిలో పొందుపరచబడిన ప్రతి అంశాన్నీ వీరు పొల్లుపోకుండా ఆచరిస్తారు.

ప్రస్తుతం ఈ శాఖకు చెందిన నాలుగు వేల కుటుంబాల వారు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లోనూ, వృత్తిరీత్యా అమెరికా వంటి ఇతర దేశాల్లోనూ నివసిస్తున్నారు.

శ్రీవైష్ణవుల నుండి సులభంగా గుర్తించబడడానికి వీలుగా, వీరు తిరుచూర్ణం స్థానంలో (నిలువు నామాల మధ్యలో ఉన్న గీత) కేసరి రంగు మిశ్రమాన్ని వాడతారు. ఈసారి మీరు తిరుమల లేదా శ్రీరంగం, కంచి వంటి మరేదైనా ప్రముఖ వైష్ణవ క్షేత్రాన్ని దర్శించుకున్నప్పుడు, వైఖానస అర్చకులకు ఉన్న నామాలను గమనించండి.

శ్రీవారి ఆలయ ద్వారాలను తెల్లవారక ముందే తెరవటం మొదలు, తిరిగి అర్ధరాత్రి సమయంలో మూసివేసే వరకు సమస్త కైంకర్యాలు వీరి చేతుల మీదుగా జరగాల్సిందే. ఇతర కైంకర్య పరులందరూ వీరికి కేవలం సహాయపడతారు.

ఒక ఆలయంలోని అర్చామూర్తిలో దైవత్వం నెలకొని, ఆ ఆలయం అత్యంత ప్రసిద్ధి లోకి వచ్చిందంటే దానికి ప్రధాన కారణం సుశిక్షితులు, సద్వర్తనులైన అర్చకులు క్రమపద్ధతిలో నిరంతరాయంగా, లోపరహితంగా శతాబ్దాల తరబడి స్వామివారికి అర్చనాదులు చేయడమే. తిరుమల ఆలయం ఈనాడు ఇంత ప్రాశస్త్యం చెందిందంటే, అందులో వీరి అకుంఠిత కృషి, అంకితభావాల పాత్ర ఎంతుందో చెప్పకనే చెబుతుంది.

ఆగమ శాస్త్రానుసారం, విష్ణువును పూజించే అర్హత, సామర్థ్యం కేవలం ''విష్ణువు''కే ఉంటాయి. కాబట్టి, శ్రీవైఖానస అర్చకులు విస్తారమైన వైదిక ప్రక్రియల ద్వారా, అర్చన ప్రారంభించటానికి ముందు శ్రీమహావిష్ణువును తమలో ఆవహింపచేసుకుని, తమను తాము విష్ణువుగా పరివర్తింపచేసుకుని శ్రీవారి అర్చనాది కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఇంతటి మహత్కార్యం అనునిత్యం చేయాలంటే వారెంతటి నియమ నిష్ఠలు, క్రమశిక్షణ, ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండాలో ఆలోచించండి!

శ్రీవారి ఆలయానికి సంబంధించి అత్యంత ప్రామాణికంగా చెప్పుకునే ''సవాల్–జవాబ్'' పట్టీ అనే 1817 సంవత్సరం నాటి బ్రిటిష్ పాలకులు వ్రాసిన పుస్తకంలో పొందుపరచిన వివరాల ప్రకారం ఆలయ ప్రధాన అర్చకులైన శ్రీమాన్ గోపీనాథ దీక్షితుల వారి కుటుంబం, శతాబ్దాల తరబడి అవిచ్ఛిన్నంగా ఉండి, 9వ శతాబ్దంలో రెండుగా విభజించబడింది. మొదటి కుటుంబం భారద్వాజ గోత్రానికి చెందిన గోపీనాథ దీక్షితులది. విడివడిన, రెండవ కుటుంబం, కౌశిక గోత్రానికి చెందిన, తపస్సంపన్నుడైన శ్రీ శ్రీనివాసుల దీక్షితుల వారిది.

ప్రస్తుతానికి ఈ రెండు గోత్రాల వారు గోత్రానికి రెండు కుటుంబాల చొప్పున, మొత్తం నాలుగు కుటుంబాల వారు గుడిలో అర్చకత్వం వహిస్తున్నారు.

- భారద్వాజ గోత్రానికి చెందిన గొల్లపల్లి మరియు పైడిపల్లి కుటుంబాల వారు.
- కౌశిక గోత్రానికి చెందిన తిరుపతమ్మ గారి మరియు పెద్దింటి వారి కుటుంబాల వారు.

ప్రస్తుత ప్రధానార్చకులైన శ్రీవేణుగోపాల దీక్షితులవారు మరియు వారి ముందున్న శ్రీ రమణ దీక్షితుల వారు, భారద్వాజ గోత్రజులైన గొల్లపల్లి కుటుంబానికి చెందినవారు.

ఆయా కాలాల్లో దాతలైనటువంటి రాజులూ, జమీందార్లూ ఆయా కుటుంబాలకు దానంగా ఇచ్చిన గ్రామాల పేర్లే కాలక్రమేణా వారి కుటుంబ నామధేయాలుగా మార్పు చెందాయి.

శ్రీ వైఖానస అర్చకులు మాత్రమే శ్రీవారి మూలవిరాట్టును స్పృశించి, వారికీ మరియు ఆనందనిలయంలో గల ఇతర దేవతామూర్తులకు కైంకర్యం చేయగలిగే అధికారం కలిగి యున్నారు.

క్షణకాల దర్శనానికే మనలాంటి సామాన్యులు పరితపించిపోతుంటే, నిత్యం స్వామివారిని సేవిస్తూ, స్పృశిస్తూ, వారి సన్నిధిలో గడిపే భాగ్యం కలగటం ఎన్ని జన్మల సుకృతమో కదా!

### జియ్యంగార్లు

ఆలయ ఆర్థిక వ్యవహారాలు చూడడానికీ, కైంకర్య ఏర్పాట్లు చెయ్యడానికీ ఆలయంలో ఆది నుండి ఒక ''అధికార వ్యవస్థ'' ఉండేది. అయితే, వారు జీతభత్యాలకు పని చేసేవారు కావటంతో, వారికి శ్రీవారి పట్ల అచంచల భక్తి విశ్వాసాలు లేకుండా, వారు కేవలం ఉద్యోగ ధర్మంగా విధులు నిర్వహించే అవకాశం ఉంది. ఆ కారణంగా వారు కైంకర్యానికి కావలసిన వస్తు సామగ్రిని సరియైన పరిమాణంలో, తగు నాణ్యతతో సకాలంలో అందిస్తున్నారా లేదా అన్న విషయాన్ని నిర్ధారించుకోవడానికి, అర్చకులకు, అధికార గణానికి మధ్య ఒక అనుసంధాన వ్యవస్థ ఉండాలని భగవద్రామానుజులు తలంచారు (నేటి పరిభాషలో దీనిని ''ఆడిటింగ్ వ్యవస్థ'' అనుకోవచ్చు). ఆ వ్యవస్థను అజమాయిషీ చేసే వ్యక్తి ఆలయ ఆచార వ్యవహారాలను క్షుణ్ణంగా తెలిసినవాడై, స్వతహాగా నియమ నిష్ఠలు కలవాడై, పాండిత్య వైరాగ్యాల్లో అధికుడైతేనే అతడి మాటపై గౌరవం ఉంటుందని కూడా తలచారు. అంతేకాక హుండీ ద్వారా, ఆర్జిత సేవల ద్వారా, దానధర్మాల ద్వారా, ఇంకా అనేక మార్గాల ద్వారా దేవాలయానికి చేకూరే ఆదాయాన్ని; నిత్యం జరిగే కైంకర్య ఖర్చులు, జీతభత్యాలను సరి చూసుకునే ఒక సమాంతర వ్యవస్థ కూడా ఉండాలి. ఇంకా, ఆలయ కైంకర్య పద్ధతులు అధికారులకు పూర్తిగా తెలియకపోవచ్చు. వారికి ఈ విషయాల్లో మార్గదర్శకత్వం వహించాలి. ఈ కోణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని, ''ఏకాంగి'' అనే ఒక వ్యవస్థను రామానుజులవారు నెలకొల్పారు. తదనంతరం అదే జియ్యంగార్ల వ్యవస్థగా ప్రసిద్ధి కెక్కింది.

ఆలయంలో జరిగే ప్రతి ఉత్సవం మరియు సేవలో ఈ వ్యవస్థ యొక్క ప్రాతినిధ్యం ఉండేలా కట్టుబాటు చేయబడింది. ఆలయం అభివృద్ధి చెందిన తరువాత, క్రమంగా అధికార యంత్రాంగ పరిమాణం భారీగా పెరగడంతో పాటు, అత్యున్నతస్థాయి (ప్రస్తుతం IAS) అధికార్లను కూడా నియమిస్తూ వచ్చారు. అంతేకాకుండా, ఆలయ నిత్యకృత్యాలన్నీ లిఖితపూర్వక ప్రమాణాలతో, లోటుపాట్లకు తావులేని రీతిలో చట్టబద్ధతను సంతరించుకున్నాయి. దాంతో, జియ్యంగార్ల బాధ్యతల్లో కూడా కొంత మార్పులు చోటు చేసుకున్నాయి.

ప్రస్తుతం వీరు సేవలూ ఉత్సవాల్లో అర్చకులకు పూజా సంభారాలు అందించడం, ఆలయ ద్వారాలు శాస్త్రోక్తంగా తెరిచే లాంఛనాల్లో సహాయపడడం, ఉత్సవ సమయాల్లో దివ్యప్రబంధ

గానానికి ఆధ్వర్యం వహించడం, ఆలయ సాంప్రదాయాల నిర్వహణలో సాధారణంగా వచ్చే సందేహాల నివృత్తి చేయడం లాంటి కార్యక్రమాలన్నీ నిర్వహిస్తున్నారు.

సాక్షాత్తు భగవద్రామానుజుల వారు ప్రవేశపెట్టిన వ్యవస్థ కావటం మరియు మందిర ఆచార వ్యవహారాల్లో ఆరితేరి ఉండటం వల్ల, వీరింకా విశేష గౌరవాదరాలను చూరగొంటున్నారు. శ్రీవారి గర్భాలయంలో ప్రవేశించడానికి, శ్రీ వైఖానస అర్చకులతో పాటుగా కేవలం జియ్యంగార్లకు మాత్రమే అనుమతి ఉంది.

ఈ జియ్యంగార్లు వానప్రస్థాశ్రమం స్వీకరించినవారు. వీరు ఎల్లప్పుడూ చేతిలో త్రిదండం ధరించి ఉంటారు. "త్రిదండం" అంటే ఒకే పొదనుండి తీయబడిన మూడు వెదురు బద్దలను కలిపి కట్టి ఉంచిన పొడవాటి దండం. ఒక బద్ద ఆత్మకు, మరియొకటి ప్రకృతికి, మూడవది పరమాత్మకు సంకేతాలు. ఈ దండాన్ని ధరించిన వారిని "త్రిదండి" గా పిలుస్తారు (ఉదాహరణకు త్రిదండి చిన జియ్యర్ స్వామి. వీరి ఫొటోను గుర్తు చేసుకుంటే, ఎల్లప్పుడూ కుడిచేతితో, భుజంమీదుగా త్రిదండాన్ని ధరించి ఉంటారు.

కైంకర్యాలలో అంతరాయం ఉండకూడదని ఇద్దరు జియ్యంగార్లు ఉండే సంప్రదాయం మొదలైంది. పెద్ద జియ్యంగార్ పరమపదించితే చిన్న జియ్యర్ పెద్ద జియ్యరు అవుతారు. వెంటనే మరొక యోగ్యుడైన వ్యక్తిని చిన జియ్యంగారుగా నియుక్తి చేస్తారు. వీరు వంశ పారంపర్యంగా వచ్చే మిరాశీలు కాదు. అరబిక్ భాషలో "మిరాశీ" అంటే వంశపారంపర్యమని అర్థం. మహమ్మదీయుల పరిపాలనా కాలంలో ఈ పదం వాడుకలోకి వచ్చింది. గౌ॥ ఎన్.టి.రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మిరాశీ వ్యవస్థలో పెనుమార్పులు సంభవించాయి. ఆ విషయాలు ఇతర మరొకచోట వివరంగా చర్చించడమైనది.

పెద్ద జియ్యరు గారి మఠం ప్రస్తుతం తిరుమల యందు బేడి ఆంజనేయస్వామి ఆలయం ప్రక్కగా, రాంబగీచా విశ్రాంతి గృహం నుండి, దేవాలయానికి వెళ్ళేటప్పుడు మనకు కుడిప్రక్కగా, ప్రముఖంగా కనిపిస్తుంది. జియ్యరుస్వామివారు వేరే కార్యక్రమాల్లో లేనప్పుడు ఈ ఆశ్రమాన్ని దర్శించుకొని, వారి ఆశీర్వాదం తీసుకోవచ్చు.

ప్రస్తుతం "ఏకాంగి" అంటే జియ్యంగార్ల పరిచారకుడుగా, వారి తరపున కైంకర్యాలలో సేవలందించే వ్యక్తిగా ప్రసిద్ధి కెక్కారు. ఈయన ఏకవస్త్రుడైన బ్రహ్మచారి.

**ఆచార్య పురుషులు**

ఆలయంలో జరిగే వివిధ కైంకర్యాలలో పాలు పంచుకునే మూడవ వ్యవస్థే "ఆచార్య పురుషుల వ్యవస్థ". ప్రాచీన కాలంలో తిరుమల ఆలయం అనేక క్రూరమృగాలు మరియు విషపురుగులతో నిండివున్న దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండేది. ఆ కాలంలో దర్శనానికి వెళ్ళటమే గొప్ప విషయం. మరి ఇతర సేవల ప్రస్తావనే అత్యంత దుర్లభం. అట్టి క్లిష్ట పరిస్థితుల్లో, స్వామివారికి జరిగే కైంకర్యాలలో ఆగమ శాస్త్రానుసారం కావలసిన సమస్త సదుపాయాలు సమకూరుస్తూ; ఆలయ ఆచారాలను కాపాడుతూ శ్రీవారికి వంశపారంపర్యంగా సేవ చేసి తరించిన శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందిన గొప్ప భక్తులే ఈ ఆచార్య పురుషులు.

వారు చాలామంది ఉన్నా, ముఖ్యులైనవారు ఏడుగురు అని బ్రిటిష్ కాలం నాటి "కైంకర్య పట్టీ" ద్వారా తెలుస్తోంది. వారెవరంటే –

1. తోళప్పాచారి – వీరు ఆకాశగంగ ఉద్భవించటానికి కారణ భూతులైన, శ్రీవారి మహాభక్తుడు "తిరుమలనంబి" వంశీయులు. తీర్థ కైంకర్యం, మంత్రపుష్ప కైంకర్యం, వేదపారాయణ కైంకర్యం వీరి విధులు.
2. పురిశై – వీరు శ్రీవారితో ప్రగాఢ అనుబంధం కలిగి వున్న మరో భక్తాగ్రేసరుడు "అనంతాళ్వార్" వంశస్థులు. పుష్పకైంకర్యం మరియు ఉత్సవ సమయాలలో దివ్యప్రబంధగానం వీరి విధులు.
3. భావనాచారి
4. ప్రతివాది భయంకరం ("సుప్రభాత" రచయిత అణ్ణన్ స్వామి వంశీయులు)
5. వీరపల్లి
6. కిడాంబి ధర్మపురి
7. పరవస్తు

వీరందరూ శ్రీవారికి పరంపరానుగతంగా, వివిధ కాలాల్లో, వందల ఏళ్ళుగా పూజలు, నివేదనలు, పుష్పకైంకర్యాలు నిర్వహిస్తూ, శ్రీవారి ఆలయ కైంకర్య సాంప్రదాయాలకు భంగం వాటిల్లకుండా కాపాడుతున్నటువంటి మహనీయులే! ప్రస్తుతం వీరందరూ వివిధ ఉత్సవ సమయాల్లో దివ్య ప్రబంధగానం చేస్తుంటారు.

**సన్నిధిగొల్ల**

శ్రీవారి సన్నిధిలో కైంకర్యాలను నిర్వహించే శ్రీ వైఖానస అర్చకులను వారి నివాసగృహం నుండి జాగ్రత్తగా, సన్నిధికి దారి చూపుతూ, చేతిలో దివిటీ నుంచుకొని శ్రీవారి ఆలయానికి తోడ్కొని రావటం స్వతహాగా "గొల్ల"లైన వీరి ప్రధాన బాధ్యత. ఉదయం సుప్రభాత సేవా సమయంలో మరియు రాత్రి ఏకాంత సేవ సమయంలో వీరి పాత్రను మనం ముందు చెప్పుకున్న "సుప్రభాతసేవ" మరియు "ఏకాంతసేవ" ప్రకరణాలలో వివరించడం జరిగింది.

తిరుమలనంబి, అనంతాళ్వార్, సన్నిధి గొల్లల గురించి మరిన్ని వివరాలు మున్ముందు "శ్రీవారి భక్తాగ్రేసరులు" అనే ప్రకరణంలో సవివరంగా తెలుసుకుందాం.



# అపార జ్ఞాన సంపన్నులు జగద్గురు శంకరాచార్యుడు

– చింతలపాటి శివశంకరశాస్త్రి

**శ్లో|| "విష్ణునామ సహస్ర భాసుర భాష్యకల్పన గీష్పతిం**
**సంశ్రితావళి సర్వసంకట సర్వవారణ గారుడమ్**
**పారమార్థిక సత్య గీర్మధుసారణే పరమం పటుమ్**
**శంకరాంశ జమాది శంకరమాశ్రయామి శుభంకరుమ్"**

వైశాఖ శుద్ధ పంచమి జగద్గురువైన ఆదిశంకరాచార్యుల జయంతి. సకల ప్రపంచానికి ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చిన వేదాంత గురుమూర్తి. శంకరాచార్యులు కారణజన్ములు. కైవల్య రహదారిని తన అక్షర దీప్తితో చూపిన సద్గురువు, కవి, పండితుడు, భాష్యకారుడు, దార్శనికుడు, అద్వైత మత ప్రచారకుడు.

ద్వైతం కానిది అద్వైతం. ద్వైతం అంటే జీవాత్మ పరమాత్మలకు భేదము చెప్పే ఒక మతం. 'బ్రహ్మ సత్యం – జగన్మిథ్య' అన్నది శంకరుల ద్వైతం. అన్నింటిలోనూ తనను, తనలో అన్నింటినీ దర్శించే ఉన్నతిని ప్రసాదించేది అద్వైతం. సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ విజ్ఞానమానందం బ్రహ్మ మొదలైన వేద ప్రామాణిక సూత్రాలతో అద్వైతం రూపు దిద్దుకుంది. జీవుడు – దేవుడు ఒక్కడే. ఆ దైవాన్ని అన్నింటిలోనూ, అందరిలోనూ దర్శించేందుకు జీవునకు మాయ అడ్డుపడుతుంది. మాయా వలయాన్ని ఛేదించడానికి భక్తి, జ్ఞాన, యోగ్య వైరాగ్యాలు మానవునికి సహాయపడతాయి. మనిషి తరించడానికి కావలసినదంతా అద్వైతం చెప్పింది.

జగత్తు అంతటికీ గురువు అయినవాడు జగద్గురువులవుతారు. జ్ఞానులు, అజ్ఞానులు, అర్ధజ్ఞానులు అందరికీ తగినవిధంగా బోధించగలవాడు జగద్గురువు. స్తోత్రాలు, సగుణోపాసనలతో

శం కరులు అజ్ఞానులకు బోధ చేశారు. యజ్ఞ యాగాది కర్మలలో అర్ధజ్ఞానులను, అద్వైత జ్ఞాన ప్రబోధంతో జ్ఞానులను ధర్మాచరణోన్ముఖులను చేసిన ఆదిశంకరులు జగద్గురువులయ్యారు. జ్ఞాన తేజస్సుతో అవైదిక మతాలను ఓడించారు. వైదిక మతాలలోని లోపాలను సవరించి షణ్మత స్థాపన చేశారు. సూర్యుడు వేడిమితో ఉప్పునీరు, మంచినీరు, మురికినీరు, అన్నింటినీ ఆవిరి చేసి మంచినీరుగా మార్చి వర్షించినట్లుగా అద్వైత సిద్ధాంతాన్ని లోకానికి అందించిన జ్ఞాన భాస్కరుడైన శంకరుడు అభ్యాస భాష్యంతోనే ఉత్తర మీమాంసా దర్శనానికి ఆలంబనమైన బ్రహ్మసూత్ర భాష్యాన్ని ప్రారంభించారు.

అలాంటి ఆదిశంకరులు కేరళ రాష్ట్రంలోని పూర్ణానది తీరాన ఉన్న కాలడి గ్రామంలో ఆర్యాంబ, శివగురులకు జన్మించాడు. క్రీ.శ. 788-820 మధ్య ముప్పది రెండు సంవత్సరాలు మాత్రమే జీవించినట్లు తెలుస్తోంది. ఈ చిన్నవయస్సులోనే వారు దాదాపు 272 రచనలు చేసినట్లు తెలుస్తోంది. శంకరాచార్యుల వారిది వశ్య వాక్కు. కవనానికి పూనుకున్నా, విమర్శకు సిద్ధమైనా, భాష్యానికి నడుం కట్టినా, స్తోత్రాలకు చేతులు ముకుళించినా వాణీమాత ఆయనను ఆవేశిస్తుంది. మధురమైన భావాలతో, ముగ్ధమనోహరమైన పదాలు ముందుకు తీసుకువస్తాయి. అనంతం, అపార, అద్వితీయమైన వాఙ్మయాన్ని ప్రపంచానికి అందించారు.

శంకరుల కాలంలోని దుష్టమతాలు సమాజాన్ని విషపూరితం చేశాయి. క్షుద్ర, తాంత్రిక శక్తులు అనైతిక పూజారుల చేతుల్లో ఆలయాలు చిక్కుకుని సమాజాన్ని భ్రష్టు పట్టించాయి. ఎన్నో మతాలు ప్రాదుర్భవించి భారతీయమైన సనాతన ధర్మాన్ని అణగ ద్రొక్కడానికి ప్రయత్నించాయి. అలాంటి విపత్కర పరిస్థితులలో భారతీయ సనాతన ధర్మాన్ని రక్షించడానికి కృత సంకల్పులయ్యారు. వేదవిహిత ఆధ్యాత్మిక జీవన విధానాన్ని పునః ప్రదీప్తం చేశారు. వారు అలా చేయకపోతే ప్రాచీన ఋషులు నెలకొల్పిన సనాతన ధర్మం యొక్క పరిస్థితి ఊహకందేది కాదు. అందుకే ''శంకర శ్శంకర సాక్షాత్'' అనే ఆర్యోక్తి సత్యమైనది.

హైందవ సంస్కృతీ రక్షణకు, ఆధ్యాత్మిక సదాచార సంరక్షణకు, వైదిక సంప్రదాయ శిక్షణకు నిజమైన జ్ఞానాన్ని నియతితో అనుభూతితో అందించడానికి ఆ మహాదేవుని దివ్యతేజం ఆదిశంకరులుగా ఆవిర్భవించడం జరిగింది. ఎనిమిదేళ్ళ వయసు నాటికే శంకరులు అద్భుతాన్ని సృష్టించారు. మాతృమూర్తి ఆర్యాంబ నీటికోసం పడే కష్టం చూడలేక పూర్ణానది దిశను మార్చి తమ ఇంటి గుమ్మం ముందు నుండి ప్రవహించేలా చేశారు.

బ్రహ్మచారిగా వేదాధ్యయనం చేస్తున్న శంకరులు తమ ఐదవ ఏటనే ఒక పేద బ్రాహ్మణ స్త్రీ వెతను గమనించి ఆమె పేదరికాన్ని దూరం చేశారు. ఆశువుగా కనకధారా స్తోత్రాన్ని పాడి శ్రీమహాలక్ష్మి కృప ఆ బ్రాహ్మణిపై ఉండేలా చేశారు.

కాలడి క్షేత్రాధిదేవత శ్రీకృష్ణుడు. తల్లి అనుమతితో సన్యాసాశ్రమము చేపట్టి గ్రామాన్ని వదిలిపెడుతుంటే ''నీ తల్లి కోసం పూర్ణానదిని దారి మళ్ళించేవు. ఇప్పుడా నది నా ఆలయాన్ని ముంచివేస్తోంది. ఇప్పటికే నా అంతరాలయం శిథిలమైపోయి ఒరుగుతోంది. నా సంగతేంటి?'' అని ప్రశ్నించిన కృష్ణునికి నిరాశా భంగము కలుగకుండా, అంగభంగం కలగకుండా, పునః ప్రతిష్ఠ అవసరం లేకుండా లీలగా చేతులతో తీసి భద్ర ప్రాంతానికి జరిపి నిరతిశయ, ఆనంద స్వరూపుడైన కృష్ణునికి ఆనందాన్ని కలిగింపచేశారు.

సన్యాస దీక్ష స్వీకరించి దేశ సంచారానికి వెడుతూ తల్లి అనుమతి కోరగా చివరి అంకంలో ఉన్న తల్లిని విడిచి దేశ సంచారం చేస్తావా? నీకిది న్యాయంగా ఉందా? అని పలుకగా అమ్మా! నువ్వు ఎప్పుడు పిలుస్తావో అప్పుడు వెంటనే వచ్చి నీ కోరిక తీరుస్తాను అని వాగ్దానం చేయగా శంకరులు ఇల్లు వదలడానికి అనుమతి నిచ్చింది. తల్లి అనుమతితో సన్యాసాశ్రమమును స్వీకరించిన శంకరులు తల్లికి నమస్కరించి అక్కడినుండి బయలుదేరి పవిత్రమైన నర్మదానదీ తీరంలో గోవింద భగవత్పాదాచార్యులను కలుసుకున్నారు. భగవత్పాదాచార్యుల వారిపై తనకున్న భక్తిని ప్రదర్శిస్తూ దశశ్లోకితో గురువును సంతోషపెట్టారు. కావేరీనది వరదనీటిని కమండలములో బంధించి భగవత్పాదులను సంతసింపచేశారు.

విద్యలకు నిలయమైన కాశీ పట్టణానికి వెళ్ళి అక్కడి పండితులతో శాస్త్ర చర్చలు, వాదనలు జరిపారు. ఆయన వాక్పటిమకు ముందు ఎవరూ నిలవలేకపోయారు. బ్రహ్మసూత్ర భాష్యాన్ని శిష్యులకు వివరిస్తూ ''తదనంతర ప్రతిపత్తే రం హతి సంవతరష్యక్తః ప్రశ్న నిరూపణాభ్యామ్'' అనే సూత్ర సందర్భంలో వ్యాస పరమాత్మ వృద్ధ బ్రాహ్మణ వేషంలో వచ్చి విన్నాడు. శంకర భాష్యంపై చర్చ లేపాడు. అనేక రోజుల పాటు జరిపిన ఆ శాస్త్ర చర్చను గమనించిన పద్మపాదాచార్యుడు వచ్చినవాడు వ్యాసుడు అని గుర్తించారు. శంకరులు భక్తితో ప్రణమిల్లారు. వ్యాస భగవానుడు సంతుష్టుడై శంకరులతో ''నీ భాష్యాన్ని మెచ్చుకుంటున్నాను. నీ పదహారు సంవత్సరాల ఆయుర్దాయం పూర్తి కావస్తోంది. ఈ భాష్యాన్ని లోకంలో ప్రచారం చెయ్యడం కోసం ఈశ్వరాజ్ఞచే మరో పదహారు సంవత్సరాల ఆయుష్షు లభిస్తుంది'' అని పలికి అంతర్ధానమయ్యారు. వేదవ్యాస మహర్షి ఆదేశంతో అద్వైత సిద్ధాంత వ్యాప్తితో పాటు, అవైదిక మతాల ఖండన కూడా చేశారు.

శంకరుల శిష్యులలో ప్రముఖంగా నలుగురు కనిపిస్తారు.

వారిలో రుద్రాక్షమాలను తలకు చుట్టుకున్నవారు తోటకాచార్యులు. ఆయన రచించిన తోటకాష్టకం గురు తత్వాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. ఆయనకు ప్రక్కన కూర్చున్నవారు హస్తమలకాచార్యులు. హస్త మస్తక సంయోగం చేత శంకరులు ఆయనకు జ్ఞానభిక్ష పెట్టారు. శంకరుని మరో శిష్యుడు పద్మపాదాచార్యులు. నాయనా! సునందా! అని గురువుగారు పిలవగానే కాలికింద అలకనందానది ప్రవహిస్తోందని కూడా గమనించకుండా నడిచి వచ్చాడు. ఆయన అడుగు పెట్టిన చోటల్లా పద్మం మొలిచినందువల్ల ఆయనను పద్మపాదాచార్యుడని అంటారు. శంకరుల అతి మంచితనం వల్ల చిక్కుల్లో పడ్డప్పుడల్లా నృసింహ మంత్రోపాసనతో గురువును కాపాడుకుంటూ వచ్చాడు. నాలుగో శిష్యుడు సురేశ్వరాచార్యులు. వీరికి తల్లి తండ్రి పెట్టిన పేరు మండన మిశ్రుడు. శంకరాచార్యులు భారతదేశానికి నాలుగు దిక్కులలోనూ పీఠాలను నెలకొల్పారు. ఆ నాలుగు పీఠాలలో రెండు దక్షిణ దిక్కున నెలకొల్పారు. వాటిలో శృంగేరి పీఠానికి తొలి పీఠాధిపతి సురేశ్వరాచార్యులే. కంచి పీఠానికి కూడా నిర్వహణ బాధ్యతలను కూడా సురేశ్వరులే నిర్వహించారు.

"జంతూనాం నర జన్మ దుర్లభమ్" అని వివేక చూడామణిలో ఆదిశంకరులు నరజన్మ విశిష్టతను స్పష్టంగా చెప్పారు. దుర్లభమైన నరజన్మను పొందిన తర్వాత దానిని ఎలా సార్థకం చేసుకోవాలో మానవజాతికి తెలియజేయడానికి శంకరులు కవిగా అనేక రచనలు చేశారు. శంకరులు కాశీ క్షేత్రము నందు తన శిష్యులతో సంచరించు సమయంలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు "డుకృఞ్ కరణే" అని వ్యాకరణ సూత్రాలు వల్లె వేస్తుండడం దర్శించి అంతనితో "అజ్ఞానీ యముడు సమీపించువేళ నీ వ్యాకరణ సూత్రాలు నిన్ను రక్షించవు. గోవిందుని భజించు" అని పెక్కు శ్లోకాలతో హెచ్చరించారు. అవే భజగోవింద శ్లోకాలు – తత్వోపదేశాలు. ఎన్ని వేదాలు, శాస్త్రాలు చదివినా, మహాపండితుడైనా మరణం తప్పదని తెలుసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ చదువులు ఏవీ అప్పుడు రక్షించలేవు. భగవన్నామ స్మరణే కాపాడుతుంది. అదే ముమ్మాటికీ సత్యం అని తెలియజేశాడు.

శ్రీ శంకరాచార్యులు లెక్కకు మిక్కిలిగా రచనలు చేసినా, దేనికదే ప్రత్యేకం, ప్రామాణికం సంతరించుకొని ఉంటాయి. శంకరుని రచనలలో ప్రముఖ స్థానం ఆక్రమించిన 58 ప్రకరణ గ్రంథాల్లో అద్వైత పంచకం, ధ్యానాష్టకం, గురు అష్టకం, యతి పంచకం, మనీషా పంచకం, సాధనా పంచకం, వివేక చూడామణి ప్రముఖమైనవి.

స్తోత్ర సాహిత్యంలో కనకధారా స్తోత్రం, నర్మదాష్టకం, గంగాస్తవం, ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రం, సుబ్రహ్మణ్య భుజంగ ప్రయాత నుంచి ఉద్భవించిన స్రవంతులు. సౌందర్యలహరి సాక్షాత్తు శంకరుడు అంబికను స్తుతించి రాసినది. శ్రీ శంకర భగవత్పాదులకు ప్రసాదంగా ఇవ్వగా అందులో సగం నంది తస్కరించాడని, అంబిక కోరిక మేరకు ఆ భాగ్యాన్ని వెలువరించారని విజ్ఞులు చెపుతారు. ఇవి సంగీత సాహిత్య సమ్మేళనం – భక్తి – ముక్తి – రక్తి కలగాపులగంగా రూపొందించిన దివ్యస్తోత్రం.

సౌందర్యలహరి అంబికకు – భక్తులకు మధ్య అద్వైత భావనను ప్రకటిస్తే, శివానంద లహరి శివభావనామృత దృష్టితో భక్తుని హృదయం తడిసి ముద్దవుతుంది. ఆనందలహరి అత్యంతానంద సుఖ శాంతులను ప్రసాదిస్తుంది. శంకరులు అద్వైత జ్యోతి. అర్థ శ్లోకంతో అద్వైత సిద్ధాంతాన్ని సూత్రీకరించిన ప్రజ్ఞాన ఘనుడు. ఆయన సమన్వయ దృష్టి, వ్యవహార నైపుణ్యం, భావుకత, భావనా పటిమ, ఆత్మీయత పరమాద్భుతం. శంకరుని అద్వైతసిద్ధిని ప్రతిక్షణం ఆచరణలో పెట్టి నిరంతర సాధన చేయాలి. అప్పుడు దేవ, ఋషి, పితృ ఋణాలు తీరిపోతాయి.

వ్యాఖ్యాకారునిగా శంకరుని ప్రతిభ అనన్య సామాన్యమైనది. ఆయన వ్యాఖ్యాన గ్రంథాలైన విష్ణు సహస్రనామభాష్యం, లలితా త్రిశతిభాష్యం, యోగసూత్రభాష్యం, భగవద్గీతభాష్యం అనంతర కాలంలో ఇతర దార్శనికులు వ్యాఖ్యానాలు చేయడానికి ఆధార భూతాలైనాయి.

ఆయన అవతార పరిసమాప్తికి ముందు శిష్యులు బరువెక్కిన హృదయాలతో – "మీరైతే అవగాహన చేసుకొని, ఆచరణలో వాటిని అన్వయించుకున్నారు. మరి మాలాంటి వారి పరిస్థితి ఏమిటి? అని ఒక ప్రశ్న అడిగారు. శిష్యులు ప్రశ్న సాకుతో శంకరులు మనందరికీ "ఉపదేశ పంచకం" అనుపేర ఉపదేశం చేశారు. తాను వచ్చిన పని కాగానే హిమాలయాలలో ప్రస్తుత ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కేదారనాథ్ మంచుకొండల్లో అదృశ్యమయ్యాడు.



**"గురు పుంగవ పుంగవ కేతనతే**
**సమతా మయతాం నహి కోపి సుధీః**
**శరణాగత వత్సల తత్త్వనిధే**
**భవశంకర దేశిక మే శరణం"**



# అమరనీతి నయనార్

– మందరపు వి.జి.శంకరాచారి

భగవంతుడికి సేవ చేయడమంటే తను నమ్మిన ఇష్టదైవం యొక్క మహిమలను తన జీవితంలో జరిగిన అనుభవాలను మ రియొకరికి తెలియజేసి వారిని భగవంతుడికి దగ్గరగా చేయడమే. ఇదియే ఈ కలియుగంలో భగవంతునికి చేసే గొప్పదైన సేవ. ఆ విధంగా నిష్కల్మషంగా భగవంతుడికి సేవ చేస్తున్నా, ఆ సేవను వక్రీకరించి, విమర్శించేవారు ఈ సమాజంలో కో కొల్లలుగా ఉంటారు. అటువంటి వారికి తన భక్తుడి యొక్క నిష్కల్మషమైన సేవను లోక ప్రసిద్ధం చేయుటకు సాక్షాత్తు పరమాత్ముడే దివినుండి భువికి దిగి వస్తాడు. ఆ విధంగా ఈ పుడమిపై కాలుని మోపి తన భక్తుడి యొక్క సేవాభావాన్ని, సేవా తత్పరతని లోకవిదితం చేసిన సంఘటన అమరనీతి నయనార్ జీవితంలో జరిగింది. గొప్ప భగవత్సేవకుడైన అతడి గురించి...

క్రీ.శ. 6వ శతాబ్దంలో తమిళనాడు రాష్ట్రంలోని చోళా రాజ్యంలో, చోళా రాజకీయ రాజధానిగా 'పళైయార్' అనే పట్టణం ఉండేది. ఈ పట్టణం వ్యాపారానికి బాగా ప్రసిద్ధి చెందింది. ఈ పట్టణంలో అమరనీతియార్ (నయనార్) అనే ఒక నిజాయితీ గల వ్యాపారస్థుడు ఉండేవాడు.

అమరనీతియార్ బహుముఖ వ్యాపారి. అన్ని రకముల వ్యాపారములు చేస్తూ ఉండెడివాడు. వజ్రాల వ్యాపారంతో పాటు బట్టల వ్యాపారములు మరియు ఇతర వ్యాపారములు కూడా చేసెడివాడు. ఇతడు ఎన్ని రకముల వ్యాపారములు చేసినా నిజాయితీగా, ధర్మబద్ధంగా వ్యాపారం చేసెడివాడు. అన్యాయంగా ఎవరిదగ్గరా డబ్బులు వసూలు చేసెడివాడు కాడు. న్యాయబద్ధమైన అతడి వ్యాపారం నిరంతరాయంగా సాగుతుండెడిది.

అయితే ఈ అమరనీతి నయనార్ గొప్ప శివభక్తుడు. ప్రతిరోజూ శివాలయానికి వెళ్ళి అర్చన చేసేవాడు. అక్కడ ధ్యాన నిమగ్నుడై సమాధి స్థితి లోనికి వెళ్ళిపోయి శివుడితో తాదాత్మ్యం చెందేవాడు.

తదనంతరం ఇంటికి వచ్చి చేయవలసిన కార్యక్రమములు నిర్వహించి వ్యాపారస్థలికి వెళ్ళిపోయేవాడు.

అతడు ఏ పని చేస్తున్నా పంచాక్షరీ మంత్రాన్ని మనసులో మననం చేసుకుంటూ ప్రతి కార్యమూ నిర్వహించేవాడు. అందుకే అతడికి అన్నింటా విజయం చేకూరేది. వ్యాపారంలో లాభాలు అమితంగావస్తూ ఉండేవి. ధనపురాశిలో మునిగిపోయినా ఏనాడూ తన యొక్క శివభక్తిని వదిలేవాడు కాదు. పైపెచ్చు ఆ ఊరిలో గల శివాలయాలన్నింటికీ ప్రతి ఏడాదీ రంగు వేయిస్తూ తగిన మార్పులు చేయిస్తూ సుందరంగా శివాలయాలను తీర్చి దిద్దేవాడు.

కార్తీక మాసంలోను, శివరాత్రి సమయంలోను శివాలయానికి భక్తులు అశేషంగా తరలి వచ్చేవారు. వచ్చిన వారందరికీ వసతి, భోజన సదుపాయములు కల్పించేవాడు. అంతేకాదు శివభక్తులందరికీ వస్త్రదానం చేసేవాడు.

వ్యాపారంలో గడించిన డబ్బులన్నీ శివభక్తుల సేవకే ఉపయోగించేవాడు. అంతేగానీ తనకుగా తనెప్పుడూ తనకోసం ఆ ధనాన్ని వినియోగించెడివాడు కాదు.

ఈవిధంగా అమరనీతియార్ నిస్వార్థమైన సేవ చేస్తూ జీవనం గడుపుతూ ఉన్నా ప్రజలు మాత్రం అతణ్ణి విమర్శించేవారు.

వ్యాపారంలో అన్యాయంగా సంపాదించిన సొమ్మునంతా దానం చేసి తను చేసిన పాపాలన్నీ క్షయం చేసుకోవాలనుకుంటున్నాడు. అంతే తప్ప శివుడి మీద భక్తితోను, భక్తులకు సేవ చేయాలన్న సద్భావంతోనూ చేయడంలేదు అనేవారు.

తనపైన ప్రజలు చేస్తున్న విమర్శలు విన్నాసరే అమరనీతియార్ ప్రజలపై ఏనాడూ వ్యతిరేక భావంతో ఉండేవాడు కాదు. తనపని తాను చేసుకుని పోయేవాడు.

పర్వదినాల్లో అన్నీ తానై ఖర్చుపెట్టేవాడు.

ఒకసారి ఆ పట్టణంలో మూడు నేత్రాల పండుగ జాతర జరగబోతోంది. ఈ పండుగ ప్రత్యేకంగా శివుడి ఆరాధనకు సంబంధించింది. ఈ జాతరని అక్కడి పట్టణ ప్రజలు సంతోషానందాతిశయములతో గొప్పగా నిర్వహించేవారు. ఈ జాతరకి ప్రజలు వేల సంఖ్యలో వచ్చి శివాలయాలను దర్శించి స్వామివారికి తమకు తోచినవి సమర్పించి తమ కోర్కెలను విన్నవించి వెళ్ళిపోయేవారు. ఈవిధంగా జాతరకు వచ్చిన ప్రజలందరినీ (ముఖ్యంగా శివభక్తులు.. ఎవరైతే పాము గుర్తుగా గల ఉంగరాన్ని ధరిస్తారో వారిని) అమరనీతియార్ తన ఇంటికి ఆహ్వానించి భోజన వసతి సదుపాయములు కల్పించి పిమ్మట వారికి ఇవ్వాలనుకున్న వస్త్రములను ధనమును సమర్పించుకుని వారిని సంతృప్తికరముగా పంపెడివాడు.

అయితే తృప్తిలేని కొంతమంది ప్రజలు అమరనీతియార్ ఇచ్చిన వాటిని స్వీకరించి తర్వాత అతడిని విమర్శించేవారు. ఈ విధంగా భక్తులకు నిస్వార్థంగా సేవ చేస్తూ భగవంతుడి సేవలో మైమరచిపోతున్న అమరనీతియార్ యొక్క సేవాభక్తిని... ప్రజలందరికీ తెలియజేయాలని పరమశివుడు సంకల్పించుతాడు.

పర్యవసానంగా ఆ ఏడాది తిరునల్లూరులో మూడు కన్నుల స్వామివారి ఉత్సవం జరగబోతోంది. శివుణ్ణి దర్శించుకోవడానికి వచ్చిన భక్తులందరికీ వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసి తదనంతరం సంబారాలను భక్తులకు సమర్పించుకోవడానికి సిద్ధపడియున్నాడు అమరనీతి నయనార్. శివభక్తుల సేవలో తన జీవితాన్ని ధన్యం చేసుకుంటున్నాడు. అయితే అతడిపైన ప్రజలలో కళంకితుడైన శివుడి సేవకుడిగా ముద్రపడి యున్న ఆ భావాన్ని తొలగించడానికి పరమశివుడు కౌపీనం ధరించి బ్రహ్మచారి వేషంలో అమరనీతి నయనార్ దగ్గరకు వచ్చాడు.

బ్రహ్మచారి వేషంలో వచ్చిన పరమశివుడు అమరనీతియార్ ని కలిసి 'తానొక పనిమీద ఈ ఊరు వచ్చానని.. ఇక్కడ జరుగుతున్న జాతర మాహాత్మ్యమును వీక్షించి వెళ్ళిపోదామని వచ్చానని, తను పరమశివుడి భక్తుడినని అమరనీతి నయనార్ తో చెబుతాడు.

అనుకోకుండా అతిథి ఈశ్వరుడితో సమానంగా భావించిన అమరనీతి నయనార్ తనయొక్క ఆతిథ్యాన్ని స్వీకరించమని అడుగుతాడు. అందుకు బ్రహ్మచారి... ''అమరనీతియార్ నీవు భగవద్భక్తులకు చేయుచున్న సేవ అపారం. నీ బోధ వలన సేవల వలన ఎంతోమంది శివభక్తులుగా మారారు. నీ సేవకు పరమశివుడు సంతసిస్తాడు. అందరివలె నేను కూడా నీ ఆతిథ్యాన్ని స్వీకరిస్తాను'' అనగానే అమరనీతి నయనార్ సంతోషంతో ''స్వామీ! మీరు మా ఆతిథ్యం స్వీకరిస్తాననడం మాకెంతో ఆనంద దాయకం. మీ ఆశీస్సులు మాకు ఎప్పుడూ ఉండాలి'' అంటాడు.

అయితే బ్రహ్మచారి కావేరీ నదిలో స్నానమాచరించి వస్తానని చెబుతాడు. అప్పుడు వర్షం కురుస్తుండడంతో బ్రహ్మచారి తన నడుముకు స్నానమాచరించి ధరించవలసిన పొడి కౌపీన వస్త్రాన్ని అమరనీతియార్ దగ్గర దాచమని చెబుతాడు. ఎందుకంటే వర్షం పడుతూ ఉండడం వలన ఆ పొడి కౌపీన వస్త్రం తడిచి పోతుందని ఉంచమంటాడు. అంతేకాదు అది చాలా మహిమగలదని... విలువైనదని కూడా చెబుతాడు.

బ్రహ్మచారి తన పొడి కౌపీన వస్త్రాన్ని అమరనీతి నయనార్ కిచ్చి వర్షం పడుతున్నా సరే స్నానం చేయడానికని కావేరీ నదికి వెళ్తాడు. అతడి దగ్గర నుండి తీసుకున్న పొడి కౌపీన వస్త్రాన్ని చాలా జాగ్రత్తగా భద్రపరుస్తాడు అమరనీతియార్.

కొంతసేపయిన తరువాత బ్రహ్మచారి తడిసిన కౌపీనంతో అమరనీతి నయనార్ దగ్గరకు వస్తాడు. తన యొక్క పొడి కౌపీన వస్త్రాన్ని ఇవ్వమని అడుగుతాడు. బ్రహ్మచారి కౌపీన వస్త్రాన్ని అతడికి ఇవ్వడానికి అమరనీతి నయనార్ దానిని భద్రపరచిన

స్థలమునకు వెళ్ళి చూస్తాడు. అయితే అక్కడ తాను దాచి ఉంచిన వస్త్రం కనబడకపోయేసరికి ఆదుర్దా చెందుతాడు. ఈ విషయాన్ని బ్రహ్మచారికి బాధపడుతూ తెలియపరచుతాడు.

ఈ విషయం విన్న బ్రహ్మచారి కోపోద్రిక్తుడై ''నేను స్నానం చేయడానికి వెళ్తున్నప్పుడు నా నడుము గుడ్డ (కౌపీనం) ఎంతో విలువ గలదని, తగిన రీతిలో జాగ్రత్త పరచమని చెప్పాను గదా. ఆ నడుము గుడ్డ మహిమ గలదని తెలిసినందున దానిని దొంగిలించి లేదని చెబుతున్నావా?'' అంటాడు.

''లేదు స్వామీ! నేను దొంగిలించలేదు. జాగ్రత్తగా భద్రపరిచాను. కానీ మాయమై పోయింది. నేను అబద్ధమాడుట లేదు. సత్యమే పలుకుతున్నాను. ఎలా మాయమైపోయిందో, ఎవరు దొంగిలించారో అర్థం కావడం లేదు. మరియొక వస్త్రమును ఇస్తాను. తమరు నన్ను మన్నించి దానిని ధరించి మా ఆతిథ్యము స్వీకరించండి'' అంటాడు అమరనీతియార్.

కానీ బ్రహ్మచారి అందుకు ఒప్పుకోడు. అతడిని శతవిధాల బ్రతిమలాడుతాడు అమరనీతినయనార్. అప్పుడు ఒక నిర్ణయానికి వస్తాడు బ్రహ్మచారి. ''చూడు అమరనీతి యార్, నీ దగ్గర పోయిన నా కౌపీనం ఎలాగూ రాదు. అయితే నేను ధరించిన ఈ కౌపీన వస్త్రాన్ని నీకిస్తాను. దీనితో సరితూగే వస్త్రాన్ని నాకిచ్చినచో నేను సంతృప్తి పడి వెళ్ళిపోతాను. అంతవరకు తాత్కాలికంగాఒక తెల్లవస్త్రాన్ని కౌపీనంగా ధరించి నేను ధరించిన ఈ తడి కౌపీన వస్త్రాన్ని తూచడానికి ఒక త్రాసుని తెప్పించు. అప్పుడు దీనితో సమానమైనది, దీనిని తూచగలిగింది అయినటువంటి వస్త్రాలను, లేక ధనరాశిని నేను తీసుకుంటాను'' అంటాడు.

ఆ షరతుకి ఒప్పుకున్న అమరనీతి నయనార్ ఒక త్రాసుని తెప్పిస్తాడు. ఈ వింతను చూడటానికి ప్రజలందరూ వెల్లువలా అమరనీతి నయనార్ ఇంటికి వస్తారు.

అందరూ చూస్తుండగానే బ్రహ్మచారి తన కౌపీనాన్ని త్రాసులో వేస్తాడు. చిత్రం. ఆ వస్త్రం బరువుకి త్రాసు పూర్తిగా వంగుతుంది. ఈ వింతను చూసిన ప్రజలు ఆశ్చర్యపోతారు. ఆ తేలికపాటి కౌపీన వస్త్రం అంత బరువుగా గల వస్త్రంగా ఎలా మారిందోనని అచ్చెరువొందుతారు.

బ్రహ్మచారి అక్కడ నిలబడి యుంటాడు. అమరనీతియార్ కౌపీన వస్త్రములను కొన్నింటిని తెప్పించి బ్రహ్మచారి తడి కౌపీన వస్త్రంతో సరితూచడానికి గాను తక్కెడలో వేస్తాడు. కానీ తక్కెడ సమానము కాదు. వెంటనే తన ఇంటిలో గల వస్త్రాలను, ఆభరణాలను తెప్పించి తక్కెడలో వేయిస్తారు. అయినా తక్కెడ సమము కాదు. ఈ వింతను ప్రజలందరూ అచ్చెరువుతో తిలకిస్తూ ఉంటారు.

అమరనీతి నయనార్ తన దగ్గర ఉన్న సంపదనంతా తక్కెడలో పెట్టినా బ్రహ్మచారి కౌపీన వస్త్రంతో సరితూగక పోవడంతో ఇక మిగిలింది తను, తన భార్య, పిల్లలు మాత్రమే కాబట్టి అమరనీతి నయనార్ బ్రహ్మచారితో ఇలా అంటాడు.

''స్వామీ! నా దగ్గర యున్న సంపదనంతా వేసినా అది మీ కౌపీన వస్త్రంతో సరితూగలేకపోయింది. ఇక మిగిలింది నేను, నా భార్య, మూడేళ్ళ కుమారుడు. కాబట్టి ఆఖరి అవకాశంగా నేను నా కుటుంబ సభ్యులతో కలసి తక్కెడలో ఒకవైపు నిలబడతాను. అప్పుడు కనుక తక్కెడ సరితూగినచో నేను, నా కుటుంబ సభ్యులు మీకు దాసులుగా మారిపోతాము. మీ వెంట వచ్చి మీకు సేవ చేసుకుంటాము. ఇందుకు మీరు అంగీకరిస్తారా?'' అని అడుగుతాడు.

అందుకు కౌపీనధారి బ్రహ్మచారి సరేనంటాడు. అప్పుడు అమరనీతి నయనార్ మరియు అతడి కుటుంబ సభ్యులు తక్కెడలో ఉన్న బ్రహ్మచారి తడి కౌపీన వస్త్రం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఈవిధంగా ప్రార్థన చేస్తాడు.

''పరమశివా! నేను, నా భార్య, కుమారుడు నీ పట్ల, నీ భక్తుల పట్ల మాకున్న ప్రేమ, చేస్తున్న, చేసిన సేవ దోషం లేనిదైతే, నిష్కలంక భక్తుడను అయితే ఈ త్రాసులో ఉన్న బ్రహ్మచారి కౌపీన వస్త్రంతో మా బరువు సమతూగుగాక'' అంటూ పంచాక్షరీ మంత్రాన్ని మూడుసార్లు జపిస్తాడు. అంతే.. త్రాసు వెంటనే సమమౌతుంది.

ప్రజలందరూ ఈ వింతను చూసి ఆశ్చర్యపోతారు. అక్కడ కౌపీన వస్త్రధారి రూపంలో వచ్చిన బ్రహ్మచారి మరి కనబడడు. అందరూ అతడి గురించి వెదకడం ప్రారంభిస్తారు. అప్పుడు ఈ మాటలు అందరికీ ఒక్కమారుగా వినిపిస్తాయి.

''భక్తులారా! కౌపీనధారినై వచ్చినది, అమరనీతియార్ కి పరీక్ష పెట్టినది నేను. నా భక్తుడైన అమరనీతియార్ చేస్తున్న భగవత్సేవను ప్రజలందరూ నిందిస్తున్నారు. అది విని నేను భరించలేక నా భక్తుడియొక్క నిజాయితీని, సేవాతత్పరతని మీకందరికీ తెలియజేయడానికి కౌపీన ధారినై వచ్చాను.

నన్ను చేరుకోవడానికి సంపద ముఖ్యం కాదు. నిష్కలంకమైన భక్తి మరియు సేవ. ఇది మాత్రమే భక్తుణ్ణి నా దగ్గరకు చేరుస్తుంది. అమరనీతి నయనార్ నిష్కలంక భక్తుడు మరియు భగవత్సేవకుడు. కాబట్టి నా కౌపీన వస్త్రంతో సరితూగగలిగాడు. ప్రజలారా ఇకనైనా మీరంతా నా భక్తుడి సేవను గుర్తించండి. పరమభక్తుడని, భాగవతోత్తముడని గ్రహించండి'' అని ఆకాశవాణి మాటలు విన్న ప్రజలందరూ అమరనీతి నయనార్ కాళ్ళపై పడి క్షమించమని కోరతారు.

తదనంతరం అమరనీతి నయనార్ ఈశ్వరసేవలో జీవితాన్ని గడిపి శివసాయుజ్యాన్ని పొందుతాడు.

ఈ కథలోని నీతి ఏమిటంటే భౌతిక సంపదకన్నా భగవంతుడి దగ్గరకు చేరుకోవడమే గొప్ప సంపద.

# శనైశ్చరా నమోస్తుతే

– చిల్లర సీతారామారావు

**గ్రహము అను శబ్దమునకు గ్రహించుట, అనుగ్రహము, ఆగ్రహము అను అర్థములున్నాయి. విపులమైన ఆకారము కలిగి, గతి కలిగినవి గ్రహములు. తమ గతి చేత నక్షత్రములను గ్రహించునవి కనుక వీటిని గ్రహములు అంటారు. మానవుడు ఎంతటి శక్తి సంపన్నుడు అయినప్పటికీ గ్రహముల ప్రభావమునకు మోకరిల్లవలసినదే. మానవ జీవితము సుఖముగా సాగిపోవుటకు గాని, దుఃఖమయము కావడానికి గాని గ్రహములే కారణము. కనుక గ్రహములకు ప్రీతిని కలిగించు స్తోత్రములను చదువుట, దానములు చేయుట మున్నగు వాటి ద్వారా గ్రహములు కరుణించి తమ కృపా కటాక్ష వీక్షణములను ప్రసరింప చేయగలవు.**



శ్లో ॥ "ఆదిత్యాయచ సోమాయ మంగళాయ బుధాయచ
గురుశుక్ర శనిభ్యశ్చ రాహవే కేతవే నమః"

సూర్యుడు, చంద్రుడు, అంగారకుడు, బుధుడు, బృహస్పతి, శుక్రుడు, శనీశ్వరుడు, రాహువు, కేతువు అని గ్రహములు తొమ్మిది. వీటిని నవగ్రహములు అని పిలుస్తారు. నవగ్రహములలో ఏడవ గ్రహము శనీశ్వరుడు. క్లుప్తముగా ఇతడిని 'శని' అని పిలుస్తారు. ఇతడు క్రూరుడు, బలసంపన్నుడు. ఒకే స్థానమున అధిక కాలము ఉండుట వలన మానవులను, దేవతలను హింసించడంలో ఇతనికి ఇతనే సాటి.

శ్లో ॥ "నీలాంజన సమాభాసం రవిపుత్రం యమాగ్రజం
ఛాయా మార్తాండ సంభూతం తం నమామి శనైశ్చరం"

నల్లని కాటుక వంటి మేని ఛాయ కలవాడు, సూర్యపుత్రుడు, యమునికి అన్నగారు, సూర్యునికి, ఛాయాదేవికి పుట్టినవాడు అగు శనైశ్చరునకు ప్రణామము.

కలియుగమున శనైశ్చరుని ప్రభావము అధికముగా ఉంటుందని జైమిని మహర్షి పేర్కొన్నాడు. శని దృష్టి మహా వినాశనాన్ని కలిగిస్తుంది. ఆయనకు అనుగ్రహం కలిగితే ప్రపంచంలో లభించనిది అంటూ ఏదీ ఉండదు. జ్యోతిశ్శాస్త్రంలో తమోగుణ ప్రధానుడైన శనైశ్చరుడు దుఃఖ కారకుడిగా చెప్పబడ్డాడు. కాని అందరూ భావిస్తున్నట్లు శనైశ్చరుడు దుష్టగ్రహము కాదు. మానవులు దుఃఖములు అనుభవించడానికి మూల కారణము వారు చేసుకున్న కర్మలు. శనైశ్చరుడు

పక్షపాతం లేకుండా మానవుల దుష్కర్మల ననుసరించి వారికి శిక్ష పడేటట్లు చేస్తాడు. దుష్కర్మలకు తగిన ఫలమునిచ్చు అధికారము శనైశ్వరుడికి శివుడు ప్రసాదించాడు. అందువల్ల శనైశ్చరుడు దండనాధికారిగా, న్యాయాధిపతిగా శిక్షలను అమలు పరుస్తున్నాడు.

ఛాయాదేవికి, సూర్యునికి పుట్టినవాడు శనైశ్చరుడు. ఇతడు కశ్యప గోత్రానికి చెందినవాడు. ఇతని గురువు అగస్త్యుడు. పశ్చిమ దిక్కుకు అధిపతి. ఇతని వాహనము గ్రద్ద. నల్లని వస్తువులు ఇతనికి ఇష్టము. ఎముకలు, నరములు వీటికి సంబంధించిన వ్యాధులను కలిగిస్తాడు. ఇతనికి ఇష్టమైన రంగు నీలం. రథము లోహ నిర్మితము. నల్లని వన్నెగల ఎనిమిది అశ్వములు రథమును నడిపిస్తుంటాయి. ఇతడు తన తపోబలము చేత గ్రహ పదత్వాన్ని దక్కించుకున్నాడు. 'ఆయుష్యం జీవనోపాయం మరణంచ శనైశ్వరః'. ఆయుష్యము, జీవనోపాయము, మరణము ఈ మూడింటికీ శనైశ్చరుడు కారకుడు. ఇతడు నపుంసకుడు. తామసబుద్ధి. క్రూరదృష్టి. గ్రహములలో వృద్ధుడు శనైశ్చరుడు. శనైశ్చరునిది పాపపు స్వభావము. అందువలన కీర్తి ప్రతిష్ఠలు లభించలేదు. అవమానములను, దుఃఖములను అనుభవించిన శనైశ్చరుడు శివుడిని ఆరాధించాడు. శివుడు ప్రసన్నుడై పేరు ప్రతిష్ఠలు కలిగి, ప్రసిద్ధి చెందగలవని వరమును ప్రసాదించాడు.

జన సామాన్యములో శనైశ్చరుడి గురించి భ్రమ, భ్రాంతి బాగా వ్యాప్తి చెందాయి. శనైశ్చరుడు జాలి, దయ లేని క్రూరుడు. ఏలినాటి శని, అష్టమశని, అర్ధాష్టమశని మున్నగు పేర్లతో ప్రజలను బాధిస్తాడు. కనుక శనైశ్చరుడు దుష్టగ్రహము అని ఖ్యాతి గడించాడు. వాస్తవానికి శనైశ్చరుడు క్రూరుడు కాదు. తన దశలో జాతకుని మనసును భగవంతుని వైపు మరల్చి భక్తి విశ్వాసాలను కలిగిస్తాడు. నిష్కారణంగా ఎవ్వరినీ బాధించడు. పుణ్యకర్మలొనరించిన వారిని సుఖపెడతాడు. పాపకర్మలు చేసినవారిని బాధలు పెడతాడు. శనైశ్చరునికి రెండు దశలు ఉన్నాయి. ఒకటి శుభదశ. రెండవది అశుభదశ. శుభదశలో శనైశ్చరుడి ప్రభావం వల్ల జాతకునికి పదవి, అధికారం, గౌరవం లభిస్తాయి. జాతకుడు బుద్ధిమంతుడు, వినయశీలి, దానశీలి అవుతాడు. అశుభదశలో ఆలస్యము, నిద్ర, కఫము, వాతము, పైత్యము వల్ల కలిగే రోగాలు, చర్మరోగాలు, పరుల వల్ల కష్టాలు కలుగుతాయి. లోకమంతా దుఃఖమయంగా సారహీనంగా కనిపిస్తుంది. శనైశ్చరుడి ప్రతాపానికి భయభీతులై లోకులు శనైశ్చరునకు ఇష్టమైన నల్లనువ్వులు దానం చేస్తారు. నువ్వులనూనెతో అభిషేకం చేస్తారు. నల్లని ఆవును పూజిస్తారు. ఇలా చేయడం వల్ల దోషాలన్నీ తొలగిపోతాయి. శనైశ్వరుడి కృపకు పాత్రులవుతారు. ప్రతిరోజు సాయంత్రం పశ్చిమదిక్కుకు ఎదురుగా నిల్చుని, చేతులు జోడించి క్రింద పేర్కొన్న శ్లోకమును ఏడుమార్లు గాని, ఇరవై ఒక్కమార్లు గాని పఠించాలి.

**శ్లో ॥ "సూర్యపుత్రో దీర్ఘదేహో విశాలాక్షః శివప్రియః**
**మందచారః ప్రసన్నాత్మాపీడాం దహతుమే శనిః"**

సూర్యపుత్రుడు, పొడుగాటి దేహము కలవాడు, శివప్రియుడు, మందగమనుడు, ప్రసన్నచిత్తుడు అయిన శనైశ్చరుడు నా పీడను దహించు గాక.

శనైశ్చరుడికి ఇష్టమైన వారం శనివారం. ఆరోజు శనైశ్చరుడిని దర్శించుకోవాలి. ఆరోజు ఉపవాసం ఉండాలి. ఉప్పు లేని భోజనం చేయాలి. సాయం సమయంలో నువ్వుల నూనెతో దీపాలు వెలిగించాలి. అసత్యం చెప్పకూడదు. మద్యము, మాంసం తీసుకోకూడదు. శనివారం రోజున నువ్వులనూనెతో శనైశ్చరునకు అభిషేకం చేయాలి. శనైశ్చరుడి దోషం నుండి నివారించగలిగిన శక్తి నువ్వులనూనెకు ఉంది. ఏలినాటి శని దోషాలు తొలగిపోవడానికి పిప్పలాద మహర్షి ఒక శ్లోకము తెలియజేశాడు. తీరిక సమయంలో ఆ శ్లోకం స్మరిస్తూ ఉంటే కీడు తొలగిపోయి శుభములు కలుగుతాయి. ఆ శ్లోకము ఇది –

**శ్లో ॥ "కోణోమన్దశ్శనిః కృష్ణస్సూర్యపుత్రో యమశ్చసః**
**పంగుశ్శనైశ్చర స్సౌరిః కాలశ్ఛాయా సుతశ్చః"**

కోణుడు, మందుడు, శని, కృష్ణుడు, సూర్యపుత్రుడు, యముడు, పంగుడు, శనైశ్చరుడు, సౌరి, కాలుడు, ఛాయాసుతుడు అని పది ముఖ్యమైన పేర్లు కలవాడు శనైశ్చరుడు. ఇతనికి సంబంధించిన కథలు – గాథలు పురాణాలలో వర్ణించబడినాయి.

శనైశ్చరుడు కుంటివాడు. దీనికి సంబంధించిన కథ ఒకటి ఇలా ఉంది. ఒకనాడు పార్వతీదేవి తన తనయుని జన్మోత్సవమునకు దేవతలు మహర్షులు మున్నగు వారందరికీ ఆహ్వానం పంపింది. ఆహ్వానం అందుకున్న శనైశ్చరుడు కైలాసానికి బయల్దేరి వచ్చాడు. ప్రముఖులందరికీ వందనమాచరించి ఒకమూల తల వంచుకుని నిలబడ్డాడు. అది గమనించిన పార్వతీదేవి – శనైశ్చరుడిని తల వంచుకుని ఎందుకు నిలబడ్డావు? అని అడిగింది. శనైశ్చరుడు జవాబిస్తూ కారణమును వివరించాడు. మా పితృపాదులు నాకు చిత్రరథుడు కూతురునిచ్చి వివాహం గావించారు. ఒకరోజు ఆవిడ అందంగా అలంకరించుకొని నా దగ్గరకు వచ్చింది. మద మోహితురాలై నావైపు నవ్వుతూ చూచింది. భగవద్ధ్యానములో ఉన్న నేను ఆమెను గమనించలేదు. దానితో ఆమె ఆగ్రహానికి లోనైంది. ఆ ఆగ్రహంతో 'నా దృష్టి పడిన ప్రతి వస్తువు నశిస్తుంది' అని ఆమె నాకు శాపమునిచ్చింది. ఆ శాప కారణము చేత నేను తలవంచుకునే నిలబడతాను. నా కంటితో నేను ఏ వస్తువునూ చూడను అని పలికి మౌనంగా తల వంచుకొని నిలబడ్డాడు. శనైశ్చరుని మాటలకు అందరూ నవ్వుకున్నారు. పార్వతీదేవి శనైశ్చరుడితో – జన్మోత్సవమునకు వచ్చి నా తనయుడిని చూడకుండా వెళతావా? నీకు ఏమీ కాదు.

నేను చెబుతాను కదా! నా తనయుడిని ఒకసారి తల పైకెత్తి చూడు అని పలికింది. శనైశ్చరుడికి ఏమి చేయాలో అర్థం కాలేదు. కానున్నది కాక మానదు అని భావించి తల పైకెత్తి పార్వతీదేవి తనయుడిని చూచాడు. చూచీ చూడగానే ఆ బాలుడి తల తెగిపోయింది. దానిని చూచి పార్వతీదేవి రోదించసాగింది. శివుడు ఉత్తర దిక్కున నిద్రిస్తున్న ఒక గజము తల తెచ్చి ఆ బాలుడి మొండెమునకు తగిలించి ప్రాణము పోశాడు. గజముఖుడిని చూచి అందరూ ఆనందించారు. తల వంచుకుని నిలబడిన శనిని చూచిన పార్వతీదేవికి ఆగ్రహం కలిగింది. అంగహీనుడివి అవమని శాపం ఇచ్చింది. ఆ శాపమును వినిన సూర్యుడు ఆగ్రహంతో – అకారణంగా నీవు నా తనయుడిని శపించావు. కనుక నీ తనయునకు అంగ భంగము కలుగుగాక అని ప్రతి శాపమునిచ్చాడు. అక్కడ ఉన్న దేవతలు ఇద్దరినీ శాంతింప చేశారు. ప్రసన్నురాలైన పార్వతీదేవి తన శాపమును కొంత తగ్గించి – శనైశ్చరా! నా శాపము అమోఘము కాబట్టి నీవు అనుభవింపక తప్పదు. నా శాపం ప్రకారం నీవు కుంటివాడివి అవుతావు. హరునకు ప్రీతిపాత్రుడవుతావు. చిరంజీవి అవుతావు. యోగీంద్రుడవుతావు అని పలికింది. ఈ విధంగా పార్వతీదేవి



శాపకారణంగా శనైశ్చరుడు కుంటివాడయ్యాడు.

శనైశ్చరుడికి ఇతరుల ప్రతిభా పాటవములను ప్రశంసించే స్వభావం కూడా ఉన్నది. త్రేతాయుగమున అయోధ్యా నగరమును దశరథ మహారాజు ప్రజానురంజకముగా పరిపాలిస్తున్నాడు. ఒకనాడు ఆస్థాన జ్యోతిష్కులు దశరథ మహారాజుని కలుసుకుని ఇలా విన్నవించుకున్నారు. మహారాజా! శనైశ్చరుడు కృత్తికా నక్షత్రము నుండి రోహిణి లోనికి ప్రవేశించబోతున్నాడు. దానివల్ల 12 సంవత్సరములు కరువు కాటకములు సంభవిస్తాయి. దేశం దుర్భిక్షంగా మారిపోతుంది. కనుక మీరు ఎలాగైనా ప్రయత్నించి ఈ ఉత్పాతమును అడ్డుకోవాలి. జ్యోతిష్కుల మాటలకు దశరథ మహారాజు అలాగే చేస్తాను అని అభయమిచ్చాడు. పిదప దశరథుడు ఇంద్రుడు ఇచ్చిన విమానములో శనైశ్చరుడి లోకానికి వెళ్ళాడు. శనైశ్చరుడిని కలిసి – శనైశ్చరా! నా మాట విని నీవు రోహిణీ నక్షత్రము లోనికి ప్రవేశింపకుము. నా మాటను నిర్లక్ష్యము గావిస్తే నిన్ను యమ సదనానికి పంపిస్తాను అని పలికాడు. దశరథుడి పలుకులు శనైశ్చరుడికి ఆశ్చర్యము కలిగించాయి. ఆ ఆశ్చర్యముతోనే దశరథుడిని ప్రశ్నించాడు. మానవా! అసలు నీవు ఎవరవు? దేవతలు, అసురులు ప్రవేశించడానికి భయపడే నా లోకమునకు నీవు ఎలా వచ్చావు? శనైశ్చరా! నేను దశరథ నామధేయుడను. సూర్య వంశీయుడైన అజ మహారాజు తనయుడను. అయోధ్యాపతిని. జ్యోతిష్కుల ద్వారా నీవు రోహిణి యందు ప్రవేశించినట్లయితే దాని ప్రభావము వలన మా దేశము నందు 12 సంవత్సరాలు క్షామము ఏర్పడుతుందని తెలుసుకుని ఇక్కడకు వచ్చాను. నా మాటను మన్నించి నీవు రోహిణి లోనికి ప్రవేశించకుండా ఉన్నట్లయితే నా దేశం సుభిక్షంగా ఉంటుంది. నిన్ను నిరోధించడానికే ఇక్కడకు వచ్చాను అని దశరథుడు సమాధానమిచ్చాడు. దశరథుడి నిర్భీతికి, పౌరుషానికి, ధైర్య సాహసాలకి ముగ్ధుడయ్యాడు శనైశ్చరుడు. నీ కోరికను మన్నిస్తాను. నీవు కోరిన ప్రకారం నేను రోహిణి లోనికి ప్రవేశించను. నీకు వరమును ప్రసాదించాలని ఉంది. ఏ వరము కావలెనో కోరుకో అని పలికాడు శనైశ్చరుడు. శనైశ్చరా! నా దేశం సస్యశ్యామలంగా ఉండేటట్లు అనుగ్రహించండి అని వరమును కోరాడు దశరథుడు. దశరథుడు కోరిన వరమును ప్రసాదించాడు శనైశ్చరుడు. శనైశ్చరుడి వల్ల వరమును పొందిన దశరథుడు శనైశ్చరుడిని స్తుతించసాగాడు.

దేవా! మీరు సంతుష్టులు అయితే సుఖాలు ప్రాప్తిస్తాయి. ఇంటిలో భార్యాబిడ్డల వల్ల సుఖము ప్రాప్తిస్తుంది. ధర్మము, భగవంతుని పట్ల నమ్మకము వృద్ధి చెందడంతో పాటు ఆత్మశాంతి

క లుగుతుంది. ఏ వ్యక్తికైనా పూర్వజన్మ సుకృత దుష్కృత కర్మలకు ఫలితాలను ప్రదానం చేసే అధికారం మీకు ఉంది. మీ అనుగ్రహంతో రాజ్యం ప్రాప్తిస్తుంది. మీ ఆగ్రహంతో సర్వనాశనం జరుగుతుంది. మీ దృష్టి పడిన దేవతలు, రాక్షసులు, మానవులు, విద్యాధరులు మున్నగువారు దైన్యమునకు లోనవుతారు. వారు వీరు కాదు సర్వులూ నాశనమవుతారు అని స్తుతించిన దశరథునితో – దశరథా! నీ స్తోత్రమునకు ప్రసన్నుడైనాను. నీకు ఒక వరమును ప్రసాదించుచున్నాను. దశరథ కృత స్తోత్రమును పఠించినవారికి బాధలు తొలగిపోవడమే కాక ఇతర గ్రహముల వలన కలుగు బాధలు లేకుండా చేయుదునని పలికి దశరథుడిని దీవించాడు శనైశ్చరుడు.

శనైశ్చరుడు పదహారేళ్ళ ప్రాయం కల పిల్లల జోలికి పోడు. దీనికి సంబంధించిన కథ ఒకటి సంక్షిప్తంగా తెలుసుకుందాం. త్రేతాయుగంలో ఒకసారి అనావృష్టి వల్ల భయంకరమైన క్షామమేర్పడింది. కౌశిక ముని క్షామ పరిస్థితులకు తట్టుకోలేక తన నివాసమును వీడి వేరొక ప్రాంతమునకు బయలుదేరాడు. కుటుంబ పాలన భారమగుట వలన మార్గమధ్యంలోనే తన కుమారులలో ఒకడిని అతి కష్టము మీద విడిచిపెట్టి ముందుకు సాగిపోయాడు. ఆ పిల్లవాడు ఆకలి దప్పికలను తట్టుకోలేక రోదించసాగాడు. అతడికి ఒక పిప్పల (రావి) వృక్షము కనిపించింది. దానికి సమీపములోనే ఒక చెరువు కనిపించింది. ఆ పిల్లవాడు పిప్పల ఫలములను తిని చెరువు నీళ్ళు త్రాగి ఆకలి దప్పికలను తీర్చుకున్నాడు. శక్తి రాగానే భగవంతుని గురించి తపము చేయడం మొదలుపెట్టాడు. ఒకనాడు నారదమహర్షి అక్కడికి వచ్చి ఆ బాలకుని చూచాడు. ఆ బాలకుడు నారద మహర్షికి వందనమాచరించి ఉచితాసనము మీద కూర్చోబెట్టాడు. బాలకుడి వినయ విధేయతలకు ఆనందించాడు నారదుడు. అతడికి యజ్ఞోపవీత సంస్కారమొనరించి, వేదాధ్యయనము మొదలుపెట్టించాడు. ద్వాదశాక్షర వైష్ణవ మంత్రము 'ఓం నమో భగవతే వాసుదేవాయ'ను ఉపదేశించాడు. అతడు రోజూ విష్ణుభగవానుని ధ్యానిస్తూ ద్వాదశాక్షర మంత్రమును జపించసాగాడు. నారదుడు కూడా అక్కడే నివసించసాగాడు. బాలకుడి తపమునకు ప్రసన్నుడైన విష్ణుభగవానుడు ప్రత్యక్షమైనాడు. విష్ణుభగవానుడిని బాలకునికి పరిచయము చేశాడు నారదుడు. ఆ బాలకుడు ఆనందంతో దృఢభక్తిని ప్రసాదించమని వేడుకున్నాడు. విష్ణుభగవానుడు బాలకుడి పలుకులకు ఆనందించి, జ్ఞానము, యోగములను ఉపదేశించాడు. పిదప అతడిని ఆశీర్వదించి అంతర్ధానమయ్యాడు. భగవంతుడి ఉపదేశం వలన ఆ బాలకుడు మహాజ్ఞాని, మహర్షి అయ్యాడు.

ఒకసారి ఆ బాలకుడు నారదుడిని అడిగాడు. మహాత్మా! చిన్నతనంలోనే నాకీ కష్టాలు ఎందుకు కలుగుతున్నాయి? గ్రహాల ద్వారా నేను ఎందుకు బాధలు పడాల్సివస్తోంది. నా తల్లితండ్రుల గురించి నాకు ఏమీ తెలియటం లేదు. వారు ఎక్కడ ఉన్నారో? అర్థం కావడం లేదు. నా అదృష్టం బాగుండి మీరు నాకు యజ్ఞోపవీతము గావించి బ్రాహ్మణత్వమును ప్రసాదించారు. బాలకుడి ప్రశ్నలకు ఉత్తరమిస్తూ నారదుడు – శనైశ్చరుడు నీకు బాధలు కలిగిస్తున్నాడు. అతడు మందగతుడు కావున ఇంతకాలం నీవు బాధలు అనుభవింపవలసి వస్తున్నది. ఒకసారి ఆకాశం వైపు చూడుము. దేదీప్యమానముతో ప్రజ్వలిస్తున్న శనైశ్చరుడు కనిపిస్తున్నాడు అని పలికాడు. నారదుడి పలుకులు విన్న ఆ బాలకుడు క్రోధంతో ఆకాశం వైపు చూశాడు. ఆ కోప దృష్టికి ఆకాశంలో సంచరిస్తున్న శనైశ్చరుడు ఆకాశం నుండి భూమి మీద పడిపోయాడు. బాలకుడిని చూడగానే గజగజ వణికిపోయాడు. భయభీతుడై ఆ బాలకుడిని ప్రార్థించాడు. మహాత్మా! నేను చేసిన అపరాధమేమిటి? నన్ను దివి నుండి భువికి రప్పించారు అన్నాడు. ఆ బాలకుడు ఆగ్రహంతో 'ఓరీ దుర్మతీ! తల్లి తండ్రి లేని చిన్నవాడిని నన్ను ఎందుకు బాధలు పెడుతున్నావు? అని ప్రశ్నించాడు. బాలకా! నాది క్రూర దృష్టి. క్రూర స్వభావము. జాతకరీత్యా దుష్కర్ములున్నవారిని నేను శిక్షిస్తుంటాను. దయచేసి నన్ను వదిలిపెట్టు. నీవు చెప్పినట్లు నడుచుకుంటాను అని ప్రార్థించాడు శనైశ్చరుడు. అయితే చెబుతున్నాను విను అన్నాడు బాలుడు.

**శ్లో ॥ "అద్య ప్రభృతి బాలానాం వర్షదా షోడశాద్ గ్రహ**
**పీడా త్వయాన కర్తవ్యా ఏషతే సమయః కృతః"**

పిల్లలకు పదహారేళ్ళు వచ్చువరకు నీవు పిల్లలను బాధపెట్టవద్దు అన్న ఆ బాలకుడి ఆజ్ఞను విని అలాగే అని పలికి, నమస్కరించి దివికి వెళ్ళిపోయాడు శనైశ్చరుడు. పిప్పల వృక్ష ఫలములను భక్షిస్తూ తపము గావించుట వలన ఆ బాలకుడు పిప్పలాదుడయ్యాడు.

జాతకరీత్యా శనైశ్చరుడు ప్రతికూలముగా నున్నప్పుడు ఆయన అనుగ్రహానికై శాంతి ప్రక్రియలు చేయాల్సి ఉంటుంది. కపిల గోవు, నల్లని వస్త్రాలు, లోహం, పీచు ఉన్న కొబ్బరి కాయ మొదలైనవి దక్షిణతో సహా దానము చేయాలి. ఆంజనేయుడికి తమలపాకుల హారము వేసినవారు శనైశ్చరుడి అనుగ్రహమునకు పాత్రులవుతారు.

**శ్లో ॥ "నీలద్యుతి శూలధరః కిరీటిగృధ్రస్థిత స్త్రాణ కరోధనుష్మాన్**
**చతుర్భుజ సూర్యసుతః ప్రశాంతో వరప్రదో మేస్తు స మందగామి"**

నీలద్యుతుడు, శూలధారి, మకుటధారి, రక్షాసంకల్పుడు, ధనుర్ధారి, చతుర్భుజుడు, శాంతస్వభావుడు, మందగామి, సూర్యపుత్రుడు అయిన శనైశ్చరుడు వరాలను ప్రసాదించి చల్లగా కాపాడు గాక.

### శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**

(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషుల పిల్లలు అధిక ధనవ్యయమునకు ప్రతి వి షయంలో ఆర్గ్యుమెంట్స్, మొండి వైఖరిగా ఉంటారు. అధిక ఖర్చులు, ఆకస్మిక ధననష్టం. తెలియని విధంగా సమస్యలు రాగలవు. నిర్లక్ష్యం పనికిరాదు. శకునం చూసి బటయకు వెళ్లగలరు. భక్తిమార్గంలో బయటపడగలరు.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలం. ఆకస్మిక ధనలోటు తీరును. బంధుమిత్రుల కలయిక, విందు వినోదములు, గౌరవ మన్ననలు. స్త్రీల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండవలసిన రోజులు. ప్రతి విషయంలో మెలకువలు పాటించండి. భార్యకు అనారోగ్యం, నవగ్రహ ప్రదక్షిణ దానాలు చేయండి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఉద్రేకము వలన కుటుంబంలో కొన్ని విధములుగా అనారోగ్య సమస్యలు. కారణం లేకుండానే తగాదాలు. తక్కువగా మాట్లాడుట వలన, గురుజపం నిరంతరం చేయుట వలన మనశ్శాంతి కలిగి ఉండగలరు. ఆర్థికంగా కొంత వెసులుబాటు ఉంటుంది. గ్రహ ఆరాధన తప్పనిసరి. తలవంచుకొని ఉంటే సమస్యలు తలమీదుగా పోతాయి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు నూతన పరిచయములు, విందు వినోదములు, సంఘంలో గౌరవ మన్ననలు. అధికారుల వలన కొంత ఇబ్బంది. మనసులో భయం వదిలి సత్యనారాయణ స్వామి వ్రతం చేయండి. ఒక్క రూపాయి కూడా కట్న కానుకలు, బట్టలు తీసుకొనరాదు. పూజ ఫలితం రాదు.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు సంతోషంగా ఉండుటకు ప్రధాన కారణం వివాహ ప్రతయ్నములు ఫలించుట. బంధుమిత్రుల విందు వినోదము చాలా బిజీగా గడపగలరు. అధికారులతో మాట పట్టింపులు. డబ్బు మంచి నీరులాగ ఖర్చు అవుతుంది. గృహములో అనారోగ్య సూచనలు. సత్యదేవుని వ్రతం చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని సమస్యలు. గత నెలలోని పూర్తిగా బయట పడలేదు. అపనిందలు పాలు అగుదురు. సామాన్యంగా బ్రతకవలసి వస్తుంది. ఇది అంతా స్త్రీ వలన వచ్చిన నష్టం అనేది మరువకండి. మీ భార్యను బ్రతిమలాడుకొనండి. సత్యదేవుని వ్రతం చేయుట మంచిది.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఇంట బయట సమయాన్ని సద్వినియోగం పరచుకొనగలరు. తలకుమించిన భారం అయిన మోయగలరు. వివాహ ప్రయత్నములు ఫలించును. గృహ సంబంధమైన పనులు పూర్తి చేయగలరు. శత్రువులతో కొన్ని జాగ్రత్తలు తీసుకొనగలిగితే మీరు సక్సెస్ విందు వినోదములు సత్యదేవుని వ్రతం చేయండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. వృత్తి వ్యాపారములలో ఆకస్మిక ఆదాయ వనరులు కలసి వస్తాయి. బంధుమిత్రుల ఆదరాభిమానములు, విందు వినోదములు. శుభములకు అనుకూలమైన వాతావరణం ఉన్నది. సత్యదేవుని వ్రతమాచరించండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతిపనిలో అనుకూలత కలిగి ఉంటారు. విందు వినోదములు వివాహ ప్రయత్నములు సఫలీకృతం పొందగలరు. వస్తువాహన ఆభరణములు ఖరీదు ఎవరి శక్తికి తగిన విధంగా సమకూర్చుకొనగలరు దేవతారాధన సంతృప్తిని ఇస్తుంది.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలంగా ఉంటుంది. అధికారుల అనుగ్రహం ఉంటుంది. వస్తు వాహన యోగం ఉన్నది. ఆర్భాటములకు పోజులు ఇవ్వరాదు. సాధారణంగా సాధించుకొనగలరు. మాటలో నేర్పు ఓర్పు మీ పెట్టుబడి సత్యదేవుని వ్రతం చేయండి.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలంగా ఉంటుంది. విందు వినోదములు బంధుమిత్రుల కలయిక శుభకార్యములలో చాలా సంతోషంగా ఉండగలరు. అవసరానికి ధనం అందుతుంది. విశేషమైన ఫలితములు చూడగలరు. సత్యదేవుని వ్రతం చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు పంతాలకు పట్టింపులకు సమయం కాదు. మరో ప్రక్క అనారోగ్యము. మానసిక ఆనందం. అర్థం కాని మనోవేదనలకు గురికాక ప్రశాంతత కొరకు ఆదిత్య హృదయం పారాయణ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి అభిషేకం హోమం చేయండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**




**శ్రీ వేంకటేశం**
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

**ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.**

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. వాల్మీకి పూర్వనామం ఏది?
2. శ్రీవేంకటేశ పీఠం ఎప్పుడు స్థాపించబడింది?
3. రామానుజులవారి తల్లితండ్రులెవరు?
4. ధౌమ్యుడు ఎవరి కుమారుడు?
5. పాయసం కోసం తపస్సు చేసినదెవరు?
6. "మామేక శరణం వ్రజ" అన్నదెవరు?
7. రావణుడు ఏ గుణానికి ప్రతీక?
8. గోవింద దాసుని సొంత ఊరు ఏది?
9. జమదగ్ని తల్లి ఎవరు?
10. పరశురామునికి భార్గవాస్త్రాన్ని ఇచ్చిందెవరు?
11. "విజయ విరల" అనే పేరుతో శ్రీహరి చరిత్రను వ్రాసిందెవరు?
12. శ్రీహరి సేనాపతి ఎవరు?
13. అభిచారహోమం – వికటించి కర్తనే చంపింది. ఆ కర్త ఎవరు?
14. త్రివేణీ సంగమం ఎక్కడుంది?
15. సీతాదేవి జాడను చెప్పిందెవరు?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. భృగు మహర్షికి, 2. రథం రూపంలో, 3. పుండరీకాక్షులు, 4. విష్ణుపురాణం, 5. సోమకుడు, 6. సర్వ సంపదలు కలుగుతాయి, 7. త్రిజటకు, 8. సత్పురుషులను నిందించడం, 9. రాజ నర్తకి, 10. కాల యవనుడు, 11. సబేరా – అనే గదిలో, 12. ముచికుందుడు, 13. తిరువడి దండ, 14. భిల్ల దంపతులు, 15. భగవంతుడు

పేరు: ______

చిరునామా: ______

______

______

______

పిన్‌కోడ్: ______

ఫోన్: ______

## సరైన సమాధానాలు రాసినవారు

**ఎవరూ రాయలేదు**







RNI No.: APTEL/2008/23122 | Postel Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



If Un Delivered Please Return to:
**SRI VENKATESHAM,**
(Sri Venkateshwara Maha Mantra Peetham)
H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq